ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 27.07.2026 | సంపుటి :13 సంచిక : 07 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

### ఇది ముగింపు కాదు..
# ఆరంభం మాత్రమే

**ముందు ఇంకా చాలా పెద్ద ప్రయాణమే ఉంది**

**విద్యా వ్యవస్థలో పారదర్శకత, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు మా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది : సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**"ఇది ముగింపు కాదు. కేవలం ఆరంభమే. ముందు ఇంకా చాలా పెద్ద ప్రయాణమే ఉంది" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఎక్స్‌లో వీడియో సందేశాన్ని విడుదల చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై 37 రోజుల పాటు జంతర్‌మంతర్‌లో సాగిన ఆందోళనలు ముగిసిన నేపథ్యంలో ఆయన తన భావోద్వేగాలను పంచుకున్నారు. "విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, ప్రభుత్వం తమ ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో నిరసన విరమించినప్పటికీ.. ఇది ముగింపు కాదు. దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు మా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది.

మిగతా 2లో..



శాసనసభలు, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు.. శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించేలా కేంద్రం రాజ్యాంగ సవరణ చేపట్టాలి యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదే స్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలు వ్యవస్థలోని లోపాలను బయటపెడుతున్నాయి. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను ఎత్తివేసి, నష్టపోయిన కుటుంబాలకు సహాయం అందించాలి - సీఎం రేవంత్

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
# సరికొత్త నినాదం

- శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు.. శాసనమండలి, రాజ్యసభ ఎన్నికలకు 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించాలి
- ఈ మేరకు కేంద్రం రాజ్యాంగ సవరణ చేపట్టాలి
- అందరి అభిప్రాయాలను స్వీకరించి అధికారిక తీర్మానాన్ని కేంద్రానికి పంపుతాం
- యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుంది
- ప్రపంచస్థాయి సంస్థలకు నాయకత్వం వహిస్తోంది
- ఆందోళనల్లో నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలి
- జాతీయ మీడియా ప్రతినిధులతో సమావేశంలో సీఎం పలు కీలక వ్యాఖ్యలు

## జై జవాన్.. జై కిసాన్.. జై యువ..
### దేశ భవిష్యత్తులో యువత మరింత భాగస్వామం కావాలని..

హైదరాబాద్(జనంసాక్షి):'జై జవాన్ - జై కిసాన్ - జై యువ' అనే నూతన నినాదాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాసనసభలు, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో జాతీయ మీడియా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదే స్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డా రు. ఇటీవల నిర్వహించిన సీబీఎస్ఈ, నీట్, నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నేటి యువత 21 ఏళ్ల వయస్సులోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తోందని, ప్రపంచస్థాయి సంస్థలకు నాయకత్వం వహిస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు

మిగతా 2లో..

# మెరిసిన మీరాబాయి




**మహిళల వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయి చానుకు బంగారు పతకం**
**48 కేజీల విభాగంలో 190 కేజీల బరువు ఎత్తి పతకాన్ని కైవసం చేసుకున్న స్టార్ రెజ్లర్**



**పురుషుల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో రిషికాంత సింగ్ రజత పతకం**

**గ్లాస్గో(జనంసాక్షి):** కామన్వెల్త్ క్రీడల్లో 2026లో భారత్‌కు మీరాబాయి చాను తొలి స్వర్ణం అందించింది. మహిళల వెయిట్ లిఫ్టింగ్ 48 కేజీల విభాగంలో మీరాబాయి చాను 190 కేజీల బరువు ఎత్తి స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. నైజీరియా రూత్ అసుక్వో న్యోంగ్ (168 కేజీలు) రజతం, మలేసియాకు చెందిన ఐరీన్ జేన్ హెన్రీ (167 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. కామన్వెల్త్ క్రీడల్లో మీరాబాయికిది వరుసగా మూడోసారి గోల్డ్ మెడల్ కావడం విశేషం. 2018 (గోల్డ్ కోస్ట్), 2022 (బర్మింగ్‌హామ్)లోనూ ఆమె స్వర్ణ పతకం గెలుచుకుంది. రెజ్లర్లు సుశీల్ కుమార్ (2010, 2014, 2018), వినేశ్ ఫొగాట్ (2014, 2018, 2022) తర్వాత కామన్వెల్త్ క్రీడల్లో హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సాధించిన మూడో భారత అథ్లెట్‌గా చాను రికార్డు సృష్టించింది. కాగాకామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ ఖాతాలో రెండో పతకం చేరింది. పురుషుల వెయిట్ లిఫ్టింగ్ 60 కేజీల విభాగంలో

మిగతా 2లో..

## ఉత్తర తెలంగాణ అభివృద్ధికి
# గేమ్‌చేంజర్

- ఆదిలాబాద్ విమానాశ్రయానికి రూ.2వేల కోట్లు మంజూరు
- జిల్లాలో ప్రతిష్ఠాత్మక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటు
- మొత్తం 2వేలకు పైగా ఎకరాల భూమిని సేకరించనున్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ కల సాకారం దిశగా అడుగులు పడుతోంది. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. ఇందులో 1,609.23 ఎకరాలు



భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అవసరాల కోసం, 400 ఎకరాలు సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్‌ఓ, కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు. భూసేకరణతో పాటు ఇప్పటికే ఉన్న రహదారుల మళ్లింపు, 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ తాగునీటి

మిగతా 2లో..



# నిద్రలేచిన అన్నాహాజరే..

సమస్యలను పరిష్కరించడానికి చర్చలే సరైన మార్గం

నియంతృత్వ ధోరణితో ఏమీ సాధించలేం : అన్నాహజారే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర విద్యాశాఖ మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త అన్నాహజారే స్పందించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించడానికి చర్చలు మాత్రమే సరైన మార్గమని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు సృష్టించడం.. నియంతృత్వ ధోరణితో ఏమీ సాధించలేమన్నారు. ఇప్పటి వరకు తాను 22సార్లు నిరాహార దీక్ష చేశానని.. ఎన్నడూ

మిగతా 2లో..

### నీట్ లీకేజీ దుమారం రేపిన వేళ..
# కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు

- పరీక్షా విధానంలో సంస్కరణల కోసం హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్
- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు మోదీ ప్రకటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. "ఈ టాస్క్‌ఫోర్స్ పరీక్షల సంస్కరణలపై దృష్టి పెడుతుంది. కమిటీ నివేదిక అధారంగా విశ్వసనీయత దెబ్బతినకుండా భవిష్యత్‌లో పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రశ్నపత్రం లీకేజీని అరికట్టేందుకు కఠినమైన చట్టం తీసుకొస్తున్నాం. దీనికి సంబంధించిన బిల్లును సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెడతాం. విశ్వసనీయమైన, పారదర్శకమైన పరీక్ష విధానం అమలు చేస్తాం. పరీక్షల నిర్వహణలో అత్యున్నత టెక్నాలజీని



మిగతా 2లో..



## పెద్ది సుదర్శన్‌రెడ్డికి
# తీవ్ర అస్వస్థత


**మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు**

**వరంగల్(జనంసాక్షి):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హనుమకొండలోని నివాసంలో ఉండగా ఇవాళ ఉదయం ఆయనకు గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన రోహిణి ఆసుపత్రికి తరలించారు.

మిగతా 2లో..

# అడుగంటుతున్న అమెరికా ఆయుధ నిల్వలు

**ఆందోళనలో ట్రంప్ యంత్రాంగం**



**వాషింగ్టన్(జనంసాక్షి):** ఇరాన్‌పై దాడుల విషయంలో అమెరికా కొంచెం వెనక్కితగ్గింది. తమ వద్దనున్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో క్షిపణుల నిల్వలు తగ్గిపోతున్నాయనే ఆందోళనల నేపథ్యంలోనే ఇరాన్‌పై సైనిక చర్యలు తీవ్రం చేసే ప్రణాళికలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. సీనియర్ సలహాదారులతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా దళాలు, స్థావరాల రక్షణ కోసం పోరాడితే నిల్వలు వేగంగా కరిగిపోవచ్చని సైనికాధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం

మిగతా 2లో..

# చమురు ఉత్పత్తికి భారీ దెబ్బ

**సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై హూతీల దాడి..**

**టెహ్రాన్(జనంసాక్షి):**ఓ వైపు అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతుంటే మరోవైపు సౌదీ అరేబియా-హూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులు ప్రపంచాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇరాన్ మద్దతు గల హూతీ తిరుగుబాటుదారులు ఎర్రసముద్రంలో దిగ్బంధనాన్ని ప్రకటించారు. సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీని కూడా లక్ష్యం చేసుకున్నట్లు హూతీలు వెల్లడించారు. యెమెన్‌పై సౌదీ జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు చేసినట్లు ప్రకటించారు. యెమెన్‌పై దిగ్బంధనం ఎత్తివేసే వరకు ఎర్ర సముద్రంలో నౌకలను అడ్డుకుంటామ న్నారు. దాడి కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఘటన నేపథ్యంలో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం మంటలు



అదుపులోకి వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆస్తి, ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు. ఇప్పటికే అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా చమురు ధరలు భగ్గుమంటున్నాయి. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకోవడంతో ధరలు భారీగా పెరిగాయి. ఇప్పుడు సౌదీ అరేబియాకు చెందిన నౌకల రాకపోకలను అడ్డుకోవడానికి బాబ్ ఎల్-మాండెబ్ జలసంధిని

మిగతా 2లో..

# హర్మూజ్‌లో 'రుసుము'పై చర్చలు సానుకూలం

**జలసంధిపై ఇరాన్, ఒమన్ సంప్రదింపులు**

**టెహ్రాన్(జనంసాక్షి):**హర్మూజ్ జలసంధి నిర్వహణ విషయంలో ఒమన్‌తో చర్చలు సానుకూలంగా జరుగుతున్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ తెలిపారు. రెండు రోజులపాటు ఇరుదేశాల డిప్యూటీ విదేశాంగశాఖ మంత్రులు టెహ్రాన్‌లో దీనిపై విస్తృత చర్చలు జరిపినట్లు ఆయన వెల్లడిం చారు. ఇరుదేశాల సార్వభౌమాధికారానికి నష్టం వాటిల్లకుండా, వాణిజ్య నౌకల రాకపోకలకు

మిగతా 2లో..

# ఇకపై ఏ ఎన్నికల్లో పోటీచేయను



- సిద్ధరామయ్య ప్రకటన
- వయసు పైబడటం, అనారోగ్య కారణాలతో నిర్ణయమని వెల్లడి

**బెంగుళూరు(జనంసాక్షి):**తాను 2028 అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇకపై ఏ ఇతర ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య ప్రకటించారు. రాజకీయ రంగం అవినీతిమయంగా

మిగతా 9లో..

## పీవోకేను పాక్ అక్రమంగా
# ఆక్రమించుకుంది

**మనం అంతరిక్షం వైపు అడుగులేస్తుంటే..**
**పాక్ చొరబాటు మార్గాలను వెతుకుతోంది : రాజ్‌నాథ్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత్ ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, స్పేస్ మిషన్ల వైపు అడుగులు వేస్తుంటే.. పాక్ మాత్రం చొరబాటు మార్గాలను వెతుక్కుంటోందని ఎద్దేవా చేశారు. మనం డేటా సెంటర్లను నిర్మిస్తుంటే..

మిగతా 2లో..

## శ్రీరామ్‌సాగర్ వద్ద
# తీవ్ర విషాదం

- ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృతి
- జలాశయంలో నుంచి మృతదేహాల వెలికితీత

2లో..




# మెరిసిన మీరాబాయి

మణిపూర్ వెయిట్ లిఫ్టర్ రిషికాంత సింగ్ రజత పతకం సాధించాడు. మొత్తం 264 కేజీలు ఎత్తి ఈ కామన్వెల్త్ పోటీల్లో భారత్‌కు తొలి రజత పతకాన్ని అందించాడు. మలేసియాకు చెందిన అనిక్ బిన్ కాస్డాన్ స్వర్ణం, కెన్యాకు చెందిన జోషువా అముంగా కాంస్య పతకాలు నెగ్గారు. తొలుత స్నాచ్ విభాగంలో 121 కేజీలు ఎత్తిన రిషికాంత.. క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో చివరి ప్రయత్నంలో 151 కేజీలు ఎత్తే క్రమంలో విఫలమయ్యాడు. ఈ విభాగంలో మూడు ప్రయత్నాల్లో భాగంగా తొలుత 143 కేజీలు ఎత్తగా, తర్వాతి రెండు ప్రయత్నాల్లో విఫలమయ్యాడు. దీంతో రిషికాంత 264 కేజీల ఎత్తి రెండో స్థానానికి పరిమితమయ్యాడు. స్వర్ణం నెగ్గిన మలేషియా ఆటగాడు అనిక్ బిన్ తొలుత స్నాచ్ విభాగంలో మూడు ప్రయత్నాల్లో భాగంగా గరిష్ఠంగా 121 కేజీలే ఎత్తాడు. రిషికాంత సైతం 121 కేజీలు ఎత్తడంతో భారత్ స్వర్ణంపై ఆశలు పెట్టుకుంది. అయితే దురదృష్టవశాత్తు క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో చివరి ప్రయత్నంలో రిషికాంత విఫలం కావడంతో భారత్ ఆశలు చెదిరిపోయాయి. చివరి ప్రయత్నంలో మలేసియా ఆటగాడు 152 కేజీలు ఎత్తి స్వర్ణం తన ఖాతాలో వేసుకున్నాడు. బర్మింగ్‌హామ్‌లో 2022 కామన్వెల్త్ పోటీల్లో 55 కేజీల విభాగంలో బరిలోకి దిగిన రిషికాంత అప్పుడు పతకం కొట్టకుండానే వెనుదిరిగాడు. అనంతరం 60 కేజీల విభాగానికి మారిపోయాడు. 2025లో అహ్మదాబాద్‌లో జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో 271 కేజీలు ఎత్తిన రిషికాంత.. గోల్డ్ మెడల్ సాధించి జాతీయ రికార్డు నెలకొల్పాడు. దీంతో అంతర్జాతీయ పోటీలకు నేరుగా అర్హత సాధించాడు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డికి తీవ్ర అస్వస్థత..

చికిత్స అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు వెల్లడించారు.“ కార్డియాక్ అరెస్ట్‌కు గురైన సుదర్శన్‌రెడ్డిని రోహిణి ఆసుపత్రికి తీసుకొచ్చారు. దాదాపు గంట సేపు సీపీఆర్ చేశాక పేషెంట్ రెస్పాండ్ అయ్యారు. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళం ఫల్మనో ఆర్టీలో రక్తం గడ్డ కట్టడంతో బ్లాక్‌లు ఏర్పడ్డాయి. అవి కరగటానికి ఇంజెక్షన్ ఇచ్చాం. యాంజియోగ్రామ్ చేశాం. పల్స్ కూడా నార్మల్‌గానే ఉది. కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు వెంటిలేటర్ సాయంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నాం” అని చికిత్స అందించిన కార్డియాలజిస్ట్ డాక్టర్ మమత రెడ్డి వెల్లడించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు

అవలంబిస్తాం” అని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు.
టాస్క్ ఫోర్స్ సభ్యులు వీళ్లే..
నందన్ నీలేకనితో పాటు మరో ఐదుగురు ఈ టాస్క్ ఫోర్సులో సభ్యులుగా ఉంటారు. యస్. సోమనాథ్ (ఇస్రో మాజీ ఛైర్మన్), తపన్ దేకా (ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్), వి. కామకోటి (ఐఐటీ మద్రాస్ డైరెక్టర్), అనితా కర్వాల్ (కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి), అమృత్ లాల్ మీనా (లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు).
ప్రధాన బాధ్యతలు: ఎన్‌టీఏ పరీక్ష వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం..పరీక్షల్లో సాంకేతిక భద్రతను బలోపేతం చేయడం.పేపర్ లీకులు, మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు కొత్త వ్యవస్థలు రూపొందించడం.పరీక్షల నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు సూచించడం.డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫార్సు చేయడం.భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం

## అనాహత్ విజయం దేశ యువతకు స్ఫూర్తిదాయకం

**ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌గా నిలిచిన భారత యువ సంచలనం అనాహత్ సింగ్‌ను ప్రధాని మోదీ అభినందించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశంసించారు. అనాహత్ విజయం దేశానికి గర్వకారణమన్నారు. ఈ ఘనత భారత స్క్వాష్ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్తతరం క్రీడాకారులకు ఈ విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని.. యువతలో స్క్వాష్ క్రీడపై ఆసక్తిని మరింత పెంచుతుందని ప్రధాని మోదీ తన సందేశంలో తెలిపారు.ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ 2026 టైటిల్‌ను గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా అనాహత్ సింగ్ రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20వ స్థానంలో ఉన్న అనాహత్.. రుకాయ సాలెమ్ (ఈజిప్ట్)ను ఓడించింది. ఈ టోర్నీలో పతకం సాధించడం అనాహత్‌కు ఇది వరుసగా రెండోసారి. నిరుడు కాంస్యం నెగ్గిన ఆమె ఈసారి స్వర్ణం చేజిక్కించుకుంది. 18 ఏళ్ల ఈ యువ క్రీడాకారిణి ఇప్పటికే ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకుంది.2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ తరఫున పాల్గొన్న అత్యంత పిన్నవయస్కురాలిగా (14 ఏళ్లు) రికార్డు సృష్టించింది. అదే ఏడాది ఆసియా క్రీడల్లో రెండు కాంస్య పతకాలు (మహిళ టీమ్, మిక్స్‌డ్ డబుల్స్) గెలుచుకుంది. సీనియర్ జాతీయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో 2023 నుంచి వరుసగా మూడేళ్లపాటు విజేతగా నిలిచింది. అనాహత్ సింగ్ 2008 మార్చి 13న దిల్లీలో జన్మించింది. ఒలింపిక్ విజేత పి.వి. సింధు ఆమెకు స్ఫూర్తి. తొలుత బ్యాడ్మింటన్ ఆడిన అనాహత్.. తన సోదరి అమీరాను చూసి స్క్వాష్‌వైపు ఆకర్షితురాలైంది. 10 ఏళ్ల వయసులోనే దీనిని ప్రొఫెషనల్ గేమ్‌గా ఎంచుకుంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్ గేమ్స్‌లో తొలిసారిగా స్క్వాష్‌ను చేర్చారు. అందులో ఆడి భారత్‌కు బంగారు పతకం తీసుకురావడమే తన లక్ష్యమని అనాహత్ చెబుతోంది.

## పీవోకేను పాక్ అక్రమంగా ఆక్రమించుకుంది

వాళ్లు ఉగ్రవాద కేంద్రాలను అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే అది పీవోకే కోసమే తప్ప మరే విషయంలోనూ జరగబోవని పేర్కొన్నారు. పీవోకేను పాక్ అక్రమంగా ఆక్రమించుకుందని మండిపడ్డారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని యుద్ధ స్మారక చిహ్నం వద్ద మాట్లాడుతూ కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధంలో దేశం సాధించిన విజయాన్ని భారతమాత కిరీటంలో పొదిగిన వజ్రంగా అభివర్ణించారు.పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని తమ దేశ విధానంలో ఒక భాగంగా మార్చుకుందని రాజ్‌నాథ్ సింగ్ దుయ్యబట్టారు. ఉగ్రవాదులను అడ్డు పెట్టుకొని.. భారత్‌ను బెదిరించడానికి ప్రయత్నిస్తే ఏమవుతుందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచమంతా చూసిందన్నారు. పాక్ చేసే ఏ దుస్సాహస చర్యకైనా.. వారి ఊహకందని రీతిలో మన సైన్యం ప్రతిస్పందిస్తుందన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త నినాదం

సాంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 21 ఏళ్లకు సవరించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు.ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగస్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పార్లమెంట్ సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్తుకు అవసరమని తెలిపారు.

# ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్

పైప్‌లైన్ల మార్పు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి అన్ని అనుబంధ పనులకు అవసరమైన నిధులను కూడా ఈ పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు.ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ రాష్ట్రానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్‌ఫీల్డ్ వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు విశేష ఊతం లభిస్తుందన్నారు. దీనితో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో నిరంతర సమన్వయం ఫలితంగానే ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వ్యయంతో పాటు అన్ని అడ్డంకుల తొలగింపు ఖర్చును కూడా భరిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పిడి పనులను ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు.

## చమురు ఉత్పత్తికి భారీ దెబ్బ

మూసివేస్తామని తిరుగుబాటుదారులు ప్రకటించడంతో.. చమురు రవాణా నౌకలకు మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఆ జలసంధి ఎర్ర సముద్రాన్ని.. గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో కలిపే ఒక కీలకమైన నౌకా రవాణా మార్గం. దీంతో ప్రపంచ వాణిజ్యంలో సుమారు 12 శాతం చమురు రవాణా ఇదే మార్గం గుండా వెళ్తుంది.

## హర్మూజ్‌లో ‘రుసుము’పై చర్చలు సానుకూలం

అంతరాయం ఏర్పడకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా సాంకేతిక, రాజకీయ పరమైన అంశాలపై చర్చలు జరిగినట్లు తెలిపారు. అమెరికా దళాలు దాడులు నిలిపివేయడంతో ఒమన్‌తో చర్యలు పురోగమిస్తున్నాయని ఆయన అన్నారు. హర్మూజ్ గుండా ప్రయాణించే నౌకలకు సేవా రుసుములు విధించడంపై చర్చిస్తామని ఒమన్, ఇరాన్ దేశాలు జూన్‌లోనే ప్రకటించాయి. అది అమెరికాకు రుచించలేదు. దీంతో ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందం కుదిరిన రోజుల వ్యవధిలోనే .. హర్మూజ్ కేంద్రంగా మరోసారి వివాదం మొదలైంది. హర్మూజ్‌పై పట్టు సాధించేందుకు అమెరికా మరోసారి దాడులు మొదలు పెట్టింది. యూఎస్‌ఏ చర్యలను ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటించింది. హర్మూజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది. తమ అనుమతి లేకుండా ఒక్క నౌకను కూడా హర్మూజ్ దాటనివ్వబోమని హెచ్చరించింది. దీంతో హర్మూజ్‌కు మరోవైపు ఉన్న ఒమన్ తీరం గుండా నౌకలు ప్రయాణించేలా అమెరికా ప్రోత్సహించింది. అందుకు ఒమన్ కూడా అంగీకరించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్.. బెదిరింపులకు దిగడంతో ఆ దేశం మిన్నకుండిపోయింది. గత కొన్ని రోజులుగా ఇరాన్‌పై అమెరికా దాడులు నిలిపివేయడంతో.. టెహ్రాన్, మస్కట్ మధ్య చర్చలు ఊపందుకున్నాయి.

## అడగంటుతున్న అమెరికా ఆయుధ నిల్వలు..

ఆందోళన చెందుతోంది.ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ చౌకగా తయారు చేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తోంది. ఒక్కో డ్రోన్ ధర కేవలం 20వేల నుంచి 50వేల డాలర్లలోపే. అయితే వీటిని ఎదుర్కోవడానికి అమెరికా వినియోగిస్తున్న ఒక్కో ఇంటర్‌సెప్టర్ క్షిపణి ధర మాత్రం 1.5 మిలియన్ డాలర్ల పైమాటే. ఆర్థికపరమైన ఈ అంతరం యుద్ధంలో అమెరికాపై ప్రభావం చూపనుందని నిపుణులు అంటున్నారు.అంతే కాకుండా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు తీవ్రం చేయడంతో అమెరికాకు చెందిన అనేక స్థావరాలు దెబ్బతిన్నాయి. వాటిని రక్షించడానికి పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ ఇంటర్‌సెప్టర్‌లు ఇతర ఆయుధాలను పెద్ద మొత్తంలో ఉపయోగించింది. ఫలితంగా ప్రస్తుతం ఆయా ఆయుధాల కొరత ఏర్పడింది. ఈ దాడులు ఇలాగే కొనసాగితే పశ్చిమాసియా దేశాల్లో సైనిక కార్యకలాపాలను పర్యవేక్షించే యూఎస్ సెంట్రల్ కమాండ్‌కు అందుబాటులో ఉన్న ఇంటర్‌సెప్టర్ నిల్వలు గణనీయంగా తగ్గిపోతాయని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్ హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ మాట్లాడుతూ యుద్ధాన్ని కొనసాగించడం కంటే ట్రంప్ దౌత్యపరమైన పరిష్కారాన్నే ఇష్టపడతారని పేర్కొన్నారు. కానీ గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తే మాత్రం అమెరికా తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. మరోవైపు యుద్ధం విషయంలో మధ్యవర్తిత్వం వహించమని శనివారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖతార్, పాకిస్థాన్‌లను కోరినట్లు తెలుస్తోంది.

## ఇది ముగింపు కాదు.. ఆరంభం మాత్రమే

గత 37 రోజులు నా జీవితంలో అత్యంత కఠినమైనవి. ఇప్పుడు ఎలాంటి ఆందోళన లేదు. రాత్రి ప్రశాంతంగా నిద్రపోయి, ఉదయం లేచిన తర్వాత సాయంత్రం వరకు ఏమవుతుందో అనే టెన్షన్ లేకుండా ఉండగలుగుతున్నాను. జంతర్‌మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. దేశం కోసం మీరు చేసిన త్యాగాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. మీ అందరి మద్దతు వల్లే ఈ ఉద్యమం విజయవంతమైంది. తమను విమర్శించిన వారికీ ప్రత్యేక ధన్యవాదాలు. మీ విమర్శలే మమ్మల్ని మరింత మెరుగ్గా పనిచేసేలా చేశాయి” అని పేర్కొన్నారు.

## నిద్రలేచిన అన్నాహజారే..

హింసను ఆశ్రయించలేదన్నారు. శాంతియుత ఆందోళనలే శాసనపరమైన మార్పులు తీసుకురావడానికి దోహదపడ్డాయన్నారు. తాను చేపట్టిన శాంతియుత నిరసనల కారణంగా.. 10 చట్టాలు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వాలు పౌరుల మాట వినాలని.. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని హజారే సూచించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రెండు అడుగులు ముందుకు వేయాల్సి వచ్చినా.. అందులో ఏ తప్పు ఉండబోదని పేర్కొన్నారు. మన నిర్ణయాలు ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉండటమే ముఖ్యమన్నారు. మంత్రుల రాజీనామా వంటి డిమాండ్లను సైతం శాంతియుత పద్ధతిలో సాధించుకోవాలని తెలిపారు. హింసాత్మక (ఎతినీశ్రీవనిఇవ) నిరసనల కంటే శాంతియుత నిరసనలు, చర్చలే ప్రజల్లో, పాలనలో మార్పు తీసుకువస్తాయన్నారు. ఎంతటి పరిస్థితులు ఎదురైనా హింసను మాత్రం ఆశ్రయించొద్దని ప్రజలకు, ప్రభుత్వానికి సూచించారు. ఇదీ చదవండి: ఇది ముగింపు కాదు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మోసాలు..

**లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాలి:సజ్జనార్**

హైదరాబాద్(జనంసాక్షి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ (ాజీతీతీజీనిజీతీ) హెచ్చరించారు. రూ.10,000 ఈఎండీ చెల్లింపుల పేరుతో నకిలీ కాల్స్, లింకుల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. డబ్బులు చెల్లిస్తే ఇల్లు ఇప్పిస్తామంటూ మోసగాళ్లు చెప్పే మాటలు నమ్మొద్దని సూచించారు. “ఈ రోజే చివరి తేదీ అంటూ భయపెట్టి డబ్బులు కాజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాట్సప్, ఎస్ఎంఎస్‌లలో వచ్చే అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయొద్దు. ంనిఎఆవబని, ఁవజీఎతివవిలివతీ వంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లు ఇన్‌స్టాల్ చేయవద్దు. యూపీఐ పిన్.. రీఫండ్ కోసం అవసరం లేదు, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పొద్దు. ఆధార్, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు అపరిచితులతో పంచుకోవద్దు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకం.. దళారులకు ఎలాంటి అవకాశం లేదు. ఇల్లు కేటాయించకపోతే ఈఎండీ మొత్తాన్ని ప్రభుత్వమే దరఖాస్తుదారుడి బ్యాంకు ఖాతాలోకి తిరిగి జమ చేస్తుంది.

## చైనాను వణికిస్తున్న ‘నౌల్’.. రెడ్ అలర్ట్ జారీ

బీజింగ్(జనంసాక్షి): చైనాలోని పలు ప్రాంతాల్లో భారీ తుపాను ‘నౌల్’ బీభత్సం సృష్టిస్తోంది. చైనా జాతీయ వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ అతి తీవ్ర తుపాను ప్రభావం వల్ల దక్షిణ చైనాలో తీవ్ర స్థాయిలో గాలులు, భారీ వర్షాలు కురిశాయి. ఈ ప్రభావం ఎక్కువగా ఉన్న గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో 3లక్షలకు పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాలతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. శనివారం 410కి పైగా విమానాలు.. 150 హై-స్పీడ్ రైలు సర్వీసులను రద్దు చేశారు. దీంతో వేలమంది ప్రయాణికులపై ప్రభావం పడింది. పొరుగున ఉన్న హాంకాంగ్‌పైనా ఇది విరుచుకుపడి విధ్వంసం సృష్టిస్తోంది. ఈ తుపాను గంటకు సుమారు 145 కిలోమీటర్ల (90 మైళ్ల) గరిష్ట వేగంతో వాయువ్య దిశగా కదులుతోంది. ఫలితంగా పెద్దఎత్తున చెట్లు కూలిపోయాయి. గ్వాంగ్‌డాంగ్ తీరాన్ని తాకడానికి ముందు ఇది మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. తీరాన్ని తాకిన తర్వాత ఉత్తర-వాయువ్య దిశగా ప్రయాణించి.. క్రమంగా బలహీనపడుతుందని పేర్కొంది. దీంతో గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. దేశ రాజధాని బీజింగ్‌తో సహా అనేక ప్రధాన నగరాల్లో ప్రజలకు ఆశ్రయం కల్పించడానికి 28 అత్యవసర సహాయ పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ తుపాను కారణంగా తూర్పు తైవాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇదీ చదవండి: స్పెయిన్, ఫ్రాన్స్ సరిహద్దుల్లో కార్చిచ్చు.. 2లక్షల మందికి పైగా తరలింపు

## భారతీయ కరెన్సీకి ఒకే..

**రూ.200, రూ.500 కరెన్సీని అనుమతించిన నేపాల్**

ఖాట్మండు(జనంసాక్షి):భారత కరెన్సీపై నేపాల్‌కీలక ప్రకటన చేసింది. గతంలో రూ.100 నోట్లను మాత్రమే అనుమతించిన ఆ దేశం.. ఇకపై రూ.200, రూ.500 నోట్లు కూడా తమ దేశంలో వినియోగించవచ్చని పేర్కొంది. ఈ మేరకు నేపాల్ రాష్ట్ర బ్యాంక్ ప్రతినిధి గురు ప్రసాద్ పౌడెల్ వెల్లడించారు. భారత్‌లో పెద్ద నోట్ల రద్దు అనంతరం కేవలం రూ.100 నోటును మాత్రమే నేపాల్ అనుమతిస్తూ వస్తోంది. ఇక నుంచి 2016 నవంబర్ 9 లేదా ఆ తర్వాత జారీ చేసిన రూ.200, రూ.500 భారత కరెన్సీని కూడా అనుమతిస్తామని నేపాల్ పేర్కొంది.తాజా నిబంధనల ప్రకారం... రూ.100 లోపు విలువ కలిగిన నోట్లతో పాటు రూ.200, రూ.500 నోట్లను నేపాల్‌లోకి తీసుకురావొచ్చు లేదా బయటకు తీసుకెళ్లొచ్చన్నమాట. గరిష్ఠంగా రూ.25 వేల వరకు పరిమితి విధించింది. దీనివల్ల భారత్, నేపాల్ సరిహద్దుల్లో నగదు బదిలీ మరింత సులభతరం కానుంది. నేపాలీ జాతీయులకు, భారత పర్యటకులకు సౌకర్యంగా మారనుంది. అదే సమయంలో ఇతర దేశాల నుంచి తీసుకొచ్చిన భారత కరెన్సీని అనుమతించబోమని స్పష్టం చేసింది.

# నెరవేరిన చిరకాల స్వప్నం

## కొమురవెల్లిలో కొత్త రైల్వేస్టేషన్ ప్రారంభించిన మంత్రులు

**కొమురవెల్లి(జనంసాక్షి):**సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్‌ను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని చెప్పారు.

**తీరనున్న భక్తుల ఇబ్బందులు:**మల్లన్న భక్తులు కొమురవెల్లి చేరుకునేందుకు ప్రస్తుతం బస్సులు, ఇతర వాహనాల్లో వస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. బస్సుల్లో వచ్చే భక్తులు రాజీవ్ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న కొమురవెల్లికి చేరుకోవడానికి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు ప్రధాన రహదారిపై గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చేది. రోడ్డు ప్రయాణం ద్వారా హైదరాబాద్ నుంచి సుమారు 110 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 90 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ రెండు మూడు వాహనాలు మారాల్సి వస్తోంది. చేర్యాల, మద్దూరు, ధూల్మిట్ట మండలాల ప్రజలకు సైతం రైలు ప్రయాణం అందుబాటులోకి రానుంది. చదువుల కోసం వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు నిత్యం సుమారు 100 నుంచి 200 మంది వెళ్తుంటారు. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారికి ఒక్కొక్కరికి సుమారు రూ.100 నుంచి రూ.200, కరీంనగర్ నుంచైతే రూ.100- 150 ఖర్చు తప్పదు. రైలు ప్రయాణమైతే సగం ఖర్చు భారం తగ్గుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నిలుపుదల చేసే రైళ్ల వివరాలు..

సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వరకు నడుస్తున్న 4 డెమూ రైళ్లకు ప్రతి రోజూ ఈ స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పించారు.సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వచ్చే 77654 డెమూ రైలు బుధవారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 2:38 గంటలకు.. 77656 డెమూ రైలు గురువారం మినహా ప్రతి రోజూ ఉదయం 6:45 గంటలకు కొమురవెల్లికి చేరుకుంటుంది.సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్లే 77653 డెమూ రైలు బుధవారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12:44 గంటలకు, 77655 డెమూ రైలు ప్రతిరోజూ రాత్రి 8:04 గంటలకు కొమురవెల్లికి చేరుకుంటుంది

# శ్రీరామ్‌సాగర్ వద్ద తీవ్ర విషాదం

నిజామాబాద్ (జనంసాక్షి):ఈత సరదా యువకుల ప్రాణాల మీదకు తెస్తోంది. ఓవైపు ఈతపై సరైన ప్రావీణ్యం లేకపోవడం, మరోవైపు జలాశయాల లోతుపై అంచనా లేమి, పర్యవేక్షణ కొరవడటం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుతోంది. రాష్ట్రంలో నిత్యం ఏదో చోట జరుగుతున్న ఈ విషాద ఘటనలు ఆందోళనను కలిగిస్తున్నాయి. తాజాగా ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృత్యువాత పడిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. శ్రీరామ్‌సాగర్ జలాశయంలో ఈతకు వెళ్లిన నలుగురు యువకుల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. వివరాల్లోకి వెళితే ముప్కాల్ వద్ద ఎస్?ఆర్ఎస్పీలోకి నలుగురు యువకులు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జలాశయంలో మునిగి ముగ్గురు మృతిచెందారు. సమాచారం అందుకున్న స్థానికులు జలాశయంలోంచి ముగ్గురి మృతదేహాలను వెలికి తీశారు. ఈతకు వెళ్లిన వారిలో ముగ్గురు నిజామాబాద్ వాసులు, ఒకరు హైదరాబాద్?కు చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనతో యువకుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. చేతికి అందివచ్చిన యువకులు మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈతకు వెళ్లి మృతి చెందుతున్న వారిలో 5 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న వారే ఎక్కువశాతం ఉంటున్నారు. పిల్లలకు ఈత కొట్టడం రాకపోయినా చెరువులు, బావులకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా 10 సంవత్సరాల వయసున్న పిల్లలు ప్రమాదాన్ని అంచనా వేయడంలో విఫలమై విగత జీవులుగా మారుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలిసీతెలియని వయసులో ప్రాణాలు కోల్పోయి కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చుతున్నారు. ఇక 15 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నవారు కూడా ఈత కొట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో జలాశయాల్లో మునిగి ఈతరాక విగత జీవులుగా మారుతున్నారు.ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే ఈత రాని వారు మాత్రమే నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారని అనుకుంటే పొరపాటే. ఎందుకంటే స్విమ్మింగ్ వచ్చిన వారు సైతం ప్రమాదాలు, అక్కడి పరిస్థితులను అంచనా వేయడంలో విఫలమై విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. చెరువులు, కుంటలు, కాలువల్లోని బురద, నాచు, నీటి లోపల రాళ్లు ఉండటం కారణంగా ఈత వచ్చిన వారూ చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్నాయి. అందుకే అందరూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలనేది గుర్తుంచుకోవాల్సిన అంశం. మరికొన్ని సందర్భాల్లో కొంతమంది తమ తోటి స్నేహితులు మునుగుతున్నపుడు రక్షించే క్రమంలో వారితో పాటు ప్రాణాలు కోల్పోతున్నారు.



## ఉక్రెయిన్‌లో నౌకపై దాడి..

**ఇద్దరు భారతీయుల గల్లంతు**

కీవ్(జనంసాక్షి):ఉక్రెయిన్‌కు చెందిన ఒడెసా పోర్టు వద్ద భారతీయ నావికులున్న వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు సురక్షితంగా బయటపడగా, మరో ఇద్దరి జాడ తెలియరాలేదు. నల్ల సముద్రంలో ఒడెసా ఓడరేవు వద్ద ‘ఎంవీ ఏజీఎన్ రాగ్నర్’ మర్చంట్ నౌకపై శనివారం (జులై 25న) దాడి జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై ఉక్రెయిన్‌లోని భారతీయ రాయబార కార్యాలయం (ఎనిటతిజీని ఇఎజీబబఎ స్పందించింది. దాడి జరిగిన సమయంలో నౌకలో నలుగురు భారతీయులు ఉన్నట్లు వెల్లడించింది. ఇద్దరు గల్లంతు అయ్యారని, మరో ఇద్దరు సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. గల్లంతైన సిబ్బంది కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎంబసీ పేర్కొంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఇందుకోసం ఉక్రెయిన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది.

# నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా:ప్రహ్లాద్ జోషి



న్యూఢిల్లీ(జనంసాక్షి):తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమితులైన ప్రహ్లాద్ జోషి (ఖతీజీశ్రీష్ట్రజీట ఏనీబష్ట్రతి) అన్నారు. విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఎంతో వినయంతో ఈ బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు ఎక్స్‌వేదికగా వెల్లడించారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించిన ఆందోళనలు తీవ్రమైన నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి.. ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ మంత్రిగా ఉన్న ఆయన.. ఇవాళ్టి నుంచి విద్యా శాఖ అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు.

# ప్రమాదకర గుంతల పూడ్చివేత

**'జనంసాక్షి' కథనానికి స్పందన**

- చాల్కి, చీకూర్తి - బీదర్ సరిహద్దు రోడ్డుకు త్వరలో టెండర్
- రూ.2లక్షలతో పూర్తిస్థాయి మరమ్మతులు
- ఆర్అండ్‌బీ ఏఈ భరత్ చంద్రారెడ్డి 'జనంసాక్షి'కి వివరణ






**న్యాల్‌కల్, జూలై 26 (జనంసాక్షి) :** "రాష్ట్ర సరిహద్దు రోడ్డుకు మోక్షమెన్నడు" శీర్షికన జులై 23న ప్రకటించిన 'జనం సాక్షి" కథనానికి ఆర్ అండ్ బి ఏఈ స్పందించారు. అత్యంత ప్రమాదకరంగా మారిన న్యాల్ కల్ మండలం, చాల్కి, చీకూర్తీ - బీదర్ రోడ్డుపై గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. మండల రోడ్డు భవనాలశాఖ (ఆర్ అండ్ బి) ఏఈ భరత్ చంద్రారెడ్డి పర్యవేక్షణలో.. రోడ్డు భవనాల శాఖకు చెందిన పలువురు సిబ్బంది శనివారం 15 ట్రాక్టర్ల మేర మట్టి (మొరం)తో అత్యంత ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చారు. మరో రెండు రోజుల్లో చాల్కి ప్రధాన కూడలి నుండి బీదర్ సరిహద్దు వరకు దాదాపు 9 కిలో మీటర్ల మేరకు అత్యంత ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చి ప్రమాదాలు జరక్కుండా చర్యలు చేపట్టనున్నట్లు ఏఈ "జనం సాక్షి"కి వివరణ ఇచ్చారు. మరో వారం రోజుల వ్యవధిలో పూర్తిస్థాయి మరమ్మత్తుల కోసం రూ:2లక్షల మేర టెండర్ వేసి 9 కిలో మీటర్ల మేర రోడ్డుకు కంకర, తారు (డాంబర్)తో మరమ్మత్తులు చేపట్టనున్నట్టు ఏఈ స్పష్టం చేశారు. గత నాలుగు సంవత్సరాల క్రితం బీటీ రోడ్డుగా మార్చేందుకు ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేశారని, ఓ వ్యక్తి టెండరును దక్కించుకొని సంవత్సరాలు గడుస్తున్న పనులను కొనసాగించక పోవడంతో మంజూరైన నిధులు లాప్స్ (వెనక్కి పోవడం) అవడంతో పనులు నిలిచిపోయాయని ఏఈ తెలిపారు. త్వరలోనే సరిహద్దు రోడ్డును బీటీగా మార్చేందుకు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుక వెళ్ళనున్నట్లు ఏఈ భరత్ చంద్రారెడ్డి 'జనంసాక్షి'కి వివరణ ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో చిరుత పులి మృతి

- మెదక్ జిల్లాలో ఘటన



**హవేలీ ఘనపూర్, జూలై 26 (జనం సాక్షి):** మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదంలో చిరుత పులి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, హవేలీ ఘనపూర్ మండలం గంగాపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న చిరుత పులిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిరుత పులి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చిరుత పులి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. చిరుత పులిని ఢీకొట్టిన వాహనం ఏదన్నది గుర్తించే దిశగా అధికారులు దర్యాప్తు కొనసాగి స్తున్నారు. ఈ ఘటనతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాల గుండా ప్రయాణించే వాహనదారులు వేగాన్ని నియంత్రించి, వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని అటవీ శాఖ అధికారులు సూచించారు.

# పింఛన్‌దారుల రూ.16లు మింగేస్తున్న బీపీఎంలు

- చిల్లర పేరుతో వేళల్లో దోపిడీ

**కౌటాల జూలై 26 (జనంసాక్షి) :** ఆసరా పెన్షన్ ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రతి నెల 2016రూ.లు, మానసిక వైకల్యం కలిగిన వారికి 3016రూ.లు అందజేస్తుంది. ప్రతి నెల క్రమం తప్పకుండా పోస్టఫీసుల ద్వారా పెన్షన్ డబ్బులు ఇస్తున్నారు. వీటిని సక్రమంగా పంపిణీ చేయాల్సిన పోస్టాఫీసు సిబ్బంది అడ్డగోలుగా దోచుకుంటున్నారు. పెన్షన్ దారులకు 2వేల పైన వచ్చే 16రూపాయలు కొందరు బీపీఎంలు చిల్లర పేరుతో వేల ల్లో డబ్బులు జేబులో వేసుకుంటున్నారు. 16రూపాల విషయంలో లబ్ధిదారులు ప్రశ్నిస్తే వాళ్ళను టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పెన్షన్ ఇచ్చేటప్పుడు వేలు ముద్రలు పడటం లేదని, డబ్బులు అయిపోయాయి రేపు రండి అంటూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అనవసరంగా పోస్టాఫీసు సిబ్బంది తో గొడవ చేస్తే లాభం లేదనుకొని ఇచ్చినంత తీసుకొని సరిపెట్టుకోవడం మంచిదని కొందరు అంటున్నారు. 16రూపాలు చిన్న డబ్బులే అయినప్పటికీ కౌటాల మండల వ్యాప్తంగా వేళల్లో డబ్బులు నొక్కేస్తున్నారు.

ఇంత జరుగుతున్న సంబంధిత పోస్టాఫీసు పై అధికారులు పట్టించు కోవడం లేదు. పెన్షన్ దారులలో కొంత మందికి బ్యాంకు లో జమ చేస్తున్నారు. పోస్టల్ సిబ్బంది పై గతంలో ఏ చిన్న తప్పు చేసిన విధుల నుండి తొలగించేవారు. ఇప్పుడు ఎవరు కూడా కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.ప్రతీది పోస్టాఫీసు నుండే అన్ని సౌకర్యాలు ఉండేవి. ఉపాధి కూలీలకు డబ్బులు ఇచ్చే దాంట్లో కూడా కటింగ్‌లు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పింఛన్ దారుల విషయంలో పై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**పెన్షన్ దారుల డబ్బులు బ్యాంకు లో వేయాలి**

వృద్దులు,వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పింఛన్ల డబ్బులు బ్యాంక్ అకౌంట్ లలో జమ చేయాలని పింఛన్ దారులు కోరుతున్నారు. పోస్టాఫీసు ఆఫీసుల్లో గంటల తరబడి వేచి చూడటం, ఏ రోజు ఇస్తారో ఎదురుచూడటం, 16రూపాల డబ్బులు లాంటి విషయాల్లో ఇబ్బందులు పడకుండా ఉండవచ్చని కోరుతున్నారు.

# బీసీ ఆర్టిజన్స్ ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ

- సహకరించిన అందరికీ కృతజ్ఞతలు
- బీసీ సంక్షేమ శాఖ ఎంబీసీ కార్పోరేషన్ సీఈవో, మేళా ఆర్గనైజర్ అలోక్ కుమార్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ బోనాలు - చేతి వృత్తుల మేళా విజయవంతం కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ బీసీ సంక్షేమ శాఖ ఎంబీసీ కార్పోరేషన్ సీఈవో, మేళా ఆర్గనైజర్ అలోక్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు, ప్రిన్సిపల్ సెక్రటరీ బాలామాయదేవి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని మేళ ముగింపు సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన చెప్పారు. గత ఏడాది 30 స్టాళ్లతో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను ఈసారి 60 స్టాళ్లతో 11 రోజుల పాటు నిర్వహించగా, పాల్గొన్న బీసీ చేతివృత్తుల కళాకారులకు ఎంతో ఆదరణ లభించింది అన్నారు. సాధారణ రోజుల్లో 1,500 నుంచి 2,000 మంది, వారాంతాల్లో 4,000 నుంచి 5,000 మంది వరకు సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు ఆయన తెలిపారు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మేదరి తదితర బీసీ చేతివృత్తుల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెటింగ్ అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

ప్రతి సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించిన సాంస్కృతిక శాఖ అధికారులు, కళాకారులు, అలాగే ఎగ్జిబిషన్ విజయవంతానికి కృషి చేసిన రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల అధికారులు, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది ఎగ్జిబిషన్‌ను మరింత ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. పత్రిక విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు ఆశన్న, ఝూన్సీ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట మాజీ ఎమ్మెల్యే 'పెద్ది'కి గుండెపోటు

- చనిపోయినట్టు వదంతులు...
- ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స ...
- మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలింపు
- ఆరోగ్యంపై కేసీఆర్ ఆరా







**వరంగల్ ప్రతినిధి, జులై 26 (జనం సాక్షి):** నర్సంపేట మాజీ శాసనసభ్యులు బిఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురై గుండె సంబంధిత సమస్యతో హాస్పటల్లో చేరగా వరంగల్ జిల్లాలో చనిపోయారనె అనే వార్త వ్యాపించి కార్యకర్తలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు హనుమకొండలోని రోహిణి హాస్పిటల్ లో వైద్య సేవలు పొందుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం పట్ల వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రత్యేక బులిటిన్ లను జారీ చేశారు. ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రస్తుతం బీపీ నిలకడగా ఉందని గుండె స్పందన కూడా బాగుందని ప్రత్యేకంగా బులిటెన్ లో వెల్లడించారు. నర్సంపేట నియోజకవర్గం లోని 6 మండలాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు సర్పంచులు, నాయకులు పెద్ది ఆరోగ్యం పై ఆరా తీయడంతో ఆసుపత్రి వద్ద తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో పెద్ది మరణించారనే వార్త చక్కర్లు కొట్టడంతో నర్సంపేట డివిజన్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఉదయం 9 గంటల నుండి డివిజన్ వ్యాప్తంగా సోషల్ మీడియాలో పెద్ది మరణ వార్తపై పుకారు షికారు చేయడంతో స్వపక్ష విపక్ష పార్టీల్లో కూడా ఒక ఉత్కంఠ నెలకొంది. పెద్ది అనారోగ్యంపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మంత్రులు హరీష్ రావు కల్వకుంట్ల తారక రామారావును హన్మకొండలోని రోహిణి హస్పటల్ విచ్చేసి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్న నేపథ్యంలో పెద్దిని పరిశీలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని యశోద హాస్పిటల్ తరలించడానికి ప్రభుత్వ అధికారుల అనుమతితో గ్రీన్ ఛానల్ పర్మిషన్ తో ప్రత్యేక వాహనం ద్వారా హైదరాబాద్ తరలించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ఉదయం నుండి వందలాది మంది కార్యకర్తలు హాస్పిటల్ కి చేరుకోవడంతో హాస్పటల్ సమీపంలో తీవ్ర గందరగోళం నెలకొంది.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఉదయ అకస్మాత్తుగా గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయనను అత్యవసరంగా హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్య బృందం అన్ని విధాలుగా చికిత్స అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో వైద్యాధికారులు వైద్య బృందం తొమ్మిది సార్లు సిపిఆర్ ద్వారా చికిత్సను కొనసాగిస్తూ వైద్య సేవలు అందడంతో వైద్యం నిలకడగా కొనసాగుతుందని బులిటెన్ లో వెల్లడించారు . పెద్ది మరణించారని పుకారు వెలుగులోకి రావడంతో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగిన ఆయన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. రాజకీయ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది..తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. నర్సంపేట నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలతో మమేకమైన నాయకుడిగా పేరు సంపాదించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆప్తుడిగా రాజకీయాల్లో ఉంటూ అందరికీ ఆప్తమిత్రుల మసులుకొన్నారు. ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తీవ్ర ఆందోళన గురైన కార్యకర్తలు పెద్ది అన్న ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యాధికారులు వెల్లడించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు టిఆర్ఎస్ రాష్ట్ర నేతలు హరీష్ రావుతారకరామారావులలు వెంటనే స్పందించి మెరుగైన వైద్య సేవలను అందించడానికి యశోద ఆసుపత్రికి తరలించడంతో పెద్ది ఆరోగ్య పరిస్థితి పై ఉన్నతమైన సేవలు అందించడానికి చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా వైద్య సేవలు అందించిన డాక్టర్ మమతారెడ్డిని పలువురు అభినందిస్తున్నారు. వైద్య సేవ అందించడంలో నిపుణత సాధించిన డాక్టర్ మమతారెడ్డి అందించిన సేవలు మహోన్నతమైనదని పలువురు నెట్టింట్లో కొనియాడుతున్నారు.

**పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం పై అధినేత కేసిఆర్ ఆరా**

అనారోగ్యానికి గురైన పెద్ది సుదర్శన్ రెడ్డికి హైదరాబాద్ లో అత్యుత్తమ చికిత్స అందేలా చూడాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను అధినేత కెసిఆర్ ఆదేశించారు.

పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో.. అత్యుత్తమ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని, పార్టీ ముఖ్య నేతలను అధినేత కేసీఆర్ అప్రమత్తం చేశారు.అస్వస్థతకు గురైన విషయం తెలిసి, ఆందోళన చెందిన కెసిఆర్ గారు ఉదయం నుంచి పెద్ది ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు వాకబు చేస్తున్నారు.

సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు, పార్టీ నేతలు కెటిఆర్, హరీష్ రావు, వినోద్ తాటికొండ రాజయ్య, జిల్లా నేతలతో కెసిఆర్ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ అప్రమత్తం చేస్తున్నారు. సుదర్శన్ రెడ్డికి మెరుగైన చికిత్స అందేలా తగిన ఏర్పాట్లు చేయాలి అని సూచిస్తున్నారు.ఆరోగ్య సమాచారాన్ని,. మెరుగైన చికిత్స కోసం వారు చేస్తున్న కృషిని డాక్టర్లు కెసిఆర్ కు వివరిస్తున్నారు. ప్రస్తుతం పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలపడంతో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ముఖ్యంట ఊపిరి పీల్చుకున్నారు.

# వాహన దొంగతనాలకు పాల్పడే ముఠా గుట్టు రట్టు

- కేసును చేదించిన నేరడిగొండ పోలీసులు
- 16 మంది నిందితులపై కేసు నమోదు
- పది మంది అరెస్ట్.. ఆరుగురు పరారీ
- 7 మోటార్ సైకిల్స్, 3 ఆటోలు, 1 కారు, ఒక కత్తి, 8 మొబైల్ ఫోన్స్, 1500 నగదు స్వాధీనం
- ప్రతి ఒక్కరూ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచన
- నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**మావల జూలై 26( జనం సాక్షి):** వాహనాల దొంగతం చేస్తూ , దొంగతనాలకు పాల్పడిన ముఠా ను అరెస్టు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.గత కొన్ని నెలలుగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలలో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ముఠా ను పట్టుకోవడం జరిగిందని తెలిపారు . ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పలు వరాలను వెల్లడించారు. జిల్లాలో వాహన చోరీలకు పాల్పడుతున్న ముఠా నేరాలను నేరడిగొండ పోలీసులు కేసును ఛేదించారని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈనెల 21 వ తారీఖున ఆదిలాబాద్ పట్టణంలో రిమ్స్ ఎదురుగా ఒక ఆటోను దొంగతనం చేయడానికి ప్రయత్నించిన ముఠా సభ్యులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. జులై 24 వ తేదీన రాత్రి సమయంలో కుప్టి ఘాట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక కారులో 5 గురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు, వాడి దగ్గర మరణ ఆయుధాలు ఉండడం పోలీసులను బెదిరించడం జరిగిందని తెలిపారు. తేదీ 25 న ఆ నిందితులను ఎలాగైనా పట్టుకోవాలని వాంకిడి చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీ చేయుచుండగా అట్టి కారు ను అపి అందులో ఉన్న 5 వ్యక్తులను అదుపులోకి తీసుకోని, విచారించగా నిందితులలోని ప్రధాన సభ్యులు ఏ1 యాసర్, ఏ6 సోహెల్ వాహన డ్రైవర్లుగా పనిచేస్తూ గ్రామాలలో రెక్కి నిర్వహించే వాళ్ళని అన్నారు. ఆరుబయట పార్కింగ్ చేసిన వాహనాలనే లక్ష్యంగా దొంగతనాలు చేసేవారని తెలిపారు.తిరుగుతూ దొంగలించవలసిన వాహనాలను గుర్తించి, ముఠా సభ్యులకు తెలియజేస్తారని, ఈ ముఠా కారు ను కిరాయికి తీసుకోని పార్క్ చేసి ఉన్న వెహికల్స్ ను, తమ ముఠా సభ్యులైన 9 మంది నేరస్తులతో కలిసి దొంగలించి ఇఫ్తికర్ మరియు షైక్ అబుతాల కు అమ్మేవారని తెలిపారు. ఈ ముఠా సభ్యులైన 10 మంది నేరస్తులను ఈ రోజు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 7 బైక్ లు, 3 ఆటోలు, 8 సెల్ ఫోన్లు, 1 కత్తి, 1 కారు, మరియు 1500 రూపాయలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. బహిరంగ మార్కెట్లో ఏడు ద్విచక్ర వాహనాలు మరియు మూడు ఆటోల విలువ దాదాపు 17 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. మరో 6 మంది నిందితులు పరారీలో ఉండగా వారి కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి అన్నారు. జిల్లా పోలీసులు మొట్టమొదటిసారిగా ఈ నేరస్తులను గుర్తించి ముఠా గుట్టు రట్టు చేసినట్లు తెలిపారు. గత కొన్ని నెలలుగా నేరాలు చేస్తున్న ఎవరికీ చిక్కకుండా తిరుగుతున్న ముఠా సభ్యులను అరెస్ట్ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. నిదితులని రిమాండ్ చేశామని పేర్కొన్నారు. ప్రజలు సీసీ కెమెరాలను పెట్టుకోవాలని అన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా ఉంటే 100 కు డయల్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పలువురు పోలీసులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడా సీఐ సిహెచ్ రమేష్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, నేరడిగొండ ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





**తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉచిత సివిల్ సర్వీసెస్ అర్హత పరీక్ష విజయవంతం**

**హనుమకొండ, ప్రతినిధి జూలై 26, (జనంసాక్షి) :** తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్‌కు సంబంధించిన అర్హత పరీక్ష ఆదివారం విజయవంతంగా జరిగింది. దేశ అత్యున్నత సివిల్ సర్వీసుల్లో రాణించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతీయువకులు పెద్ద సంఖ్యలో ఈ పరీక్షకు హాజరయ్యారు.ఈ అర్హత పరీక్ష ఆదివారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి బి. నిర్మల, హైదరాబాద్ స్టడీ సర్కిల్ లైజన్ ఆఫీసర్ అప్పలస్వామి, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ కె. జగన్ మోహన్, స్టడీ సర్కిల్ ప్రతినిధి బి. కిరణ్ పాల్గొని పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.ఈ పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. సివిల్ సర్వీసు సాధించాలనే సంకల్పంతో ఉన్న యువత ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

# మోదీ పాలనలో భారతీయ రైల్వేల్లో నూతన శకం ఆరంభం

- ఫలించిన కొమరవెల్లి మల్లన్న భక్తుల నిరీక్షణ
- తెలంగాణలో రూ.2 వేల కోట్ల వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నం
- కేంద్రమంత్రులు బండి సంజయ్, జి.కిషన్ రెడ్డి
- కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం





**కొమురవెల్లి, జూలై 26 (జనం సాక్షి)** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో రైల్వే రంగంలో నూతన శకం ఆరంభమైందని భారతీయ రైల్వేల్లో అభివృద్ధి చెందుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు.ఆదివారం కొమరవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ను మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు,స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ను ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా రైల్వే రంగ అభివృద్ధికి దాదాపు రూ. 23 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు.తెలంగాణలో మునుపెన్నడూ లేనివిధంగా రైల్వే లేన్ల నిర్మాణం,నూతన రైలు ,,స్టేషన్ల ఆధునీకరణ పేరిట రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో రూ. 2 వేల కోట్ల వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నం అని అన్నారు. లక్షలాది మంది కొమరవెల్లి మల్లన్న స్వామి భక్తుల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు ఫలితం లభించిందని తెలంగాణలో నూతన సుమారు రూ. 6 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్ నిర్మించినం అని ఈ స్టేషన్ ప్రవేశ ద్వారం ఆలయ శైలిలో రూపకల్పన చేయడంవల్ల ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుందని అన్నారు.కొమురవెల్లి మల్లన్న క్షేత్ర అభివృద్ధికి చారిత్రాత్మక అడుగు పడిందని మరో 80 కోట్ల నిధులతో ప్లాట్ ఫారం విస్తీర్ణం అని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కె లక్ష్మణ్,మాజీ గవర్నర్ బండారు ధాత్తాత్రేయ, ఎమ్మెల్సీ అంజరెడ్డి, రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ కొమురవెల్లి సర్పంచ్ గొల్లపల్లి పద్మఆంజనేయులు ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.

**జెన్‌జీలకు మంత్రి పదవి ఇవ్వండి: బండి సంజయ్**

తెలంగాణలో జెన్‌జీలకు మంత్రి పదవి ఇవ్వాలని కేంద్రమంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. మాటలు చెప్పడం కాదు, ఆచరణలో చూపాలన్నారు. బండి సంజయ్ ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక కామెంట్స్ చేశారు. 'చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీలను రాజీనామా చేయించి జెన్‌జీలకు పదవులు ఇవ్వండి. మీ వద్ద హోమ్, విద్యా, మున్సిపల్ శాఖలు ఖాళీగానే ఉన్నాయి కదా. జెన్‌జీలకు ఆ శాఖలు అప్పగించండి. మీ దృష్టిలో జెన్‌జీలంటే వీహెచ్, కేకే, కోదండ రెడ్డి. వృద్ధులకు, వయసు దాటిన పెద్దలకు యూత్ కోటాలో పదవులు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటే కదా. బీజేపీకి దేశం ఫస్ట్, పార్టీ నెక్ట్స్, పర్సన్ లాస్ట్. ఆ కోణంలోనే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు' అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
27 జూలై 2026

# చరిత్రను మలిచింది విద్యార్థి ఉద్యమాలే..

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. అన్యాయం, అసమానత, అణచివేత, హక్కుల ఉల్లంఘనలపై తొలి స్వరం వినిపించింది ఎక్కువగా విద్యార్థి లోకం నుంచే. అధికారం ముందు తలవంచని ధైర్యం, ఆదర్శాల కోసం త్యాగం చేసే తత్వం, సమాజం పట్ల బాధ్యతాభావం.. ఇవే విద్యార్థి ఉద్యమాలను చరిత్రలో ప్రత్యేకంగా నిలబెట్టాయి.

తెలంగాణ ఉద్యమం దీనికి ఒక గొప్ప ఉదాహరణ. **1968–69**లో విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి జ్వలించిన విద్యార్థి ఉద్యమం దశాబ్దాల పాటు తెలంగాణ ఆకాంక్షను సజీవంగా ఉంచింది. ఎన్నో త్యాగాలు, పోరాటాలు, ప్రజా ఉద్యమాల అనంతరం **2014**లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. రాష్ట్ర సాధనలో అనేక వర్గాల పాత్ర ఉన్నప్పటికీ, ఉద్యమానికి తొలి ఊపిరి పోసింది విద్యార్థి లోకమే అన్నది చరిత్రలో నమోదైన వాస్తవం. అస్సాంలో విద్యార్థుల నాయకత్వంలో సాగిన ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను మార్చింది. తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమాల్లో విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. అలాంటి ఉద్యమాలు భాషా విధానం, ప్రాంతీయ హక్కులు, ప్రజాస్వామ్య విలువలపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

సంపాదకీయం

ఇదే చారిత్రక కోణంలో తాజాగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన దీక్ష, దాని విజయం విద్యార్థి, యువజన శక్తి నిరంతర పోరాట పటిమను మరోసారి చాటిచెప్పింది. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపేందుకు యువత చేపట్టిన ఈ శాంతియుత నిరసన, పాలకుల దృష్టిని ఆకర్షించి విజయం సాధించడం సమకాలీన ఉద్యమ చరిత్రలో ఒక నూతన అధ్యాయంగా నిలిచింది. ఇది అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించడంలో యువత దృక్పథాన్ని, పట్టుదలను మరోసారి రుజువు చేసింది.


తెలంగాణలోని కొన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి వెలుగులోకి వచ్చిన కొందరు రాడికల్ విద్యార్థి నాయకులు తరువాత సాయుధ విప్లవ రాజకీయాలవైపు మళ్లారు. వారిలో కొందరు అనంతరం దేశంలోని పలు రాష్ట్రాల్లో విస్తరించిన మావోయిస్టు ఉద్యమంలో భాగమయ్యారు. దండకారణ్యం వంటి ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పాలనా నిర్మాణాలను ఏర్పాటు చేసినట్లు ఆ ఉద్యమం ప్రకటించినప్పటికీ, అది సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకుంది. భారత ప్రభుత్వం ఆ సంస్థలను నిషేధిత సంస్థలుగా ప్రకటించినా.. వారి పోరాట చారిత్రక పరిణామం, విద్యార్థి ఉద్యమాలు సమాజంపై ఎంతటి ప్రభావాన్ని చూపగలవో సూచిస్తుంది. అదే సమయంలో ఉద్యమం ఎంచుకునే మార్గం ప్రజాస్వామ్యమా, సాయుధ పోరాటమా అనేదే దాని చారిత్రక వారసత్వాన్ని నిర్ణయిస్తుంది.

దేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే అనేక రాజకీయ, సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించిన ప్రముఖుల్లో చాలామంది విద్యార్థి ఉద్యమాల నుంచే ఎదిగిన వారే. ముఖ్యంగా వామపక్ష ఉద్యమాలు, సామాజిక న్యాయ ఉద్యమాలు, ప్రాంతీయ ఉద్యమాలు ఇవన్నింటికీ విద్యార్థి లోకం నాయకత్వాన్ని అందించిన సందర్భాలు అనేకం. విశ్వవిద్యాలయాలు కేవలం విద్యాబోధన కేంద్రాలే కాదు; సామాజిక చైతన్యానికి, ప్రజాస్వామ్య చర్చలకు, భవిష్యత్ నాయకత్వానికి పునాదులు వేసే వేదికలుగా కూడా నిలిచాయి.

ప్రజల మద్దతు, ప్రజాస్వామ్య పద్ధతులు, రాజ్యాంగబద్ధ పోరాటాల ద్వారా (జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ దీక్షా విజయం లాంటివి) సాధించిన విజయాలు శాశ్వత గుర్తింపును పొందుతాయి. హింసకు దారితీసే మార్గాలు మాత్రం తీవ్రమైన మానవ, సామాజిక మూల్యాన్ని చెల్లించాల్సిన పరిస్థితులను తీసుకురాగలవు.

విద్యార్థుల గళాన్ని అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావు. వారి ప్రశ్నలను వినడం, ఆందోళనలకు కారణమైన అంశాలను పరిష్కరించడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. విద్యార్థుల స్వరం తాత్కాలికంగా అణచివేయవచ్చు కానీ, న్యాయమైన ఆకాంక్షను శాశ్వతంగా అణచివేయడం ఎవరి వల్లా కాదు. విద్యార్థి ఉద్యమాలు ప్రజాస్వామ్య సమాజానికి హెచ్చరికలూ, మార్పుకు మార్గదర్శకాలూ. వాటిని అర్థం చేసుకోవడం పాలకుల బాధ్యత. వాటి నుంచి నేర్చుకోవడం సమాజ బాధ్యత.

# అనుభవ సంపుటి-ఆర్ద్రత




*మనిషి సంఘ జీవి. అందులో సృజనాత్మక ప్రతిభా చైతన్యం కలిగిన కవి రచయిత తన చుట్టూ ఉన్న సమాజం, సమస్యలు సంబంధీకులు ఆయా సమయాల్లో తన సమయాన్ని వ్యక్తం చేస్తూ అవసరమైనప్పుడు తన అనుభవాన్ని రంగరించి ఒక పాఠంగా బోధిస్తాడు. అలా 70వ పడిలోకి చేరిన కవి రచయిత,పరిశోధకుడు, చరిత్రకారుడు పాలడుగు రత్నాకర్ రావు గారు"గతం ఎప్పుడూ వర్తమానం లోకి తొంగి చూస్తుంది. గతం లేనిది వర్తమానం లేదు. వర్తమానం లేనిదే భవిష్యత్తు లేదు అనే స్పృహతో తమ జీవన సంపుటిగా "ఆర్ద్రత"ను వెలువరించారు.*

అచటి చిగురు కొమ్మయిన చేవ అన్నట్లు క్రీస్తు శకం 112024లో మిరియాల మల్లన వేయించిన శాసనంగల గూడూరు గ్రామంలో జన్మించిన పాలు అడుగు రత్నాకర్ రావు అక్కడి పరిసరాలు మహాకవులైన పాల్కురికి సోమనాథుడు, బమ్మెర పోతన మొదలైన మహాకవుల స్ఫూర్తితో పాటు ఆ గ్రామానికి వివిధ రంగాలలోఒక ప్రత్యేకతను చేకూర్చిన మహనీయులు చౌడవరపు విశ్వనాథం, జగన్నాథరెడ్డి, మల్లయ్య,చుక్క రామయ్య, ఆర్తి నమ్మాల్ వారు, ఎన్.రామేశ్వర రాజు, చంద్రమోహన్, యల్లంభట్ల నాగయ్య, ఆర్థిపరాంకుశం, అనుముల ఎల్లయ్య, ప్రభంజన్ కుమార్ మొదలైన చైతన్యమూర్తులు ఎందరో గుర్తుకు వస్తారు. కాగా పాలడుగు వారు తరతరాలుగా వారసత్వంగా లభించిన గ్రామ కరణీకాన్ని సమర్థవంతంగా నిర్వహించి ఆ తరువాత ప్రభుత్వ ఉద్యోగిగా వివిధ ప్రాంతాలలో బాధ్యతలు నిర్వహించారు. సహజంగా సంప్రదాయకంగా ప్రతిభా వ్యుత్పత్తులు కలిగిన పాలడుగు రత్నాకర్ రావు తన పదవీ విరమణ అనంతరం కాలాన్ని వృధా చేయకుండా తన సృజనాత్మక రచనా వ్యాసంగానికి పదును పెడుతూ ఇప్పటికే పది పుస్తకాలు రచించారు. తనతో నలుగురు కలిసి నడవాలని అభిప్రాయంతో మొదట తను నివాసం ఉంటున్న జనగామ లోని అపార్ట్మెంట్ నివాసులందరికీ కవితలు రాయించి "శ్రీ పద్మాలయ రెసిడెన్సి" పేర కవితా సంకలనాన్ని వెలువరించారు. అది మొదలు ఆయన ఇంతింతై వటుడింతై అన్నట్లు తడబడుతూ అడుగిడుతూ, జ్ఞాపకాల దొంతరలు, భావ స్పందనలు, అక్షర పలకరింపులు, పాలడుగు వంశీయులు, స్మృతుల అలిగకిడిలో, గూడూరు చరిత్ర, హృదయ స్పందనలు, ఆర్ద్రత వంటి పుస్తకాలు ప్రచురించారు. ఇందులో ఏడు కవితా సంపుటులు కాగా పాలడుగు వంశీయులు, గూడూరు చరిత్ర అనేవి చరిత్ర గ్రంథాలు. తాజాగా ఆయన అంతరంగదరంగాలుగా భావించి వెలువరించిన "ఆర్ద్రత" మనిషి జీవితం యాంత్రికమై వేగవంతమైన తరుణంలో ఆత్మీయత అనురాగాలను కోల్పోరాదని సమాజంలో సంఘర్షణ కన్నా సామరస్యానికి సహృదయతకు స్థానం కల్పించాలని అప్పుడే మానవ సంబంధాలు సజావుగా సాగుతాయని మానవతా వాదంతో తమ అభిప్రాయాలను, అనుభవాలను, అనుభూతులను, ఆలోచనలను పాఠకులతో పంచుకున్నారు. అందుకు ఉదాహరణగా తమ వంశ గురువులు తిరుమలాచార్య గారి కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని అది పారంపర్యంగా సాగుతుందని ఊరును విడిచి నగరానికి చేరుకున్న ఆ స్పర్శను కోల్పోలేదని వెల్లడించారు. ధరల పెరుగుదలతో మధ్యతరగతి జీవితం ఒడిదుడుకుల పాలవుతుందని ఉదాహరణ పూర్వకంగా చెబుతూ ఉగాది పచ్చడి కోసమై అడిగితే కాయ కొండెక్కింది. పువ్వు చెట్టు ఎక్కిందని వ్యంగ్యంగా ధరల పెరుగుదలను ప్రస్తావించారు. జ్ఞాపకాలు ఆకుల రాలుతుంటాయని చెబుతూ"చిన్నప్పుడు గాలిపటంలా వదిలి వేసుకున్న బాల్యం ఏ మూల వంపులో పడిపోయిందని వెతుక్కుంటాను అని భావుకతతో చెప్పారు. ఆయన రచనల్లో ఒకవైపు సున్నితత్వము, మరోవైపు సునిశితత్వము పెనవేసుకున్నాయి. దానికి తోడు అక్కడక్కడ ఆయన విసిరిన చెణుకులు పాఠకుల్ని అలరిస్తాయి. ఒకసారి శుభలేఖ ఇచ్చి వస్తుంటే కాల్వలో జారి పడిపోయినప్పుడు తగిలిన గాయం కంటే అక్కడున్న ఒక మహిళ"పగటిపూటనే తాగి పడిపోయాడు"అన్న మాటలు తనను మరింత బాధించాయని చెప్పుకున్నారు. ఇంట్లోని పాత వస్తువుల్ని పారవేసేందుకు మనసు రాక వాటిపై ఎంతోమంది ప్రేమాభిమానాల సంతకాలు ఉన్నాయని అదొక మధుర జ్ఞాపకంగా గుర్తు చేస్తారు. సాంకేతిక సమాచార విప్లవం విస్తరించిన రోజుల్లో పోస్ట్ బాక్స్ ఉనికికే ప్రమాదం ఏర్పడుతున్న సమయంలో యాది చేసుకుంటూ దాన్నొక "భావోద్వేగాల నేస్తం"గా అభివర్ణించారు. ముఖ్యంగా సెలవుల్లో ఇంటికి వచ్చిన మనుమలు మనమరాళ్లపట్ల గారాబాన్నే కాక వాళ్లకు బాధ్యతను గుర్తుచేస్తూ తాతయ్యగా వారి చదువు సంధ్యల గురించి, భవిష్యత్తు లక్ష్యాల గురించి ప్రశ్నించడం నేటి తాతల తరానికి ఎంతో అవసరమైనది. పిల్లలకు ఆయన వేసిన ప్రశ్నల్లో ఆయన తార్కికత, అవగాహన, విశ్లేషణ కనబడతాయి. మొక్కై వంగనిది మ్రానై వంగదు కదా! అన్నది ఇందులోని స్ఫూర్తి. గత దశాబ్దికాలంగా రచనా వ్యాసంగం తోనే జీవితాన్ని పెనవేసుకున్న రత్నాకర్ రావు విస్తృతంగా సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. ఆయన నిరంతర అధ్యయన ప్రభావం ఈ రచనల్లో కొట్ట వచ్చినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా ఆయన ప్రస్తావించిన రస్కిన్ బాండ్, శేషేంద్ర, ఆత్రేయ, చలం మొదలైన కవుల్ని రచయితల్ని ఆయన ఉదాహరించడం, వలస నవల గురించి ప్రస్తావించడం ఇవన్నీ ఆయనలో గొప్ప పాఠకుడు ఉన్నాడని తెలియజేస్తాయి. అలాగే జీవించడం కోసం బ్రతకటం కాక బ్రతకడం కోసం జీవించాలనే భావ గర్భితమైన తాత్విక వ్యాఖ్యలు ఉన్నాయి. ప్రశాంత వాతావరణంలో యోగా చేస్తూ ఫోటో దిగడం, చెస్ ఆడడం, పుస్తక పఠనం, నిరంతర రచన ఇవి తన వ్యాపకాలుగా పేర్కొన్నారు. ఇలా పాలడుగు రత్నాకరరావు తన జీవనయానంలోని అనుభూతులను ఎన్నింటినో ఇందులో చెరిగిపోశారు. తమ ఆలోచనలకు అనుభవాలకు అక్షర రూపం ఇవ్వలేని సాధారణ పాఠకులు సైతం "ఆర్ద్రత"ను సౌహార్ధంతో చదివినప్పుడు రచయితతో మమేకమవుతారు. "లోనారసిన" అక్షర ప్రియులకు ఈ పుస్తకం ఒక మంచి విందు. రచయిత పాలడుగు రత్నాకర రావు గారికి హార్దికాభినందనలు.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

## దిల్ సే మీకు లాల్ సలాం!!



ఇది ఎగసిన ఉప్పెన
కోట్ల ఉరుముల గర్జన
దిగంతాలు ఒక్కటైన
యువ ప్రళయ హోరు
లేటుగా లేయవచ్చు
నీటుగా పెల్లుబికింది

ఫాసిస్టు ఘమండుల్ని
పెను మంటై కమ్మింది
ప్రశ్నకు పాతర వేస్తూ
ఎత్తిన ప్రతి గొంతునూ

కత్తులు ఝుళి పిస్తూ
ఖైదులేస్తూ మూసేస్తే
వేసిన ప్రతి ఓటునూ
మిషనులేసి మార్చేసి
జన కాంక్షలు గల్లంతై
గెలిచానని గంతులేస్తే

ఎధవాయి వేషాల్నిక
ఆపేస్తవా లేదంటూ
దేశ ద్రోహుల పాలన
ఎల్లకాలం సాగదంటు
యువత మేల్కున్నది
చలిచీమల బారుగట్టి

దోపిడెల్ల బూడిదవ్వ
లావాలను చిమ్మింది

కులమతాల ఊబిలో
బెట్టింగూ జూదాలూ
జులాయి తిరుగుళ్ళే
నసీబులుగ మార్చేసి

యువతను చెడగొట్టి
తొడగొట్టిక చేయలేరు
కుట్రలింక కూలి పోవు
విరిచేస్తం కోరలంటూ
అవినీతి లీకు పాలనకూ
అంతిమ ఘడియలంటూ

దింపుడు కల్లం ఆశలన్నీ
కల్లలు ఇది అంతమంటూ
ఛప్పన్ ఇంచ్ ఛాతెనుక
దాచిన ఘోరాల్ నేరాల్
దొమ్మల్ఛేల్ఛి ఈడ్సేస్తిరి
కాక్రోచ్ల బలం సూపిస్తిరి

మా కన్నులూ.. కలలూ
ఆశలూ ఆకాంక్షల్ మీరే
రణాలు గెలిసే కావాతు
ఫిరంగి మోతలు మీరేలే

యువతా మీ తలంపుకు
కాలం సైతం తల వంచు
మీ శక్తిని ఆపే శక్తే దిక్కడ
దిల్ సే మీకు లాల్ సలాం!!

డా. ఇక్బాల్ పాషా
9440775732

# ప్రజాస్వామ్యంలో యువత ఆవేదనకు ప్రతిధ్వని

## ఢిల్లీ ఉద్యమం చెప్పిన సందేశం



జూన్ 6, 2026న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన యువత నిరసన దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. తొలుత పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులు, నియామకాల్లో అవకతవకలు, నిరుద్యోగ సమస్యలపై ప్రారంభమైన ఈ ఉద్యమం క్రమంగా దేశవ్యాప్తంగా యువత ఆవేదనకు ప్రతీకగా మారింది. అనంతరం పార్లమెంట్ ముట్టడికి పిలుపునివ్వడంతో ఈ ఉద్యమం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఇది కేవలం ఒక రాజకీ య నిరసన మాత్రమే కాదు; దేశ విద్యా, నియామక వ్యవస్థలపై పెరుగుతున్న అవిశ్వాసానికి ప్రతిబింబం.

ఈ ఉద్యమం వెనుక ఉన్న అసలు కారణం ఒక్క సంఘటన కాదు. సంవత్సరాలుగా వరుసగా వెలుగుచూస్తున్న ప్రశ్నాపత్రాల లీకులు, నియామక పరీక్షల రద్దులు, ఖాళీ పోస్టుల భర్తీలో జాప్యం, చదువుకున్న యువతలో పెరుగుతున్న నిరాశ, ప్రభుత్వ వ్యవస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి అనేక అంశాలు దీనికి దారితీశాయి. లక్షలాది మంది యువకులు సంవత్సరాల తరబడి శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ఒక్క ప్రశ్నాపత్రం లీక్ కారణంగా వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోంది. దీంతో ప్రతిభకు బదులుగా అక్రమాలకు అవకాశం కల్పిస్తున్న వ్యవస్థపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించింది. ప్రజాస్వామ్యంలో ప్రజల స్వరం ప్రభుత్వానికి చేరవేయడానికి ఉద్యమాలు చట్టబద్ధమైన మార్గం. అయితే అదే సమయంలో ఉద్యమాలు శాంతియుతంగా, చట్టాన్ని గౌరవిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సాగడం కూడా అంతే ముఖ్యం. ప్రభుత్వం ప్రజల సమస్యలను వినడం ఎంత బాధ్యతో, ఉద్యమకారులు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం కూడా అంతే బాధ్యత.

జూన్ 6తో ప్రారంభమైన ఈ ఉద్యమం ఒక్కరోజు ఆవేశంతో పుట్టినది కాదు. దానికి ముందు నుంచే సామాజిక మాధ్యమాల్లో పోటీ పరీక్షల లీకులు, నిరుద్యోగ సమస్యలు, నియామకాల్లో అవకతవకలపై వేలాది మంది యువత చర్చలు ప్రారంభించారు. మే 2026లో ఏర్పడిన ఒక వేదిక ఈ అసంతృప్తికి స్వరంగా మారింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఉద్యోగార్థులు, తల్లిదండ్రులు ఈ ఉద్యమానికి మద్దతు తెలపడంతో ఇది జాతీయ స్థాయికి చేరుకుంది. జంతర్ మంతర్ వద్ద జరిగిన తొలి నిరసనలో కేంద్ర ప్రభుత్వం ప్రశ్నాపత్రాల లీకులపై సమగ్ర దర్యాప్తు జరపాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నిరవధిక ధర్నా, దేశవ్యాప్తంగా సంఘీభావ కార్యక్రమాలు, చివరకు పార్లమెంట్ వైపు శాంతియుత ర్యాలీకి పిలుపునివ్వడం ద్వారా ఈ ఉద్యమం మరింత విస్తరించింది. వేలాది మంది యువత వీధుల్లోకి రావడం, ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడం ఈ సమస్య ఎంత లోతుగా ఉందో తెలియజేసింది. ఈ ఉద్యమం మరో ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేసింది.

ప్రశ్నాపత్రాల లీకులు కేవలం పరీక్షల సమస్య మాత్రమే కాదు. అవి దేశ మానవ వనరుల అభివృద్ధిని దెబ్బతీసే అంశాలు. ప్రతిభకు బదులుగా అక్రమాలకు అవకాశం కల్పించే వ్యవస్థ సమాజంలో న్యాయంపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. లక్షలాది కుటుంబాలు తమ పిల్లల చదువుకోసం అప్పులు చేసి కోచింగ్ కేంద్రాలకు పంపుతున్నాయి. సంవత్సరాల తరబడి చేసిన శ్రమ ఒక పరీక్ష రద్దుతో వృథా కావడం యువతలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి దారితీస్తోంది. ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదు; కుటుంబానికి ఆర్థిక భరోసా, సామాజిక గౌరవం, వ్యక్తిగత ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా మారింది. రాజకీయ కోణంలో చూస్తే అధికార పక్షం ఈ నిరసన వెనుక రాజకీయ ప్రేరేపణలు ఉన్నాయని ఆరోపిస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం యువత ఎదుర్కొంటున్న సమస్యలకు ఇది సహజసిద్ధమైన ప్రతిస్పందన అని పేర్కొంటున్నాయి. కానీ లక్షలాది మంది యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాన్ని కేవలం రాజకీయ లాభనష్టాల కోణంలో మాత్రమే చూడడం సమంజసం కాదు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం భర్తీ చేయడం, ప్రతి దశలో అభ్యర్థులకు స్పష్టమైన సమాచారం అందించడం కూడా ప్రభుత్వ బాధ్యత.

ప్రజాస్వామ్యంలో ఏ ఉద్యమాన్నైనా కేవలం అధికార-ప్రతిపక్ష రాజకీయాల కోణంలో మాత్రమే చూడడం సరైన దృక్పథం కాదు. ప్రతి ఉద్యమం వెనుక ఒక సామాజిక ఆవేదన, ఒక వర్గం ప్రజల ఆకాంక్షలు, భవిష్యత్తుపై ఉన్న ఆందోళన దాగి ఉంటుంది. ఈ సంపదను సక్రమంగా వినియోగించుకోలేకపోతే జనాభా లాభం క్రమంగా సామాజిక, ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంది. అందువల్ల నాణ్యమైన విద్య, పారదర్శక నియామక వ్యవస్థ, అవినీతికి తావులేని పరిపాలన, సమయపాలనతో కూడిన ఉద్యోగ నియామక ప్రక్రియలు దేశ అభివృద్ధికి మూలస్తంభాలుగా మారాలి.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల కోసం ఉంటుంది. ప్రజల స్వరం వినిపించినప్పుడు దానిని అణచివేయడం కాదు, ఆ స్వరంలోని బాధను అర్థం చేసుకుని పరిష్కారం చూపడమే నిజమైన పరిపాలన. అదే విధంగా ప్రజలు కూడా రాజ్యాంగబద్ధమైన, శాంతియుత మార్గాల్లో తమ హక్కులను సాధించేందుకు కృషి చేయాలి. నిరసనల ఉద్దేశం వ్యవస్థలను బలోపేతం చేయడమే తప్ప బలహీనపరచడం కాదు.

ముగింపుగా, జంతర్ మంతర్లో ప్రారంభమైన ఈ ఉద్యమం కేవలం ఒక రాజకీయ సంఘటన కాదు. ఇది దేశ యువత భవిష్యత్తు, విద్యా వ్యవస్థ విశ్వసనీయత, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వాల జవాబుదారీతనం గురించి సమాజానికి ఇచ్చిన గంభీరమైన సందేశం. యువత అవకాశాలు కోరుకుంటోంది – దయ కాదు; పారదర్శకత కోరుకుంటోంది – వాగ్దానాలు కాదు; న్యాయం కోరుకుంటోంది – ఆలస్యం కాదు; విశ్వసనీయమైన వ్యవస్థ కోరుకుంటోంది – అనిశ్చితి కాదు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న పరిపాలన, ప్రతిభకు విలువనిచ్చే నియామక వ్యవస్థ, యువతకు భరోసానిచ్చే విధానాలే దేశ నిర్మాణానికి బలమైన పునాది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# పరిశోధకుడికి "రీసెర్చ్ జర్నల్స్" ఎంపికకు మార్గదర్శకాలు

నాణ్యమైన పరిశోధన చేయడం ఎంత ముఖ్యమో, ఆ పరిశోధనను సరైన శాస్త్రీయ జర్నల్లో ప్రచురించడం కూడా అంతే కీలకం. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేలాది కొత్త జర్నళ్లు, లక్షలాది పరిశోధనా వ్యాసాలు వెలువడుతున్నాయి. ఈ విస్తృత ప్రపంచంలో తమ పరిశోధనకు సరిపోయే జర్నల్ను గుర్తించడం పరిశోధకులకు సవాలుగా మారింది. ఈ అవసరాన్ని తీర్చడానికి వివిధ ప్రచురణ సంస్థలు, శాస్త్రీయ డేటాబేస్లు, విశ్లేషణ వేదికలు ప్రత్యేకంగా జర్నల్ ఫైండర్ టూల్స్ను రూపొందించాయి. ఇవి పరిశోధన అంశం, కీలక పదాలు, సారాంశం, పరిశోధన విభాగం వంటి వివరాలను విశ్లేషించి తగిన జర్నళ్లను సూచిస్తాయి. ఈ సాధనాలు సమయం ఆదా చేయడమే కాకుండా, పరిశోధన తిరస్కరణ అవకాశాలను తగ్గించి సరైన ప్రచురణ వేదికను ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

ఈ రంగంలో అత్యంత ప్రసిద్ధ సాధనాల్లో మొదటిది ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ (ఐఈఈఈ) ప్రచురణ సిఫార్సు సాధనం. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక రంగాల్లో ఇది విస్తృతంగా ఉపయోగించబడుతుంది. పరిశోధన వ్యాసం శీర్షిక, సారాంశం లేదా కీలక పదాలను విశ్లేషించి, ఐఈఈఈ ప్రచురణలలో అత్యంత అనుకూలమైన జర్నళ్లను సూచిస్తుంది. అలాగే ప్రచురణ పరిధి, వ్యాస రకం, అంగీకార అవకాశాలపై కూడా మార్గదర్శకత్వం అందిస్తుంది.



రెండవది జాన్ వైలీ అండ్ సన్స్ (వైలీ) జర్నల్ ఫైండర్. జీవశాస్త్రాలు, వైద్యశాస్త్రం, విద్య, సామాజిక శాస్త్రాలు, ఇంజినీరింగ్ వంటి అనేక విభాగాల్లో ఇది ఉపయోగకరంగా ఉంటుంది. పరిశోధన సారాంశాన్ని విశ్లేషించి, విషయానికి అత్యంత అనువైన (వైలీ) జర్నళ్లను సూచిస్తుంది. ప్రతి జర్నల్ లక్ష్యం, పరిధి, సమీక్ష విధానం, ప్రచురణ సమయం వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం అందించడం దీని ప్రత్యేకత.

మూడవది (ఎల్సెవియర్ ) జర్నల్ ఫైండర్. ప్రపంచంలోనే అతిపెద్ద శాస్త్రీయ ప్రచురణ సంస్థల్లో ఎల్సెవియర్ ఒకటి. ఈ సాధనం పరిశోధన అంశాన్ని విశ్లేషించి, సంబంధిత జర్నళ్ల జాబితాను అందిస్తుంది. జర్నల్ ప్రభావం, ప్రచురణ వేగం, బహిరంగ ప్రాప్యత (ఓపెన్ యాక్సెస్) సౌకర్యం, సమీక్ష విధానం వంటి వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా మొదటిసారి ప్రచురణ చేయబోయే పరిశోధకులకు ఇది ఎంతో సహాయకారి.

నాలుగవది స్కోపస్ జర్నల్ విశ్లేషక సాధనం. (స్కోపస్) అనేది ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ శాస్త్రీయ సూచిక డేటాబేస్లలో ఒకటి. ఇది నేరుగా జర్నల్ను సూచించకపోయినా, జర్నల్ నాణ్యత, ఉల్లేఖనాల సంఖ్య, ప్రచురణ ప్రభావం, రచయితల పనితీరు, పరిశోధన ధోరణులు వంటి అంశాలను విశ్లేషించడానికి అత్యంత విలువైన వేదిక. పరిశోధకులు జర్నల్ విశ్వసనీయతను అంచనా వేయడానికి దీనిని విస్తృతంగా ఉపయోగిస్తారు.

ఐదవది (ఎడాంజ్) జర్నల్ సెలెక్టర్. ఇది కేవలం జర్నల్ ఎంపిక మాత్రమే కాకుండా, పరిశోధన రచన, భాషా సవరణ, ప్రచురణ సలహాలు, సమీక్షకు సిద్ధం చేయడం వంటి అనేక సేవలను అందిస్తుంది. పరిశోధన సారాంశాన్ని ఆధారంగా తీసుకొని అనువైన జర్నళ్లను సూచించడమే కాకుండా, వ్యాసాన్ని మెరుగుపరచడానికి కూడా సూచనలు ఇస్తుంది.

ఆరవది మల్టీడిసిప్లినరీ డిజిటల్ పబ్లిషింగ్ ఇన్స్టిట్యూట్ (ఎమ్డీపీఐ) జర్నల్ ఫైండర్. బహిరంగ ప్రాప్యత జర్నళ్ల ప్రచురణలో ఎమ్డీపీఐ ప్రముఖ సంస్థ. ఈ సాధనం పరిశోధన అంశానికి సరిపోయే ఎమ్డీపీఐ జర్నళ్ళను సూచిస్తుంది. వేగవంతమైన సమీక్ష, త్వరిత ప్రచురణ, ప్రపంచవ్యాప్త ఉచిత ప్రాప్యత వంటి అంశాల వల్ల ఇది అనేక పరిశోధకులను ఆకర్షిస్తోంది. అయితే జర్నల్ నాణ్యత, ప్రభావం వంటి అంశాలను పరిశోధకులు స్వయంగా పరిశీలించడం కూడా అవసరం.

ఏడవది సైమాగో జర్నల్ అండ్ కంట్రీ ర్యాంక్ (ఎస్జేఆర్). ఇది పరిశోధన ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన విశ్లేషణ సాధనాల్లో ఒకటి. జర్నల్ ప్రభావాన్ని కేవలం ఉల్లేఖనాల సంఖ్యతో కాకుండా, ఆ ఉల్లేఖనలు వచ్చిన జర్నళ్ల నాణ్యత ఆధారంగా కూడా అంచనా వేస్తుంది. వివిధ దేశాల పరిశోధన పనితీరు, జర్నళ్ల స్థానం, విభాగాల వారీ ర్యాంకింగ్ వంటి అంశాలను విశ్లేషించడానికి ఇది ఉపయోగపడుతుంది. జర్నల్ నాణ్యతను అంచనా వేయడంలో ఎస్జేఆర్ కీలక ప్రమాణంగా పరిగణించబడుతోంది.

ఎనిమిదవది టేలర్ అండ్ ఫ్రాన్సిస్ జర్నల్ సజెస్టర్. సామాజిక శాస్త్రాలు, విద్య, మానవీయ శాస్త్రాలు, వైద్యశాస్త్రం, ఇంజినీరింగ్ వంటి అనేక రంగాల్లో ప్రచురణలకు ఇది ఉపయోగపడుతుంది. పరిశోధన అంశానికి అనువైన జర్నల్ను మాత్రమే కాకుండా, వ్యాస నిర్మాణం, ప్రచురణ అవసరాలు, రచయిత మార్గదర్శకాలను కూడా అందిస్తుంది.

తొమ్మిదవది స్ప్రింగర్ నేచర్ జర్నల్ సజెస్టర్. ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక శాస్త్రీయ ప్రచురణ సంస్థలలో స్ప్రింగర్ నేచర్ ఒకటి. ఈ సాధనం పరిశోధన సారాంశాన్ని విశ్లేషించి, అనువైన జర్నళ్లను సూచిస్తుంది. ప్రచురణ పరిధి, ప్రభావ సూచికలు, సమీక్ష విధానం, బహిరంగ ప్రాప్యత ఎంపికలు వంటి అంశాలను కూడా పరిశోధకులకు అందుబాటులో ఉంచుతుంది.

పదవది జర్నల్-ఆథర్ నేమ్ ఎస్టిమేటర్ (జేన్-జేఏఎన్ఈ). ఇది ప్రధానంగా జీవశాస్త్రాలు, వైద్యశాస్త్ర పరిశోధనలకు ఉపయోగపడే తెలివైన సాధనం. పరిశోధన సారాంశం లేదా కీలక పదాలను నమోదు చేసినప్పుడు, ఇప్పటికే ప్రచురితమైన సమానమైన వ్యాసాలను విశ్లేషించి తగిన జర్నళ్ళను, సంబంధిత రచయితలను, ఆ రంగంలో పనిచేస్తున్న నిపుణులను సూచిస్తుంది. కొత్త పరిశోధకులకు ఇది అత్యంత ఉపయోగకరమైన సమాచార వేదికగా నిలుస్తుంది.

ఈ సాధనాలన్నీ ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నప్పటికీ, వాటి విధానం, పరిధి, బలాలు వేర్వేరుగా ఉంటాయి. కొన్ని నిర్దిష్ట ప్రచురణ సంస్థల జర్నళ్ళను మాత్రమే సూచిస్తే, మరికొన్ని ప్రపంచవ్యాప్తంగా జర్నల్ నాణ్యతను విశ్లేషిస్తాయి. అందువల్ల ఒకే సాధనంపై ఆధారపడకుండా, కనీసం రెండు లేదా మూడు వేదికల్లో ఫలితాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవడం ఉత్తమ పద్ధతి.

అలాగే జర్నల్ ఎంపికలో కేవలం ప్రభావ సూచికను మాత్రమే కాకుండా, జర్నల్ లక్ష్యం, పరిశోధన పరిధి, సమీక్ష నాణ్యత, ప్రచురణ సమయం, బహిరంగ ప్రాప్యత (ఓపెన్ యాక్సెస్) విధానం, ప్రచురణ వ్యయం, నైతిక ప్రమాణాలు, సూచిక డేటాబేస్లలో నమోదు వంటి అంశాలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలి. ఇటీవలి కాలంలో నకిలీ లేదా నాణ్యతలేని జర్నళ్ళు పెరుగుతున్న నేపథ్యంలో, ఇటువంటి విశ్వసనీయ జర్నల్ ఫైండర్ సాధనాలు పరిశోధకులకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, జర్నల్ ఫైండర్ సాధనాలు కేవలం ఒక జర్నల్ను సూచించే యాంత్రిక వ్యవస్థలు కావు. అవి పరిశోధన నాణ్యతను ప్రపంచానికి చేరవేసే సరైన వేదికను గుర్తించడంలో మార్గనిర్దేశం చేసే శాస్త్రీయ సహాయక వ్యవస్థలు. ఒక మంచి పరిశోధన సరైన జర్నల్లో ప్రచురితమైనప్పుడే దానికి తగిన గుర్తింపు, ఉల్లేఖనలు, ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం లభిస్తాయి. అందువల్ల ప్రతి పరిశోధకుడు ఈ సాధనాలపై అవగాహన పెంపొందించుకొని, వాటిని సమర్థవంతంగా వినియోగించడం ఆధునిక పరిశోధనా సంస్కృతిలో ఒక అనివార్య నైపుణ్యంగా మారింది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ శాశ్వత ఎత్తివేతకు ప్రజలంతా ఏకమవ్వాలి

- డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్




**జవహర్‌నగర్, జూలై 26 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ శాశ్వత ఎత్తివేత లక్ష్యంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జవహర్‌నగర్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా డంపింగ్ యార్డ్ కారణంగా తీవ్ర కాలుష్యం, భరించలేని దుర్వాసన, అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా ఎత్తివేసేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ఆయన, డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అవగాహన సదస్సులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, జవహర్‌నగర్ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డంపింగ్ యార్డ్ ఎత్తివేతపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

## మహిళలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి

- హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్



**ముషీరాబాద్, జులై 26 (జనం సాక్షి) :** మహిళలు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడటంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణ, ప్రధాన కార్యదర్శి మీర్ వహాజ్ అలీఖాన్ లు అన్నారు. ఈమెరకు ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని కెనరా బ్యాంక్ జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో మాస్టర్ బి. కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 50 మంది విద్యార్థులకు కలర్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తైక్వాండో నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. సర్టిఫికెట్లు, బెల్ట్‌లు పొందిన విద్యార్థులను అభినందించిన బి. కృష్ణ మాట్లాడుతూ, మహిళలు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందితే ప్రమాదకర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కూడా అలవడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ మాస్టర్ సంజయ్, కోచ్‌లు స్వామి, హరిణి, సాహస, విష్ణు వెంకట్ భాస్కర్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమర జవాన్ రాంచందర్‌కు ఘన నివాళి



**అల్వాల్, జూలై 26 (జనంసాక్షి) :** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బొల్లారం ప్రాంతానికి చెందిన అమర జవాన్ రాంచందర్‌కు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. బొల్లారం స్టేషన్ సమీపంలోని రాంచందర్ విగ్రహానికి ఆయన సతీమణి దివ్యతో కలిసి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి త్యాగాలు దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, నార్ల సురేష్, శోభన్ బాబు, పవన్, అతిక్ పాషా, జావిద్, ఆరిఫ్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ హితమే మన సాంప్రదాయం

- ప్రతి ఇంట వినాయక మండపాలలో మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయాలి
- ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు, జూలై 26 (జనంసాక్షి) :** పర్యావరణ హితమే మన సాంప్రదాయమని ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని గ్రైన్ అండ్ సీడ్ మేర్చంట్స్ హాల్ లో తాండూరు గోశాల సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి గణపతి.. మహా గణపతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి హాజరుకావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సనాతన ధర్మంలో ప్రకృతిని ఆరాధిస్తాం కాబట్టి పర్యావరణ పరిరక్షణ మన భాధ్యత అన్నారు. మన సంప్రదాయాలు పర్యావరణ హితంగా అనాదిగా వస్తున్నాయని వాటిని ఆచరించడం మన కర్తవ్యం అని, అలాగే ప్రతి ఇంటిలో మరియు వినాయక మండపాలలో కూడా మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసేలా పురప్రముఖులు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాల్సిందిగా పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూరు మునిసిపాలిటీ చైర్మన్ నీరజ బాల్ రెడ్డి ,హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు , గ్రైన్ అండ్ సీడ్స్ మేర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కటకం వీరేందర్ , తాండూరు గోశాల అధ్యక్షులు వినోద్ జైన్, గోశాల ప్రతినిధులు,కుల సంఘాల, వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాటానికి కాంగ్రెస్ అండ

**ఉప్పల్, జూలై 26 (జనం సాక్షి) :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారనే వార్తల నేపథ్యంలో ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చిల్కానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేయడం, విద్యార్థుల ఆందోళనలకు మద్దతుగా నిలవడం వల్లే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల పోరాటానికి లభించిన విజయంగా ఆయన అభివర్ణించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని రాజేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. తమ భవిష్యత్తు కోసం విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహించినా కేంద్ర ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందని, వారి తరఫున రాహుల్ గాంధీ గళం వినిపించారని అన్నారు.

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడకుండా పరీక్షల నిర్వహణలో అత్యంత పారదర్శకత, పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని రాజేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించే పోటీ పరీక్షల విషయంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం న్యాయం కోరుతూ ఆందోళన చేస్తుంటే వారిపై నిర్బంధాలు విధించడం, పోలీసుల ద్వారా అణచివేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులకు తమ సమస్యలను ప్రశాంతంగా వ్యక్తం చేసే హక్కు ఉందని పేర్కొన్నారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై దాడులకు పాల్పడిన పోలీసులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులకు అండగా నిలిచిన కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి చిల్కానగర్ డివిజన్‌లో విద్యార్థులకు మద్దతుగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్తకు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ప్రత్యేకంగా



కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీసీసీ సభ్యుడు గండికోట గణేష్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మొహీనుద్దీన్, బీసీ అధ్యక్షుడు దండుగల శంకర్, జక్రిపోతుల చంద్రయ్య, అమర్, పల్నాటి డేవిడ్, రాధాకృష్ణ, బి.ఎం. కిరణ్, బలరాం, మరపక సాయిలు, పల్లటి రమేష్, కొండ్ర రాములు, కూరెల్లి యాదగిరి, సత్యం, పగిడం రామ నరసయ్య, జోగు సుదర్శన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళా నాయకురాళ్లు జైనాబి, లావణ్య, పుష్పతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విద్యార్థులకు మద్దతుగా నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యారంగంలో సమూల మార్పులు రావాలి

- రాజీనామాతోనే పోరాటం ముగియదు
- సిటిజన్ ఆఫ్ హైదరాబాద్ నిర్వాహకురాలు రవిషా




**హైదరాబాద్, జూలై 26 (జనం సాక్షి) :** విద్యారంగంలో సమూల సంస్కరణలు తీసుకురావాలని, ఒక మంత్రి రాజీనామాతో విద్యార్థుల పోరాటం ముగిసిపోదని సిటిజన్ ఆఫ్ హైదరాబాద్ నిర్వాహకురాలు రవిషా అన్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాల వల్ల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. విద్యార్థుల గొంతుకు మద్దతుగా, విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే డిమాండ్‌తో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సిటిజన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వీ స్టాండ్ టుగెదర్' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రవిషా మాట్లాడుతూ... ఇది కేవలం ఒక వ్యక్తి లేదా ఒక మంత్రి రాజీనామా కోసం జరిగిన ఉద్యమం కాదని, దేశ విద్యా వ్యవస్థలో నెలకొన్న లోపాలను సరిదిద్దేందుకు ప్రారంభమైన ప్రజా ఉద్యమమని అన్నారు. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించడం అంత సులభం కాదని, కానీ ప్రజలు, విద్యార్థులు ఐక్యంగా నిలబడటం వల్లే ఈ పోరాటం చారిత్రాత్మకంగా మారిందని పేర్కొన్నారు. రాజీనామా ఒక దశ మాత్రమేనని, అసలు లక్ష్యం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడమేనని ఆమె స్పష్టం చేశారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూ, బాధ్యతాయుత పాలన కోసం ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా ఐక్యతతో ముందుకు వస్తే ప్రజా సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని, ఇకపై ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, జవాబుదారీతనం పెంచేలా ప్రభుత్వం సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తిరిగి నమ్మకం కలిగించేలా తక్షణ చర్యలు అవసరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొని విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కార్మికుల అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి

- లేబర్ కార్డులు, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా అధ్యక్షులు కే. రామస్వామి



**చేవెళ్ల, జూలై 26 (జనంసాక్షి) :** కార్మికుల అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి, భవన నిర్మాణ కార్మికులందరికీ లేబర్ కార్డులు జారీ చేసి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా అధ్యక్షులు కే.రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ రంగ కార్మికుల నాల్గవ మహాసభలు మండల అధ్యక్షుడు బాబురావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన కే. రామస్వామి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కోట్లాది రూపాయల నిధులు ఉన్నప్పటికీ కార్మికులకు వాటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. ప్రతి కార్మికుడు లేబర్ కార్డు పొందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కార్మికుల అడ్డాల వద్ద తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, విశ్రాంతి షెడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, కార్మికులకు రూ. 5కే భోజన వసతి ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. ఆర్థిక సంస్కరణల వల్ల కార్మిక వర్గానికి ఎలాంటి ప్రయోజనం కలగలేదని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోందన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జే.శ్రీను, ఉపాధ్యక్షుడిగా పి.హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీను, కార్యదర్శిగా జి.బాబును ఎంపిక చేయడంతో పాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులు, పదిమంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి.మక్బూల్, శ్రీను, ఆంజనేయులు, నరసింహులు, యాదయ్య, లక్ష్మి, లీనా, లలితమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిలిపివేయాలి

- జస్టిస్ జి. రాధారాణి, పరకాల ప్రభాకర్




**హయత్‌నగర్, జులై 26 (జనం సాక్షి) :** రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్ లోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో "76 సంవత్సరాల భారత రాజ్యాంగం - లౌకికవాదం, సామాజిక న్యాయం, ఓటింగ్ హక్కులు" అంశంపై సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా విశ్రాంతి న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమానికి రాజ్యాంగబద్ధమైన చట్టపరమైన ఆధారం లేదని అభిప్రాయపడ్డారు. భారత ఎన్నికల సంఘం ఈ కార్యక్రమంపై సమగ్ర అవగాహనతో వ్యవహరిస్తున్నట్లు కనిపించడం లేదని పేర్కొన్నారు. దేశంలో అసమానతలు, అంటరానితనం, అల్పసంఖ్యాక వర్గాల సమస్యలు కొనసాగుతున్నంత వరకు ప్రత్యేక అవకాశాలు కొనసాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం పునః సమీక్షించాలని, అవసరమైతే ప్రజాస్వామ్య, లౌకికవాద శక్తులు దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ ను వ్యతిరేకించడం తక్షణ అవసరమని అన్నారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలులో భిన్నమైన విధానాలు అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఎస్ ఐ ఆర్ పేరుతో ఓటర్ల జాబితాపై ప్రభావం చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

# ఓటరు సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ దృష్టి

- గడువులోగా 100 శాతం నమోదు పూర్తి చేయాలి
- పీసీసీ ఉపాధ్యక్షుడు జగదీష్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్



**చేవెళ్ల, జూలై 26 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటరు సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి జగదీష్, ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ సూచించారు. ఆదివారం చేవెళ్ల పట్టణంలోని అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో చేవెళ్ల నియోజకవర్గ స్థాయి బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ)పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే చేవెళ్ల నియోజకవర్గం ఓటరు సవరణ ప్రక్రియలో చివరి స్థానంలో ఉండటం ఆందోళనకరమని అన్నారు. పార్టీ నాయకులు, బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని, నిర్లక్ష్యం చేస్తే పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం చేవెళ్ల నియోజకవర్గంలో ఓటరు సవరణ నమోదు 76 శాతం మాత్రమే పూర్తైందని, మిగిలిన 24 శాతం గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో బీఎల్‌వోలు, బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పార్టీ ఆదేశాలను నిర్లక్ష్యం చేసే నాయకులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి ఓటు కాంగ్రెస్ పార్టీకి కీలకమని పేర్కొంటూ, చేవెళ్ల నియోజకవర్గంలోని 298 పోలింగ్ బూత్‌లలో నాయకులు సమన్వయంతో పనిచేసి ఓటరు సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవులకు ప్రాధాన్యత ఇస్తారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి, సొలిపురం బల్వంత్ రెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్,, నవాబ్‌పేట్, మండలాల పార్టీ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గుడుపల్లి పెంటా రెడ్డి, సత్యనారాయణ, రావుగారి వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంటయ్య గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజ అగిరెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింహులు, కృష్ణనాయక్, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు బండారి ఆగి రెడ్డి, మధుసూధన్ గుప్తా, వీరేందర్ రెడ్డి, మల్గారి మల్లా రెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరును ఎడారి చేస్తున్న కాంగ్రెస్

• మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి



**కృష్ణ, జూలై 26 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పాలనలో పాలమూరు జిల్లాకు నీటి విషయంలో తీరని అన్యాయం జరిగిందని ఈ ప్రభుత్వం జిల్లాను ఎడారి చేస్తున్నదని రాష్ట్ర మాజీ మంత్రులు శ్రీనివాస్ రెడ్డి,లక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ – కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో కృష్ణా నదిపై గూగల్ ప్రాంతంలోని బ్రిడ్జిని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మంత్రు లు వి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ రాజేందర్ రెడ్డి, అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి పరిశీలించా రు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూకర్ణాటక వైపు ఉన్న ప్రాజెక్ట్ ల్లో నీళ్లు ఉంటే తెలంగాణ వైపు ఉన్న ప్రాజెక్ట్ ల్లో చుక్కనీరు లేదని అన్నారు.కర్ణాటక, తెలంగా ణ ల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి తెలంగాణ రైతంగా నికి అన్యాయం చేస్తున్నా రని పేర్కొన్నారు. మహ బూబ్ నగర్ ను ఎడారి చేసేందుకు పక్క రాష్ట్రులు ప్రయత్నం చేస్తున్నాయనీ విమర్శించారు.తుంగభద్ర నీరు రాకుండా ఆర్డీఎస్ వద్ద కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అక్ర మంగా ప్రాజెక్ట్ లు నిర్మాణం చేస్తున్నాయన్నారు. శ్రీశైలం కు నీరు రాకుండా చేస్తున్నా రనీ అన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ 10 శాతం పనులు చేస్తే రిసర్వాయర్లు నింపుకు నేందుకు అవకాశం ఉండే దన్నారు. 10 లక్షల ఎక రాలకు సాగు నీరు వచ్చే దన్నారు. ప్రాజెక్ట్ వెంటనే పూర్తి చేయాలనీ డిమాండ్ చేశారు.గుండ్రేవుల నుంచి నీరు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ కుట్ర చేస్తుందనీ ఆరోపించారు. కర్ణాటక కూడా అక్రమ ప్రాజెక్ట్ బ్యారేజిలు,చెక్ డ్యామ్ లు కదుతున్నారన్నారు. పై నుంచి నీరు రాకుండా చేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. కృష్ణ.. భీమా నదులపై అక్రమ ప్రాజెక్టు.. బ్యారేజిల.. చెక్ డ్యామ్‌లు కదుతున్నారనీ.ఆల్మట్టి డ్యామ్ 300 టీఎంసీ పెంచేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే భూసేకరణ ప్రారంభించారన్నారు. భీమా నదికే నేరుగా హైడ్రాలిక్ గేట్స్ పెట్టరనీ అన్నారు. వర్షాకాలం కూడా నీళ్లు రాకుండా చేస్తున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఒక అవగహన తో ప్రాజెక్ట్ లు డిజైన్ చేసారు. గ్రావిటి తో నీళ్లు వచ్చేవి 200 టీఎంసీ నీళు విని యోగించుకునేందుకు అవకాశం ఉండేదనీ తెలిపారు.కానీ ఇప్పుడు కర్ణాటక వద్ద నీళ్ళు నిలిపే ప్రయత్నం చేస్తున్నారనీ అన్నారు.ఒకవైపు తెలంగాణ ప్రాజెక్ట్ లు పూర్తి చేయాలని మేము పోరాటం చేస్తుంటే పైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అక్రమ ప్రాజెక్ట్ లు, రిసర్వాయర్లు, బ్యారేజి నిర్మాణం చేసి తెలంగాణ కు నీళ్లు రాకుండా చేస్తున్నారనీ మండిపడ్డారు. తెలంగాణ పైసలతోనే తుంగభద్ర ప్రాజెక్ట్ నిర్మాణం చేసారు కానీ ప్రాజెక్ట్ నుంచి మహబూబ్ నగర్‌కు నీరు రావడం ఇవ్వకుండా కుట్ర చేస్తున్నారన్నారు. కర్ణాటక లో ముగ్గురు ముఖ్య మంత్రుల సమావేశం లో జరిగిన విషయాలు బయట పెట్టాలనీ డిమాండ్ చేశారు.మహబూబ్ నగర్ జిల్లా ప్రమాదంలో ఉందనీ నీళ్లను కాపాడుకోవడానికి పార్టీలకు అతీతంగా పోరా టం చేయాలనీ పిలుపు ఇచ్చారు.గూడూరు వద్ద పెట్టిన హైడ్రాలిక్ గేట్స్ తీసి వేయాలనీ. నిర్మాణం అవుతున్న అక్రమ ప్రాజెక్ట్ లు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కిందికి వచ్చే నీటి తో లక్షన్నర ఎకరాలు యాసంగిలో సాగు చేసేవాళ్ళు కిందికి నీరు రాకుంటే రైతులు పంటలు వేసుకునే పరిస్థితి లేకుండా పోతుందనీ ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయం మీద ఆధా రపడ్డారన్నారు. యాసంగి లో రైతులకు సాగునీరు అందె పరిస్థితి ఇప్పట్లో లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు.ఇతర రాష్ట్రులు మా నీటిని దోచుకోకుండా పోరాటం చేస్తామని, పెండింగ్ ప్రాజెక్ట్ లు పూర్తి చేసేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పని చేసిన ఐఏఎస్ అధికారిని నీటిపారుదల శాఖ సలహాదారుగా నియామకం చేసారనీ ఇక్కడి విషయాలు అక్కడికి చెప్పే అవకాశం ఉంటుందనీ అనుమానం వ్యక్తం చేస్తూ ఆయనను తిరిగి వెనక్కి పంపించాలనీ డిమాండ్ చేశారు.

## ఎల్ఐజీ కాలనీ అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి




**రామచంద్రాపురం, జూలై 26 (జనం సాక్షి) :** భారతి నగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐజీ కాలనీ ప్రజలు ఎప్పుడూ బీఆర్ఎస్‌కు అండగా నిలిచారని, వారి సహకారంతోనే కాలనీలో విస్తృత అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.12 కోట్లతో బీటీ, సీసీ రహదారులు, బస్తీ దవాఖానా, వార్డు కార్యాలయం, సీనియర్ సిటిజన్ సెంటర్, పార్కుల ఆధునీకరణ, ఓపెన్ జిమ్‌లు, చిన్నారుల ఆట పరికరాలు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరా, అండర్ డ్రైనేజీ సమస్యల పరిష్కారం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. బీహెచ్‌ఈఎల్‌కు చెందిన ఆర్థికంగా వెనుకబడిన సుమారు 70 మంది రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. అంతకుముందు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కమ్యూనిటీ హాల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎల్ఐజీ కాలనీ సొసైటీకి సేవలందించిన మాజీ డైరెక్టర్లు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, సొసైటీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు, కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏకతాటి పైకి వీరశైవ లింగాయత్ సమాజం

• సమాజం అభివృద్ధికి నిరంతరం కృషి
• జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు



**సంగారెడ్డి, జూలై 26 (జనం సాక్షి) :** జిల్లాలోని వీరశైవ లింగాయత్ సమాజం ఏకతాటిపై నిలిచింది. వీరశైవ లింగాయత్ సమాజం సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా ముందుకు వెళ్తున్నారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో జిల్లాలోని సమాజం సభ్యులు కూడల సంగం తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు పల్లి నర్సింలు మాట్లాడుతూ.. వీర సేవ లింగాయత్‌ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గౌరవ సలహాదారు మురళి, అడివప్ప, అశోక్ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వారంలో పూర్తి చేయాలి

• ఎమ్మెల్యే సంజీవరెడ్డి
• బీఎల్‌ఏలకు దిశా నిర్దేశం
• ఇంటింటికి వెళ్లి ఓటర్లకు సహకరించాలని సూచన



**నారాయణఖేడ్, జూలై 26 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి ప్రతి బీఎల్‌ఏ బాధ్యతాయుతంగా పనిచేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణ TGII ఛైర్మన్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గా రెడ్డి, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్, నారాయణఖేడ్ నియోజకవర్గ నా×= ఇన్‌చార్జి ఎం.ఏ. ఫహీం పాల్గొన్నారు. ఎస్సీఐఆర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు మరో వారం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని, ప్రతి బీఎల్‌ఏ తమ పరిధిలోని ప్రతి బూత్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఫారాలు బీఎల్‌ఓలకు అందజేశారా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇంకా ఫారాలు సమర్పించని ఓటర్లను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించి వెంటనే దరఖాస్తులను బీఎల్‌ఓలకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవగాహన కల్పిస్తూ సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో బూత్‌వారీ కార్యాచరణ, బీఎల్‌ఏల బాధ్యతలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, పార్టీ నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం

• ప్రార్థన మందిరాలు మినహా ఇతర అవసరాలకు పన్నులు చెల్లించాల్సిందే
• అమీరాబాద్ గ్రామ పంచాయతీ పాలకమండలి కీలక నిర్ణయం



**న్యాల్‌కల్, జూలై 26 (జనం సాక్షి) :** గ్రామంలో పారిశుద్ధ్యం, త్రాగునీటి అవసరాలే ప్రధానం. వివిధ ప్రార్థనాలయాలు (మందిరం, మసీదు, చర్చి, ఇతరత్రా) మినహా ఇతర అవసరాల కోసం పంచాయితీ ట్రాక్టర్, నీటి టాంకర్ ను సద్వినియోగం చేసుకోవాలంటే అట్టి వ్యక్తులు తప్పనిసరిగా గ్రామ పంచాయతీ నిబంధనల మేరకు పన్నులు చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని అమీరాబాద్ గ్రామ సర్పంచ్ విజయ, పాలక మండలి సభ్యులు నిర్ణయించారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి నిర్ణయించారు. అత్యవసరాలు మినహా.. తరచుగా చిన్నపాటి వివిధ అవసరాల కోసం గ్రామానికి చెందిన పలువురు ట్రాక్టర్, నీటి ట్యాంకును వాడకంతో ఇబ్బందిగా మారిందని, గ్రామ పంచాయతీకి నిధుల సమస్య, తదితర అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాలక మండలి ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు గ్రామ ప్రజానీకం గ్రామాభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలని సర్పంచ్ , పాలకమండలి సభ్యులు కోరారు.

## ఫీజుల బకాయిలు - బీజేపీ లడాయి పోస్టర్ ఆవిష్కరణ



**వనపర్తి బ్యూరో, జూలై 26 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని, విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల విద్యాభవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా వనపర్తి బీజేపీ జిల్లా కార్యాలయంలో "ఫీజుల బకాయిలు – బీజేపీ లడాయి" పోస్టర్‌ను జిల్లా అధ్యక్షులు డి. నారాయణ, యువమోర్చా నాయకులు అరవింద్ కలిసి విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు కళాశాలల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరీక్షలు రాయడంలో, సర్టిఫికెట్లు పొందడంలో, ఉన్నత విద్యను కొనసాగించడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు.విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా "ఫీజుల బకాయిలు – బీజేపీ లడాయి" ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల కోసం బీజేపీ నిరంతరం విద్యార్థుల తరపున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుల శ్రీశైలం,రామన్న గారి వెంకటేశ్వర్లు,జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు,జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా కార్యదర్శి మనీ వర్ధన్,జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్,ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొమ్ము శ్రీనివాసులు,13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గోపీనాథ్, యువ మోర్చా నాయకులు శివ,రాజేష్,రవి,చందు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్‌బీ పరిశ్రమలో కార్మికుడి మృతి

• విధుల్లోనే అస్వస్థతకు గురై మృతి
• బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

**గుమ్మడిదల, జూలై 26 (జనం సాక్షి) :** బొంతపల్లి పారిశ్రామికవాడలోని జీఎస్‌బీ పరిశ్రమలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు రాజు ప్రసాద్ (58) విధుల్లో ఉండగానే ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. సహచరులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించిన అనంతరం పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి హామీ ఇవ్వలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. విధుల్లో ఏర్పడిన పరిస్థితుల వల్లే రాజు ప్రసాద్ మృతి చెందారని పేర్కొంటూ, మృతదేహంతో పరిశ్రమ ప్రధాన గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి తక్షణ పరిహారం ప్రకటించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆందోళనకు స్థానికులు, కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## కేజీబీవీ ఉద్యోగులను క్రమబద్దీకరించాలి


• పోస్టుకార్డులతో కేజీబీవీ ఉద్యోగుల నిరసన



**శివ్వంపేట, జూలై 26 (జనంసాక్షి) :** కేజీబీవీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శివ్వంపేట కేజీబీవీలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సీఎం పేరిట పోస్టుకార్డులు పంపిస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్ఎస్, ఎస్ఎస్ఏ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. కనీస వేతనం చెల్లించడంతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, అలాగే గత సమ్మెకాలానికి సంబంధించిన జీతాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూ టీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు గంగాధర్, ఉపాధ్యాయులు మంజుల, జ్యోతి, స్వప్న, కోమల, రాధిక, జ్వాల, స్వప్న, వెరోనిక, రాణి, సంతోషి తదితరులు ఉన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ.20 లక్షల విలువైన భూదానం

• మాజీ సర్పంచ్ పట్లోళ్ల అమరేందర్ రెడ్డి



**సదాశివపేట, జూలై 26 (జనంసాక్షి) :** మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ పట్లోళ్ల సరళ అమరేందర్ రెడ్డి నాలుగు గుంటల భూమిని దానం చేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు దాతను అభినందించి, ఆయన కుటుంబంపై వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ సర్పంచ్ నికిత బింబాదర్ చారి మాట్లాడుతూ విలువైన భూమిని ఆలయానికి దానం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సైనికుడి సేవలకు జాతీయస్థాయిలో గుర్తింపు

• సమాజ సేవకు దక్కిన సముచిత గౌరవం
• ఆంజనేయులు ఆర్మీకి గౌరవ డాక్టరేట్




**మక్తల్, జూలై 26 (జనంసాక్షి) :** దేశ రక్షణ రంగంలో విశిష్ట సేవలందిస్తూ, సమాజ సేవను జీవిత ధ్యేయంగా మలుచుకున్న మక్తల్ మండలం మంతన్‌గౌడ్ గ్రామానికి చెందిన డాక్టర్ ఎం. ఆంజనేయులు (ఆర్మీ) కు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ లభించింది. ప్రపంచ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆఫ్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరులోని గాంధీ భవన్‌లో నిర్వహించిన జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఆంజనేయులకు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. దేశ రక్షణతో పాటు విద్యార్థులకు ఉపాధి కల్పన, సమాజ సేవలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో 2019లో స్థాపించిన వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఆంజనేయులు యువతకు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, పారామిలటరీ, పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఎస్‌సీ జీడీ తదితర ప్రభుత్వ ఉద్యోగాల కోసం నాణ్యమైన శిక్షణ అందిస్తున్నారు. ఇప్పటివరకు అకాడమీ ద్వారా సుమారు 125 మంది యువత వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి విధులు నిర్వహిస్తున్నారు. శిక్షణ కార్యక్రమాలతో పాటు జిల్లాలోని గ్రామాలను సందర్శిస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు రక్షణ శాఖ ఉద్యోగాలపై అవగాహన కల్పించడం, చదువు మధ్యలో మానేసిన యువతకు ప్రేరణ ఇవ్వడం, ఉచిత కోచింగ్, అధ్యయన సామగ్రి, అవసరమైన వారికి ఉచిత వసతి కల్పించడం వంటి సేవలను ఆంజనేయులు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా అనాథలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తన సొంత నిధులతో సహాయం చేస్తూ వారి భవిష్యత్తుకు అండగా నిలుస్తున్నారు. ప్రస్తుతం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట (320ఏ) సహకారంతో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ రాత పరీక్షలతో పాటు ఫిజికల్ ట్రైనింగ్ అందిస్తూ యువతను ప్రభుత్వ ఉద్యోగాలకు తీర్చిదిద్దుతున్నారు. దేశ సేవతో పాటు సమాజ సేవను సమన్వయం చేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఆంజనేయులకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజిక సేవకులు, మాజీ విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# అడుప మహేష్ హత్య కేసులో నిందితుల అరెస్ట్

▫ విలేకరుల సమావేశంలో వరంగల్ సీపీ శ్వేత వెల్లడి



**వరంగల్ బ్యూరో, జూలై 26 (జనం సాక్షి) :** అడుప మహేష్ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్టు వరంగల్ సీపీ శ్వేత వెల్లడించారు. **ఆదివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.** గతంలో ఒక హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడి బెయిల్‌పై తిరిగి వచ్చిన ప్రధాన నిందితుడు పత్తి కుమార స్వామి,అలియాస్ కుమార్, తండ్రి పేరు నరసయ్య, వయస్సు 35,కులం బుడగ జంగాలు, వృత్తి డ్రైవర్, నివాసం బాలాజీ నగర్,ఎనుమాముల, వరంగల్ జిల్లా. తనపై తప్పుడు ప్రచారం చేసి స్థానిక ప్రజాప్రతినిధి వద్ద తన రాజకీయ ప్రాధాన్యతను దెబ్బతీస్తున్నాడనే అనుమానంతో అడుప మహేష్‌పై ప్రధాన నిందితుడు పట్టి కుమార స్వామి పాత కక్షలను మనసులో పెట్టుకోని ఏవిధంగా నైనా మృతుడుని చంపాలనే ఉద్యేశంతో మిగితా నిందితులలైన. 2.గంధం నరేష్, తండ్రిపేరు నర్సయ్య, వయస్సు 40, బాలాజీ నగర్, ఏనుమాముల, వరంగల్ జిల్లా. 3.జన్ను మధు, తండ్రి పేరు మాణిక్యం, వయస్సు 42, ఎస్.ఆర్ నగర్, ఏనుమాముల, వరంగల్ జిల్లా, 4. పిట్ల శ్రీనివాస్ ఆలియాస్ బండి శ్రీను, తండ్రి పేరు ఎల్లయ్య, తూఫ్రాన్, మెదక్ జిల్లా. 5.సురేష్, ఎన్.టి.ఆర్ నగర్, వరంగల్ జిల్లా.( ప్రస్తుతం పరారీలో వున్నాడు ),6.లాసాని రాం సాయి, తండ్రి పేరు నర్సింగరావు, సుందరయ్య నగర్, వరంగల్ జిల్లా. 7.టోని సంజయ్య,తండ్రిపేరు ఆంటోని, వయస్సు 36, ఆళ్వాల్, సికింద్రాబాద్, 8.పోతారం శివకుమార్, తండ్రిపేరు మొగులయ్య, వయస్సు 35,ఈస్ట్ మారెడు పల్లి, సికింద్రాబాద్‌కు చెందిన నిందితుల కలసి మృతుడు అడుప మహేష్‌ను హత్య చేసేందుకు సిద్దపడి. ఈ నెల 18వ తేదిన రాత్రి తొమ్మిది నుండి పది గంటల సమయంలో నిందితులు పరిమళ కాలనీ రోడ్డు నంబర్ 2 వద్ద మృతుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ సంఘటలో మృతుడు తీవ్రంగా గాయంపడటంతో స్థానిక హస్పటల్‌లో చికిత్స పోందుతూ ఈ నెల 19వ తేది రాత్రి 7గంటలకు మరణించాడు. ఈ సంఘటనపై గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుగా నమోదు చేసిన కేసు దర్యాప్తు అధికారి విశ్వేశ్వర్ దర్యాప్తు చేపట్టారు. నిందితులను త్వరగా పట్టుకొనేందుకుగాను ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి ఈ హత్యకు పాల్పడిన ఏడుగురు నిందితులను అరెస్టు చేసి జూడిషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.ఈ కేసులో దర్యాప్తుగా వేగంగా పూర్తి చేసి గౌరవ న్యాయస్థానం ద్వారా నిందితులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకొవడం జరుగుతుంది. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచనిన మామూనూరు ఏసిపి వెంకట్, టాస్క్‌ఫోర్స్ ఏసిపి మధుసూదన్, దర్యాప్తు అధికారి విశ్వేశ్వర్, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌స్పెక్టర్లు బాబులాల్, సుబ్బారెడ్డి,దేవేందర్,శ్రీధర్‌తో పాటు గీసుగొండ పోలీస్ స్టేషన్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అభినందనలు తెలిపారు.

## 'పెద్ది' ప్రాణాలు కాపాడిన డాక్టర్ మమత రెడ్డి



**నర్సంపేట జూలై 26 (జనం సాక్షి) :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం ఉదయం గుండెపోటు రావడంతో గ్రహించిన కుటుంబ సభ్యులు రోహిణి ఆస్పటల్ తరలించటంతో అక్కడ వైద్యురాలు డాక్టర్ మమతా రెడ్డి వెంటనే ట్రీట్మెంట్ స్టార్ట్ చేసి. రకరకాల ప్రయత్నాలు చేసి ప్రాణాలు కాపాడారు. కానీ ఆశలు దాదాపు సన్నగిల్లిన సమయంలో కూడా వెనుకడుగు వేయకుండా పోరాడి ఓ ప్రాణాన్ని నిలబెట్టడం నిజంగా గొప్ప సేవ అని ప్రజలు అంటున్నారు. గుండెపోటు వచ్చిన అనంతరం, డాక్టర్ మమత రెడ్డి తన వైద్య బృందంతో కలిసి ఉదయం నుంచి నిర్విరామంగా శ్రమించారు. ఒక్కసారి కాదు... రెండుసార్లు కాదు... తొమ్మిది సార్లు సీపీఆర్ నిర్వహించి, చివరకు గుండె స్పందనను తిరిగి తీసుకురావడంలో విజయం సాధించారు. ఈ అరుదైన వైద్య విజయాన్ని పలువురు మెడికల్ మిరాకిల్"గా అభివర్ణించారు. డాక్టర్ మమత రెడ్డి మరియు ఆమె వైద్య బృందం చూపిన నిబద్ధత, సేవాభావం, అంకితభావం నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు.

## మెట్ట రైతులను ఆదుకోవాలి

▫ ఎకరాకు 8 వేలు సాయం చేయాలి: రైతు సంఘం




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎల్ నినో ప్రభావంతో నష్టపోతున్న మెట్ట రైతులకు ఎకరాకు 8 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పస్య పద్మ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్ లో జరిగిన రైతు సంఘం 3వ మహాసభల్లో ఆమె మాట్లాడారు. బోర్ల బావులకు సబ్సిడీపై సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని, విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. తాగు సాగు నీటి కోసం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలన్నారు. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, రైతులతో చర్చించకుండా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటి చంద్రమౌళి, మామిడాల సమ్మిరెడ్డి, పైళ్ల శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ వి.నరేష్ కుమార్‌కు ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు



**వరంగల్ ఈస్ట్, జూలై 26(జనం సాక్షి) :** హైదరాబాద్‌లోని సర్దార్ పటేల్ హాల్, కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, నారాయణగూడలో ఆదివారం నిర్వహించిన "తెలంగాణ హెల్త్‌కేర్ పాలసీ స్టేట్ లెవల్ సింపోజియం , ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డ్స్–2026" కార్యక్రమంలో ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు, టీజీఎంసీ సభ్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ , తానా, వరంగల్ ఫైనాన్స్ సెక్రటరీ డా. వి. నరేష్ కుమార్ "ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు–2026" ప్రదానం చేశారు.వైద్య రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలు, ప్రజారోగ్య కార్యక్రమాల్లో చురుకైన పాత్ర, వైద్య వృత్తిలో నిబద్ధతను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేశారు.ఈ కార్యక్రమానికి బీజేపీ మెడికల్ సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా. కొప్పుల రాజశేఖర్ అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు,కాగజ్‌నగర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు,ఆర్మూర్ ఎమ్మెల్యే డా. పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్పాల్గొని ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ మెడికల్ సెల్ ప్రతినిధులు మరియు వివిధ జిల్లాల నుంచి హాజరైన వైద్యులు డా. వి. నరేష్ కుమార్ను అభినందిస్తూ, ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో ప్రత్యేక న్యూరో క్యాంప్



▫ ప్రముఖ న్యూరో సర్జన్ డా. అభిలాష్ గజ్జల

▫ ఆధ్వర్యంలో అత్యాధునిక పరీక్షలు...

**వరంగల్ ప్రతినిధి, జూలై: 26 ( జనం సాక్షి):** నరాలు, మెదడు మరియు వెన్నుపూస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట, వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు ఈ నెల 27, 28, 29 తేదీల్లో ప్రత్యేక న్యూరో క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.ఈ క్యాంప్‌లో ప్రముఖ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డా. అభిలాష్ గజ్జల రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి, వ్యాధి తీవ్రతను అంచనా వేసి అవసరమైన చికిత్సపై సమగ్ర సలహాలు అందించనున్నారు. నిరంతర తలనొప్పి, మెదడు సంబంధిత సమస్యలు, పక్షవాతం, చేతులు––కాళ్లలో తిమ్మిర్లు, మెడ నొప్పి, వెన్నునొప్పి, డిస్క్ సమస్యలు, నరాల బలహీనత, వెన్నుపూస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ ప్రత్యేక క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. క్యాంప్ సందర్భంగా న్యూరో ప్రొఫైల్ రక్త పరీక్షలు కేవలం రూ. 1,000కే అందించబడతాయి. అలాగే సీటీ స్కాన్, ఎన్సిఎస్ స్కాన్, ఈఈజీ వంటి అత్యవసర నిర్ధారణ పరీక్షలు కూడా ప్రత్యేక రాయితీ ధర రూ. 1,000కే నిర్వహించబడతాయి. అంతేకాకుండా వెన్నుపూస శస్త్రచికిత్సలపై 20 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు కూడా అందుబాటులో ఉంటుందని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ క్యాంప్ ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించ బడుతుంది. నరాల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రజలు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకుని ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది. అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట క్రాస్ రోడ్, అరేపల్లి, లో సెల్ నంబర్ 9459875556 సంప్రదించాలని తెలిపారు.

## కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

▫ పాల్గొన్న మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, ప్రొఫెసర్ సురేష్ లాల్, శ్రీరామ్ నాయక్



**హనుమకొండ ప్రతినిధి జులై 26 (జనం సాక్షి) :** హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో బంజారా సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ ఉత్సవాలు ఐదవ రోజుకు విజయవంతంగా చేరుకుంది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, ప్రొఫెసర్ సురేష్ లాల్ పాల్గొన్నారు సీతారాం నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంప్రదాయం ప్రకారం గోధుమలు బుట్టలో పోసి తొమ్మిది రోజుల తీజ్ ఉత్సవాలకు ఘనంగా నిర్వహించాలని బంజారా ఆడపడుచులు యూనివర్సిటీ విద్యార్థినులు సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని ప్రకృతి పండుగగా జరుపుకునే ఈ ఉత్సవాలను పవిత్రంగా నిర్వహించడం బంజారా సంస్కృతికి ప్రత్యేకగా నిలుస్తుందని పేర్కొన్నారు ఈ తీజ్ ఉత్సవాలను యూనివర్సిటీలోని మేధావులు ఉద్యోగస్తులు విద్యార్థిని విద్యార్థులు 9 రోజులు వరకు జరిగే తీజ్ ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయవ లసిందిగా మాజీ పార్లమెంటు సభ్యులు సీతారాం నాయక్ కోరారు ఈ కార్యక్రమంలో మేధావులు మరియు ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు పాల్గొన్నవారు వెంకట్ నాయక్ రమేష్ నాయక్ మరియు విద్యార్థినీలు శ్రావణి నందిని మౌనిక సంగీత జ్యోతి ఆర్గనైజింగ్ కమిటీ వంకుడోత్ అశోక్ నాయక్, శ్రీకాంత్ నాయక్, సచిన్ రాజేందర్ వీరన్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనం సాక్షి):** నీట్ పేపర్ లీకేజీ పై బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ చేసిన రాజీనామా విద్యార్థుల పోరాట ఫలితమేనని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు హెచ్ వేమన అన్నారు. జిల్లా కేంద్రంలోని సివిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ భవన్లో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాజకీయ విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వేమన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 30 మంది విద్యార్థులు మరణించారని ఆరోపించారు. గత 12 ఏళ్లుగా దేశాన్ని నిరంకుశంగా పాలిస్తున్న మోడీ ప్రభుత్వానికి త్వరలోనే చరమగీతం పాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మూర్తి, మామిళ్ల రమేష్ రాజా, మారపల్లి మల్లేష్, జమ్మి అశోక్, జార్జి రెడ్డి, సురేష్, బందు సుజాత, బుర్ర స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'ప్రాస్తావిక పద్యమాలిక' పుస్తకావిష్కరణ

▫ రచయిత దేవరకొండ భగవాన్‌కు సాహితీవేత్తల అభినందనలు



**వరంగల్ (జనంసాక్షి) :** కాకతీయ పద్య కవిత వేదిక, వరంగల్ ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు, విగ్రహ ప్రతిష్ఠాపకులు, కవి దేవరకొండ భగవాన్ రచించిన 'ప్రాస్తావిక పద్యమాలిక' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి నన్నపురాజు రమేశ్వర్ రాజు సభాధ్యక్షత వహించగా, కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రాచార్యులు బన్న ఐలయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సామాజిక అంశాలతో పాటు జాతీయ అంతర్జాతీయ విషయాలను కూడా పద్యాలలో చక్కగా వివరించారని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా కాకతీయ పద్య కవిత వేదిక అధ్యక్షులు, పద్యవిశారదులు కంది శంకరయ్య, కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, కవి నేను పీజీలో విద్యార్థులమని మా భావాజారాలు వేరైనా భావన ఒక్కటే అని ఇద్దరు మైత్రి బంధానికి విలువిచ్చే వారమని పద్య ప్రక్రియ ప్రాచీనమైన ఆధునిక భావనతో పద్య రచన సాగిందని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, సెనేట్ సభ్యులు చిర్ర రాజు పాల్గొని రచయితను అభినందించారు. ఆత్మీయ అతిథిగా డి.ఏ.వి. పాఠశాల, కేటిపిపి చెల్పూర్ ప్రిన్సిపాల్ కె. శివ ప్రసాద్ హాజరయ్యారు. పుస్తక సమీక్షకులుగా అవధాన ప్రియ, శతావధాని చేపూరి శ్రీరాం పాల్గొని 'ప్రాస్తావిక పద్యమాలిక'లోని సాహిత్య విశిష్టతలను, పద్య వైభవాన్ని, రచయిత కవితా ప్రతిభను విశ్లేషించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, తెలుగు పద్య సాహిత్యానికి విశిష్టమైన సేవలందిస్తూ, సంప్రదాయ పద్య ప్రక్రియను సజీవంగా కొనసాగిస్తున్న దేవరకొండ భగవాన్ రచన ప్రశంసనీయమని పేర్కొన్నారు. 'ప్రాస్తావిక పద్యమాలిక' తెలుగు సాహిత్యాభిమానులను, పద్యప్రియులను ఆకట్టుకునేలా ఉందని కొనియాడారు. రచయిత భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ సాహిత్య రచనలు అందించి తెలుగు భాషా సాహిత్యానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పుస్తక ఆవిష్కరణ సందర్భంగా రచయిత దేవరకొండ భగవాన్ను సభాధ్యక్షులు, అతిథులు, సాహితీవేత్తలు, పద్యాభిమానులు ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం సాహిత్యాభిమానుల సమక్షంలో వైభవంగా, ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

## నృసింహస్వామి దర్శించుకున్న జిల్లా జడ్జిలు



**మంగపేట జూలై 26 (జనంసాక్షి) :** మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మి నృసింహస్వామిని ఆదివారం ఖమ్మం జిల్లా కోర్టు జడ్జి నాగరాజు, కొత్తగూడెం జూనియర్ సివిల్ జడ్జి పూజిత లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు గర్భాలయంలో స్వామివారిని దర్శించుకుని, తమ పేరున ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ముక్కామల రాజశేఖర్ శర్మ, కారంపూడి పవనాకుమారాచార్యులు, ఏడునూతుల ఈశ్వరాచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 27 నుండి 29 వరకు విత్తన మేళాలు

▫ 12 రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

▫ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుండి 29 వ తేదీ వరకు జిల్లాలోని 12 రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వలన వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడమే ఈ విత్తన మేళా ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. తక్కువ నీరు ఎక్కువ లాభం అనే సూత్రంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలని సూచించారు. రైతులు సాంప్రదాయ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే వర్షాభావ పరిస్థితుల్లోనూ నష్టపోకుండా ఆర్థికంగా లాభపడవచ్చని తెలిపారు. మేళాలో కంది, పెసర, మినుము, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయదలచిన రైతులు తమ సమీప రైతు వేదికలను సందర్శించి అక్కడ అందుబాటులో ఉండే వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సరైన విత్తనాలను పొందాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులందరూ తేదీలు గుర్తుంచుకుని సమీప రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

### జిల్లాలో విత్తన మేళాలు జరిగే రైతు వేదికలు..

జిల్లాలోని 12 రైతు వేదికల్లో ఈ మేళాలు నిర్వహించనున్నారు. భూపాలపల్లి మండలం పెద్దాపూర్ రైతు వేదిక, ఘన్‌పూర్ మండలం ఘన్‌పూర్ రైతు వేదిక, రేగొండ మండలం రేగొండ రైతు వేదిక, కొత్తపల్లి గోరి మండలం సుల్తాన్‌పూర్ రైతు వేదిక, చిట్యాల మండలం చిట్యాల రైతు వేదిక, మొగుళ్ళపల్లి మండలం మొగుళ్ళపల్లి రైతు వేదిక, టేకుమట్ల మండలం టేకుమట్ల రైతు వేదిక, మల్హర్‌రావు మండలం తాడిచర్ల రైతు వేదిక, కాటారం మండలం కాటారం రైతు వేదిక, మహదేవ్‌పూర్ మండలం బొమ్మాపూర్ రైతు వేదిక, మహాముత్తారం మండలం బోర్లగూడెం రైతు వేదిక, పలిమెల మండలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విత్తన మేళాలు జరుగుతాయి.

# పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు వేగవంతమైన సేవలు

- జిల్లా ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట ప్రతినిధి, జూలై 26 (జనంసాక్షి) :** పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ, పట్టణంలోని ప్రముఖ డివైన్ టచ్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పోలీసులకు ఉచిత లివర్, రక్త సంబంధ వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పోలీసు సిబ్బందికి ఖరీదైన లివర్ ఫైబ్రోస్కాన్ పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నరసింహ, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డివైన్ టచ్ హాస్పటల్ డాక్టర్ విజయ మోహన్, సంధ్య మోహన్, డీఎస్పీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం ప్రజా రక్షణలో అనుక్షణం పని చేస్తూ బిజీగా ఉంటూ పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారని అన్నారు. పోలీసు సిబ్బంది మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత వేగంగా, సమర్థవంతంగా పోలీసు సేవలు అందించగలరని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం కోసం అనుక్షణం కృషి చేస్తానని, అందులో భాగంగానే



ఖరీదైన లివర్ ఫైబ్రోస్కాన్ పరీక్షలను ఉచితంగా చేయిస్తున్నట్లు తెలిపారు. మానవ శరీరంలో లివర్ అత్యంత ముఖ్యమైన అవయవమని, మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం మన అందరి బాధ్యత అని అన్నారు. సిబ్బంది సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించి ప్రజలకు పోలీసు సేవలు అందించాలని కోరారు. ఒత్తిడి లేకుండా పని చేయాలని సూచించారు. ఉద్యోగంతో పాటుగా కుటుంబ సభ్యులతో గడపడం ముఖ్యం అన్నారు. ఎల్లప్పుడూ వ్యాయామం చేయడం, మంచి ఆహారం తీసుకోవడం వల్ల ఉత్సాహంగా ఉంటామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు. పోలీసుల కోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి ముందుకు వచ్చిన డివైన్ టచ్ హాస్పటల్ యాజమాన్యానికి, డాక్టర్ విజయ మోహన్, సంధ్య మోహన్ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డాక్టర్ విజయ మోహన్ పోలీసు సిబ్బందికి ఆరోగ్యకరమైన జీవన విధానం, పాటించాల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరసింహ చారి, డాక్టర్ విజయ మోహన్, సంధ్య మోహన్, సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, సాయిరాం, కె.అశోక్, ఎం.అశోక్, రాజశేఖర్, అన్వర్, ఎస్ఐలు సందీప్, గోపి, అజయ్, పోలీసు సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# అంగరంగ వైభవంగా మైసమ్మ బోనాలు



**ధారూర్, జూలై 26 (జనంసాక్షి) :** ధారూర్ మండలం నాగసముందర్ గ్రామంలో ఆదివారం మైసమ్మ బోనాల పండుగను గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. రోజంతా గ్రామంలో భక్తుల రద్దీ నెలకొనగా, సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, మొక్కుల చెల్లింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామానికి సుఖశాంతులు, సమృద్ధి కలగాలని ప్రార్థించారు. బోనాల వేడుకలతో నాగసముందర్ గ్రామం సందడిగా మారింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోలి వెంకటేశ్వర్, గ్రామ ఉపసర్పంచ్ మాదారి సంగీత, యదప్ప. వడ్డే ఎల్లప్ప. గొల్ల కనకప్ప. దర్జీ రాజు, వార్డు మెంబర్లు శ్రీశైలం, శేఖర్. గ్రామస్థులు దోమ రమేష్, కనేంగారి శ్రీనివాస్, ఉరాడి శేఖర్. ఆలయ కమిటి సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కల్తీ అల్లం - వెల్లుల్లి పేస్ట్ తయారీ ముఠా గుట్టు రట్టు

- ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు మెరుపు మెరుపు దాడి
- భారీ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం
- అక్రమ తయారీ చేస్తున్న యూనిట్‌పై కేసు నమోదు

**రామన్నపేట, జూలై 26 (జనంసాక్షి) :** రామన్నపేట పోలీసుల అప్రమత్తతతో భారీ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారీ, అక్రమ రవాణా దందా గుట్టు రట్టయింది. సాధారణ వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా, అందులో ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో అల్లం పేస్ట్ డబ్బాలను తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని రామన్నపేట సిఐ ఎం రవి, ఎస్సై జి సతీష్ విచారించగా, కీసర ప్రాంతంలోని ఒక తయారీ యూనిట్‌లో తయారు చేసినట్లు తెలిపాడు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు, చౌటుప్పల్ డీఎస్పీ శ్రీ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో రామన్నపేట సీఐ ఎం. రవి , ఎస్సై జి. సతీష్ నేతృత్వంలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి కీసరలోనీ తయారీ కేంద్రంపై సంయుక్తంగా దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భారీ మొత్తంలో కల్తీ అల్లం వెల్లుల్లి



పేస్ట్, కల్తీ తయారీకి సంబంధించిన ముడి పదార్థాలు, యంత్రాలు, తయారైన ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణాపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారీ ముఠాను పట్టుకున్న పోలీస్ అధికారులను, సిబ్బందిని, ఫుడ్ సేఫ్టీ అధికారులను స్థానికులు ప్రశంసించారు.

# ప్రమాదాల నిలయంగా మర్రిగూడ మోడల్ స్కూల్ హాస్టల్

**మర్రిగూడ, జూలై 26 (జనం సాక్షి) :** సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా మోడల్ స్కూల్ రూపురేఖలు మారుస్తాం... సొంత నిధులతో పునర్నిర్మాణం చేపడతాం" అంటూ ఇచ్చిన హామీలు నేటికీ ఆచరణలో కనిపించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో మర్రిగూడ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ నేడు భద్రత లేని ప్రాంగణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా మైదానం కోసం భూమిని చదును చేసే పనుల్లో భాగంగా హాస్టల్‌ను రక్షించే ప్రహరీ గోడ మట్టిలో కూరుకుపోయింది. దీంతో హాస్టల్ చుట్టూ రక్షణ లేకుండా పోయింది. రాత్రి వేళల్లో చీకటి అలుముకోవడంతో కుక్కలు, కోతులు స్వేచ్ఛగా సంచరిస్తుండగా, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థినులు భయంతో రోజులు గడుపుతున్నారు. బాలికల హాస్టల్‌కు కనీస భద్రత కల్పించాల్సిన బాధ్యతను అధికారులు, ప్రజాప్రతినిధులు విస్మరించారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం, తగిన వెలుతురు లేకపోవడం, భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్ల హాస్టల్ ప్రమాదాల నిలయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "పునర్నిర్మిస్తాం... ఆధునిక సౌకర్యాలు కల్పిస్తాం" అని చెప్పిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పనులు



ఎందుకు మధ్యలోనే నిలిపివేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బాలికల భద్రత కంటే అభివృద్ధి హామీలే ముఖ్యమా అని నిలదీస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, బాలికల రక్షణకు సంబంధించిన అంశంలో ఇకనైనా ఎమ్మెల్యే, జిల్లా అధికారులు తక్షణమే స్పందించి ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేసి, హాస్టల్‌కు పూర్తి భద్రత కల్పించాలని తల్లిదండ్రులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మర్రిగూడ మోడల్ స్కూల్ హాస్టల్ అభివృద్ధికి బదులుగా నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# కోహెన్స్ లైఫ్ సెన్సెస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట, జూలై 26 (జనంసాక్షి) :** కోహెన్స్ లైఫ్ సెన్సెస్, శ్రీహాన్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణతో కలిసి జిల్లా ఎస్పీ కె.నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించటం అభినందనీయమని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే జీవితం ఆనందంగా ఉండదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని తెలిపారు. మంచి అలవాట్లు అలవరుచుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్ రెడ్డి, భరోసా సెంటర్ ఎస్ఐ మౌనిక, షీ టీం ఎస్ఐ నీలిమ, ఏఎస్ఐ సైదాబీ, మున్సిపల్ కౌన్సిలర్ విజయ నాయక్, శ్రీహన్ హాస్పిటల్ డాక్టర్ గిరిధర్ రెడ్డి, డాక్టర్ విజిత రెడ్డి, డాక్టర్ వెంకటేష్, కోహెన్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిట్స్ పిలానీలో ఘనంగా 2026 స్నాతకోత్సవం

- 1,500 మందికి పైగా విద్యార్థులకు పట్టాల ప్రదానం

**జవహర్‌నగర్, జూలై 26 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో 2026 స్నాతకోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిగ్‌బాస్కెట్ సహ వ్యవస్థాపకుడు శ్రీహరి మీనన్ ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులకు పట్టాలు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలను ప్రదానం చేశారు. బిట్స్ పిలానీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. రామ్ గోపాల్ రావు అధ్యక్షతన, డైరెక్టర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ ధర్మరాజు శ్రీరామ్ సమక్షంలో జరిగిన ఈ వేడుకలో మొత్తం 1,500 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు అందజేశారు. వీరిలో 1,200 మందికి పైగా ఫస్ట్ డిగ్రీలు, సుమారు 200 మందికి హయ్యర్ డిగ్రీలు, 100 మందికి పైగా విద్యార్థులకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. రామ్ గోపాల్ రావు మాట్లాడుతూ, బిట్స్ పిలానీలో అందించే విద్య కేవలం విద్యా ప్రావీణ్యానికి మాత్రమే పరిమితం కాదని, నిజాయితీ, ఆవిష్కరణాత్మక ఆలోచన, సంకల్పబలం, సమాజంలో సార్థకమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవరచుకుని, సవాళ్లను ఆత్మవిశ్వాసంతో



ఎదుర్కొంటూ వినయంతో అత్యున్నత లక్ష్యాలను సాధించాలని పట్టభద్రులకు సూచించారు. విద్యా ప్రావీణ్యం, పరిశోధనలు, ఆవిష్కరణలు, సమాజాభివృద్ధికి చేసిన విశేష సేవలతో బిట్స్ పిలానీ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, 2026 స్నాతకోత్సవం ఆ సంస్థ చరిత్రలో మరో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు, వారి కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు, విశిష్ట అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టభద్రులను అభినందించారు.

# ఘనంగా సీత్లా భవాని పండుగ

**కొడంగల్, జూలై 26 (జనం సాక్షి) :** కొడంగల్ మండలం టేకుల కోడ్ అనుబంధ తండా మోత్కుల బండ తండాలో ఆదివారం సీత్లా భవాని పండుగను తండావాసులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని గిరిజన మహిళలు, యువతులు సీత్లా భవానికి దూప, దీప, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తర్య నాయక్, సామ్య నాయక్, తండా పెద్దలు. యువకులు



మహిళలు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ముర్షద్ దర్గా ఉర్సు ఉత్సవాలు




తాండూరు, జూలై 26 (జనంసాక్షి) : భక్తి శ్రద్ధలతో ముర్షద్ దర్గా ఉర్సు ఉత్సవాలు జరుపుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూర్ పట్టణంలోని ప్రసిద్ధ ముర్షద్ దర్గాలో వార్షిక ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు సందర్భంగా దర్గాకు చేరుకున్న ఎమ్మెల్యే బీఎంఆర్ కు ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులు మరియు వివిధ ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. దర్గా వద్ద పూల చాదర్ సమర్పించిన అనంతరం దేశంలో శాంతి, సుభిక్షత, సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక దుఆ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ముర్షద్ దర్గా ఉర్సు అనేది కేవలం ఒక మతపరమైన ఉత్సవం మాత్రమే కాదు. ఇది మన తాండూర్ లోని అన్ని మతాల ప్రజలు కలిసి మెలిసి జరుపుకునే సౌభ్రాతృత్వానికి ప్రతీక. గంగా జమునా తహజీబ్ కు నిదర్శనం" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూస్తుంది. అన్ని పండుగలను అధికారికంగా జరుపుతుంది. దర్గా అభివృద్ధికి, ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యాల కోసం ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు తెచ్చేందుకు కృషి చేస్తాన ని హామీ ఇచ్చారు. ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే బీఎంఆర్ సేవలను కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని వెళ్తున్న తీరు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, దర్గా కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉర్సు సందర్భంగా అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.

# దాతపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100% పూర్తి



**నవాబుపేట్, జూలై 26 (జనం సాక్షి) :** నవాబుపేట మండల కేంద్రంలోని దాత పూర్ గ్రామంలో ఓటర్ జాబితా ప్రక్రియ ఎస్ ఐ ఆర్ ను 100% పూర్తిచేసి ఆన్లైన్ ద్వారా బిఎల్ఓ లు గ్రామ పంచాయతీకి అప్పచెప్పడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా వట్టి మీనే పల్లి. మాదిరెడ్డిపల్లి గ్రామాలలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ 95%పూర్తి అయ్యిందని ఐదు శాతం ప్రక్రియలు 26 వరకు పూర్తి చేసి ఇస్తామని గ్రామ కార్యదర్శిలు తెలపడం జరిగిది. ఈ కార్యక్రమంలో. నవాబుపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావు గారి వెంకట్ రెడ్డి, సర్పంచుల అధ్యక్షులు మాలీష్ బలవంత్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్, మొయినాబాద్ మాజీ జెడ్పిటిసి కాలే శ్రీ కాంత్, మాజీ మండల అధ్యక్షులు కందాడ నాగిరెడ్డి, ప్రభాకర్, భోజిరెడ్డి, జిపిఓ మౌనిక, సరోజ, గ్రామ కార్యదర్శులు. సువర్ణ, గీత, అశోక్ సర్పంచులు, జి శేఖర్, ఎర్రోళ్ల కిష్టయ్య, ఎస్ మానమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖదీర్, అంగన్వాడి బి ఎల్ ఓ లు. భాగ్యలక్ష్మి, పద్మమ్మ, స్వరూప, సునీత, ఉప్ప సర్పంచులు, ఎన్ ప్రేమలత భోజిరెడ్డి, సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, నాయకులు గంజాయి రాములు, మాజీ సర్పంచ్ జంగయ్య, డీలర్, రామచంద్రారెడ్డి, మల్లేశం, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# దైవభక్తితో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలి

- డిఎస్పీ నర్సింగ్ యాదయ్య
- గురుకుల బాలికల పాఠశాలలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

**తాండూరు, జూలై 26 (జనంసాక్షి) :** దైవభక్తితో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలని డిఎస్పీ నర్సింగ్ యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని ఘనంగా కార్గిల్ డే వేడుకలను నిర్వహించారు. 2012లో సోషల్ వర్కర్ కేవీఎం వెంకట్ ప్రారంభించిన ఈ కార్యక్రమం ఆనవాయితీగా గడచిన 14 సంవత్సరాలుగా నిరంతరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా పాఠశాలలో అమర జ్యోతిని వెలిగించారు. దేశ సరిహద్దుల రక్షణ కోసం వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ అమర జ్యోతి వెలిగించి, రెండు నిమిషాలు మౌనం పాటించి, సైనికులకు సెల్యూట్ చేస్తూ ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ సరిహద్దు ప్రాంతంలో మైనస్ 40 డిగ్రీల ఉష్ణోగ్రతలో సైతం ప్రాణాలను లెక్కచేయ్యకుండా దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర సైనికులను స్మరించుకుంటూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సైనికుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, దైవభక్తితో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకుంటూ లోకజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కల్వకుర్తి అక్షర వనం, వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ కార్యదర్శి మాధవ రెడ్డి: కార్గిల్ యుద్ధంలో యోగేంద్ర యాదవ్, సంజయ్ కుమార్ లాంటి సైనికులతో పాటు మొత్తం 527 మంది వీరమరణం పొందారని గుర్తుచేశారు. వారి త్యాగాలను స్మరిస్తూ ప్రతి ఒక్కరూ తాము చేసే పనిలో నిబద్ధత, సత్యంతో మెలగాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలపాలంటే భగత్ సింగ్ లాంటి వారి త్యాగగుణం విద్యార్థులకు అవసరమన్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, అన్నం మెతుకును కూడా వృథా చేయకూడదనే మంచి అలవాటును నేటి నుండే అలవర్చుకోవాలని సూచించారు. జీవితానికి ప్రణాళిక వేసుకుని సాంఘిక సైనికులుగా ఎదగాలని ఆకాంక్షించారు. 28 సంవత్సరాల పాటు దేశ సేవ చేసి విశ్రాంతి తీసుకున్న మాజీ



సైనిక ఉద్యోగి అమీనుల్లా ఖాన్‌ను ఈ వేదికపై ఘనంగా సత్కరించారు. ఆల్ ఇండియా మార్వాడి యువ మంచ్ ప్రతినిధులు విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే బాలల మాసపత్రిక మొలక' మొల్ల కళావేదిక' తరపున విద్యార్థులకు ప్రశంసా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్య అతిథుల చేత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ కేవీఎం వెంకట్, ప్రిన్సిపల్ ప్రవీణారెడ్డి, మన్మోహన్ శారద, ఏజీవో శ్రీనివాస్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## భారత్‌పై తక్కువ సుంకం అందువల్లే

### నిరంతర సంప్రదింపులతో సాధ్యమైంది: వాణిజ్య శాఖ

దిల్లీ: కార్మికులతో వెట్టి చాకిరీ చేయించి ఉత్పత్తులను తయారు చేస్తున్నారనే ఆరోపణల మధ్య 60 దేశాలపై అమెరికా చేపట్టిన చర్యల్లో.. తక్కువ స్థాయి సుంకం శ్రేణి అయిన 10 శాతాన్నే భారత్‌పై విధించిందని శనివారం భారత ప్రభుత్వం వెల్లడించింది. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేసేందుకు ఆ దేశంతో కలిసి పనిచేసేందుకు కట్టుబడి ఉన్నామని కూడా పునరుద్ఘాటించింది. వెట్టిచాకిరీ ద్వారా తయారైన వస్తువుల దిగుమతిపై నిషేధాల అమలుకు సంబంధించి భారత్‌తో పాటు 16 దేశాలపై 10 శాతం సుంకం విధించగా.. చైనాతో పాటు మరో 43 దేశాలకు 12.5 శాతం సుంకాన్ని అమెరికా వర్తింపజేసింది. అమెరికా నిర్ణయంపై వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందిస్తూ.. విచారణ సమయంలో వివరణాత్మక లిఖిత పూర్వక సమర్పణలు, ప్రత్యక్ష చర్చలు, బహిరంగ విచారణల్లో పాల్గొనడం ద్వారా యూఎస్‌టీఆర్ (యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రెప్రజెంటేటివ్)తో భారత్ నిరంతరం సంప్రదింపులు జరిపిందని పేర్కొంది. ఈ నిరంతర ప్రయత్నాల ఫలితంగా తుది చర్యల కింద భారత్‌ను తక్కువ స్థాయి అదనపు సుంకం శ్రేణిలో ఉంచారని పేర్కొంది. ప్రస్తుతం ఎటువంటి అదనపు సుంకాలు లేని భారత ఎగుమతుల్లో (2025-26లో 87.31 బిలియన్ డాలర్లు) గణనీయమైన వాటా కలిగిన జనరిక్ ఔషధాలు, స్మార్ట్‌ఫోన్లు, ఇతర నిర్దిష్ట ఉత్పత్తులు ఈ కొత్త 10% అదనపు సుంకం పరిధిలోకి రాకుండా అలాగే కొనసాగుతాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## సురక్షిత ఈవీ ఛార్జింగ్‌కు గృహాలు దూరం

### విద్యుత్ వ్యవస్థను ఆధునికీకరించాలి • కాజమ్, ఏఈఈఈ సంయుక్త నివేదిక

దిల్లీ: సురక్షిత ఈవీ ఛార్జింగ్ కోసం దేశంలోని సుమారు 45 శాతం ఇళ్లలో విద్యుత్ వ్యవస్థను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని కాజమ్, ఏఈఈఈ (అలియన్స్ ఫర్ యాన్ ఎనర్జీ ఎఫిషియెంట్ ఎకానమీ) సంయుక్త నివేదిక వెల్లడించింది. 'ది నెట్-జీరో ట్రాన్సిషన్ స్టార్ట్స్ ఎట్ హోమ్: ఎనేబ్లింగ్ ఈవీ-రెడీ రెసిడెన్సెస్ ఇన్ ఇండియా' పేరుతో రూపొందిన ఈ నివేదిక ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో స్వతంత్ర గృహాలు, అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, అనధికార నివాస ప్రాంతాలు, భాగస్వామ్య అద్దె గృహాలను కవర్ చేస్తూ, 80,000 కంటే ఎక్కువ నివాస ఈవీ ఛార్జర్ ఇన్‌స్టాలేషన్‌ల డేటా ఆధారంగా రూపొందించారు. సురక్షితమైన, నమ్మదగిన, ఉపయోగపడే ఈవీ ఛార్జింగ్ కోసం ప్రతి ఇల్లు ఒక సాధారణ కనీస ప్రమాణాన్ని పాటించాలని నివేదిక పేర్కొంది. గత దశాబ్ద కాలంలో మన దేశంలో విద్యుత్ వాహన పరివర్తన గణనీయమైన ఊపందుకున్నప్పటికీ, నివాస ప్రాంతాల్లో ఛార్జింగ్ సదుపాయం ఇప్పటికీ తీవ్ర అసమానతలతోనే ఉందని తెలిపింది. 2024లో జాతీయ విద్యుత్ గిరాకీలో 0.2 శాతంగా ఉన్న విద్యుత్ వాహనాల విద్యుత్ వినియోగం, 2035 నాటికి



సుమారు 6 శాతానికి పెరుగుతుందని అంచనా వేసినప్పటికీ, ప్రస్తుత ఈవీ కొనుగోలుదార్లలో కేవలం 55 శాతం మందికి మాత్రమే ఇంటి వద్ద ఛార్జింగ్ సదుపాయం అందుబాటులో ఉందని నివేదిక వివరించింది. విద్యుత్ మౌలిక సదుపాయాలు, గృహ పరిస్థితులు, భాగస్వాముల ప్రక్రియలు, స్థోమతకు సంబంధించిన అడ్డంకులు కొనసాగుతున్నందున.. వినియోగదార్లు నిరంతర ఈవీ లోడ్‌ల కోసం రూపొందించని సాధారణ సాకెట్లు, తాత్కాలిక ఎక్స్‌టెన్షన్లు, షేర్డ్ కనెక్షన్‌ల్లోకి ప్లగ్ చేయడం వంటి అనధికార, అసురక్షిత ఏర్పాట్లను ఆశ్రయిస్తున్నారని నివేదిక పేర్కొంది. ఇలాంటి పద్ధతులు అగ్ని ప్రమాదాలు, విద్యుత్ భద్రతాపరమైన ముప్పులను సృష్టిస్తాయని, ఛార్జింగ్ విశ్వసనీయతను తగ్గిస్తాయని, అలాగే పరికరాలు దెబ్బతినడానికి, బ్యాటరీ వేగంగా క్షీణించడానికి కారణమవుతాయని నివేదిక తెలిపింది. ఇలాంటి పరిస్థితులను నివారించాలని సూచించింది. ప్రత్యేక ఛార్జింగ్ సర్క్యూట్‌తో కూడిన తగినంత మంజూరైన విద్యుత్ లోడ్‌ను ఇది సిఫారసు చేసింది. వైరింగ్, ఎర్తింగ్‌లు నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, అలాగే అగ్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఛార్జర్‌ను సురక్షితమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరింది. నిరంతర ఛార్జింగ్ లోడ్‌ల కోసం తగిన రేటింగ్ ఉన్న ఎంసీబీలతో ప్రత్యేక సర్క్యూట్ రక్షణను, ఎర్త్-లీకేజ్ రక్షణను, ప్రత్యేకంగా ధ్రువీకరించిన ఈవీ సబ్-మీటర్‌ను ఉపయోగించాలని నివేదిక సూచించింది.

## ప్రీమియం పెట్రోల్‌లో ఇథనాల్ ఉండదు

### బ్లెండింగ్ ప్రతిపాదన లేదు: సహాయ మంత్రి

దిల్లీ: ప్రభుత్వ రంగ చమురు రిటెయిలర్ సంస్థలు విక్రయించే పెట్రోలు ప్రీమియం గ్రేడ్లను ఇథనాల్ బ్లెండింగ్ లేకుండానే సరఫరా చేస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే పెట్రోలు 20 శాతానికి మించి ఇథనాల్‌ను కలపడంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదనీ తెలిపింది. ఇ0 లేదా ఇ10 పెట్రోలు సరఫరా పునరుద్ధరణ ప్రతిపాదనా లేదని వివరించింది. ఇండియన్ ఆయిల్ కార్ప్(ఐఓసీఎల్)నకు చెందిన ఎక్స్‌పీ100, హిందుస్థాన్ పెట్రోలియం(హెచ్‌పీసీఎల్)కు చెందిన పవర్100, భారత్ పెట్రోలియం(బీపీసీఎల్)కు చెందిన స్పీడ్100 ప్రీమియం పెట్రోలు గ్రేడ్లలో ఇథనాల్‌ను కలపడం లేదని లోక్‌సభకిచ్చిన సమాధానాల్లో భాగంగా పెట్రోలియం, సహజ వాయువు మంత్రి సురేశ్ గోపి తెలిపారు. ఇవి మొత్తం పెట్రోలు విక్రయాల్లో 0.5 శాతమే ఉన్నాయన్నారు. 20% ఇథనాల్ కలిపిన పెట్రోలు లీటరు ధర రూ.102.12గా ఉండగా, ప్రీమియం పెట్రోలు ధర రూ.160గా ఉంది.




## చిన్న పరిశ్రమలకు 'సైబర్' ముప్పు

న్యూఢిల్లీ:రాన్సమ్‌వేర్ రూపంలో డిజిటల్ దాడులు దేశం డిజిటల్ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎస్ఎమ్ఈలు)పై సైబర్ కేటుగాళ్ల కన్ను పడింది. ముఖ్యంగా రాన్సమ్‌వేర్ రూపంలో వస్తున్న డిజిటల్ దాడుల ముప్పు ఈ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో రాన్సమ్‌వేర్ దాడుల తీవ్రత పెరిగింది. చిన్న, మధ్య తరహా వ్యాపార రంగంలో సైబర్ దాడులు ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 4.07 శాతానికి పైగా పెరిగాయి. దేశీయ చిన్న తరహా పరిశ్రమలపై సైబర్ నేరగాళ్లు నిరంతరాయంగా, పెద్ద సంఖ్యలో దాడులు చేస్తున్నారని అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ సంస్థ కాస్పర్‌స్కై విడుదల చేసిన తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. లెక్కల పరంగా చూసినప్పుడు ఈ పెరుగుదల స్వల్పంగా కనిపిస్తున్నప్పటికీ, దాడుల శాతం స్థిరంగా కొనసాగుతుండటం ఈ ముప్పు తీవ్రతను సూచిస్తోంది. దాడుల గుర్తింపు అనేది కేవలం నాణేనికి ఒక వైపు మాత్రమే. రాన్సమ్‌వేర్ ముఠాలు వివిధ దశల్లో దాడులు చేస్తాయి. ఇందులో చివరి దశ.. ఫైళ్లను లాక్ చేసే ఎన్‌క్రిప్షన్ ట్రోజన్‌ను ప్రయోగించినప్పుడు మాత్రమే అది సిస్టమ్‌లో దాడుల గుర్తింపుగా నమోదవుతుంది. దాడి ప్రారంభ దశలైన.. వ్యవస్థలోకి ప్రవేశించడం, నిఘా వేయడం, ఆరా తీయడం, అంతర్గతంగా విస్తరించడం వంటి దశల్లోనే అడ్డుకున్న సైబర్ దాడులు ఈ గణాంకాల్లో నమోదు కావు. కాబట్టి, వాస్తవంగా జరిగే సైబర్ నేరాల తీవ్రత సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని కాస్పర్‌స్కై నివేదిక పేర్కొంది. కొత్తగా వచ్చిన 'ది జెంటిల్‌మెన్' అనే రాన్సమ్‌వేర్ సైబర్ దాడుల్లో 9.25 శాతం వాటాతో వేగంగా విస్తరిస్తోంది. తయారీ రంగం, ఐటీ సేవలు, ఆరోగ్య రక్షణ, ఆర్థిక సేవలు, నిర్మాణం, లాజిస్టిక్స్ వంటి రంగాలను లక్ష్యాలుగా చేసుకొని దాడులు చేస్తోంది. ఇది ఇప్పటికే మార్కెట్లో ఉన్న అకిరా, ఐఎన్‌సీ రాన్సమ్ గ్రూపులను వెనక్కి నెట్టి, మూడో స్థానంలోకి వచ్చింది. ప్రస్తుతం అకిరా వాటా 7.25 శాతంగా ఉంది. ఐఎన్‌సీ రాన్సమ్ వాటా 6.13 శాతంగా ఉంది. కాగా క్లోప్ రాన్సమ్‌వేర్ 14.42 శాతంతో మొదటి స్థానంలో ఉంది. ఇప్పటివరకూ అగ్రస్థానంలో ఉన్న క్విలిన్ 12.34 శాతంతో రెండో స్థానంలో ఉంది. గతేడాది సైబర్ దాడుల బారిన పడిన దేశాల్లో ఆసియా పసిఫిక్ ప్రాంతం ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచింది.
ప్రస్తుతం దేశంలో 6.33 కోట్లకు పైగా చిన్న తరహా పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. ఇవి తయారీ, ఐటీ, ఇతర కీలక రంగాల్లో సుమారు 13 కోట్ల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. దేశ జీడీపీలో వీటి వాటా 31.1 శాతంగా ఉంది. చిన్న పరిశ్రమలు పెద్ద కార్పొరేట్ సంస్థల సరఫరా నెట్‌వర్క్‌లతో అనుసంధానం కావడం వల్ల హ్యాకర్లు వీటిని ప్రవేశ మార్గంగా వాడుకుంటున్నారు. చిన్న పరిశ్రమల్లో తగిన సైబర్ భద్రతా బృందాలు లేకపోవడం, సాఫ్ట్‌వేర్ ప్యాచ్ అప్‌డేట్ చేసుకోకపోవడం వల్ల సులభంగా దాడుల బారిన పడుతున్నాయి. ప్రస్తుతం హ్యాకర్లు కేవలం ఫైళ్లను లాక్ చేయడమే కాకుండా, డేటాను దొంగిలించి ఇంటర్నెట్‌లో లీక్ చేస్తామని బెదిరిస్తూ, దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ రాన్సమ్‌వేర్ ముప్పును తప్పించుకునేందుకు సంస్థలు ఎప్పుడూ అప్రమత్తంగానే



ఉండాల్సిన అవసరం ఉందని కాస్పర్‌స్కై నిపుణులు సూచించారు. అన్ని పరికరాల్లోని సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలి. ఇంటర్నెట్ అనుసంధానం లేని ఆఫ్‌లైన్ బ్యాకప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ముప్పులను ముందే గుర్తించేలా రక్షణ వ్యవస్థలు ఉండాలి. ఐటీ సిబ్బందికి సైబర్ సెక్యూరిటీపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.




## అమెరికాకు ఖైబర్‌షెకాన్ దడ!

వాషింగ్టన్: అమెరికాను ఇన్నాళ్లు షాహెద్ డ్రోన్లు గుక్క తిప్పుకోనీయకుండా చేస్తే.. ఇప్పుడు దానికి తోడుగా ఓ చౌకబారు క్షిపణి వచ్చి చేరింది. దాని పేరు ఖైబర్ షెకాన్ దీని రేంజి 1,400 కిలోమీటర్లు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై జరిగిన భీకర దాడుల్లో ఈ క్షిపణిదే కీలక పాత్ర. పాత ఇరాన్ క్షిపణులతో పోలిస్తే ఇది విభిన్నమైనది. ఘన ఇంధనంతో పనిచేస్తుంది. శత్రువుపై వినియోగించే ముందు.. దీనిలో ఇంధనం నింపాల్సిన అవసరం లేదు. ఫలితంగా వీటిని ట్రక్కులపై లోడ్ చేసి.. వేగంగా తరలించి శత్రువుపై దాడి చేయవచ్చు. దీంతో ఇరాన్ క్షిపణి లాంఛర్ల కోసం యుద్ధ విమానాలు వెతికే వేళ త్వరగా తప్పించుకొనే అవకాశం ఉంది. యుద్ధం వేళ కొన్ని ఖైబర్ క్షిపణులను కూల్చినా.. ఇరాన్ ప్రత్యేకమైన ఫ్లైట్‌పాత్‌లు, కదలికలు, స్పీడ్‌తో వీటిని అమెరికాకు దొరక్కుండా చేస్తోంది. దీనికి తోడు కొన్ని వేరియంట్లకు ముక్కు భాగంలో ఇరాన్ చిన్న ఇంజిన్లను అమర్చుతోంది. ఇది క్షిపణి దాడి చేయాల్సిన లక్ష్యం దగ్గరయ్యే కొద్దీ దిశను మార్చుకోవడానికి




ఉపయోగపడటంతో పాటు.. వేగాన్ని గంటకు 10,000 కిలోమీటర్లకు తీసుకెళుతోంది. ఈ క్షిపణులను అటాక్ డ్రోన్లు, మరికొన్ని మిసైల్స్‌తో కలిపి ఇరాన్ వాడుతోంది. యుద్ధం ప్రారంభం నాటికి ఇరాన్ వద్ద సుమారు 2,500 ఖైబర్ షెకాన్ క్షిపణులు, ఇతర మిసైల్స్ ఉన్నాయని అమెరికా అంచనావేసింది. వీటితోపాటు అండర్ గ్రౌండ్ ఆయుధ కేంద్రాల్లో మరిన్ని అసెంబ్లింగ్ చేస్తున్నట్లు భావిస్తున్నారు. కాకపోతే.. క్షిపణి ఇంజిన్ల ఉత్పత్తి కేంద్రాన్ని మాత్రం అమెరికా ధ్వంసం చేసింది. ఇక అమెరికా, ఇజ్రాయెల్ వినియోగించే క్షిపణులతో పోలిస్తే దీని ధర కూడా చాలా చౌక అని ఆయుధ నిపుణులు వెల్లడిస్తున్నారు.

## నింగిలోకి స్టార్‌షిప్

### కక్ష్యలోకి చేరిన అధునాతన స్టార్‌లింక్ ఉపగ్రహాలు

కేప్ కెనావెరాల్: అమెరికాకు చెందిన అంతరిక్ష సంస్థ 'స్పేస్‌ఎక్స్' రూపొందించిన భారీ రాకెట్ స్టార్‌షిప్ 13వసారి నింగిలోకి పయనమైంది. ఈ మిషన్‌లో అది ప్రపంచాన్ని సగం మేర చుట్టేసింది. 20 అధునాతన స్టార్‌లింక్ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. 124 మీటర్ల పొడవైన ఈ రాకెట్.. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం టెక్సాస్‌లో స్పేస్‌ఎక్స్‌కు చెందిన రోదసి ప్రయోగ కేంద్రం నుంచి బయల్దేరింది. రెండు నిమిషాల తర్వాత బూస్టర్ విడిపోయి గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో పడిపోయింది. ఆ తర్వాత స్టార్‌షిప్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ నింగిలో 200 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకొంది. వరుసగా స్టార్‌లింక్ ఉపగ్రహాలను కక్ష్యలో వదిలిపెట్టింది. దాదాపు గంటపాటు రాకెట్ పయనం సాగింది. ఆ తర్వాత నిర్దేశిత రీతిలో హిందూ మహాసముద్ర జలాల్లో పడింది. లాంచ్ ప్యాడ్ నుంచి అది 16వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. గత వారం స్టార్‌షిప్‌ను ప్రయోగించడానికి జరిగిన ప్రయత్నం విఫలమైంది.



## ఇకపై ఏ ఎన్నికల్లో పోటీచేయను

మారిపోయిందని.. తనకూ వయసు పైబడటం, అనారోగ్య కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తనకు 79ఏళ్లని.. తన పదవీకాలం ఇంకా ఏడాదిన్నర పాటు ఉందని పేర్కొన్నారు. అప్పటికి తన వయసు 81-82 ఏళ్లకు చేరుకుంటుందన్నారు. ఆరోగ్యం బాగాలేకపోవడం వల్ల మునుపటిలా అదే ఉత్సాహంతో పనిచేయడం ఇక సాధ్యం కాదని వెల్లడించారు. అయితే ప్రజా జీవితంలో చురుకుగా ఉంటూ ప్రజల తరఫున గళం మాత్రం వినిపిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. 2028 నాటికి తన రాజకీయ ప్రస్థానం 50ఏళ్లకు చేరుకుంటుందని సిద్ధరామయ్య తెలిపారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించానని.. దశాబ్దాల కాలంలో ఎన్నో విజయాలు, ఓటములు చవిచూశానని పేర్కొన్నారు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో తాను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించలేదన్నారు. గతంలో తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు నియోజకవర్గ ప్రజలే స్వచ్ఛందంగా డబ్బు సమకూర్చేవారని సిద్ధరామయ్య తెలిపారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని.. ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రజలకు డబ్బు పంచాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మద్దతుగా నిలిచిన కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.




## హెచ్1బీ ఇక మరింత కష్టం!

వాషింగ్టన్: హెచ్1బీ వీసాల జారీని మూడేళ్లపాటు నిలిపివేయాలని, ట్రంప్ ప్రభుత్వం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని కోరుతూ.. అమెరికా సెనెట్‌లో ఒక బిల్లును ప్రవేశపెట్టారు. 'హెచ్-1బి వీసా దుర్వినియోగ నిరోధక చట్టం'గా వ్యవహరిస్తున్న ఈ బిల్లును పాలక రిపబ్లికన్ పార్టీ సెనేటర్ టిమ్ షీహీ ప్రతిపాదించారు. 'ప్రత్యేకమైన ఉద్యోగాలు, స్థానికులతో భర్తీ చేయలేని ఉద్యోగాల నియామకాల కోసం మాత్రమే.. హెచ్1బీ కార్యక్రమాన్ని సృష్టించారు. అంతే తప్ప కష్టపడి పనిచేసే అర్హులైన అమెరికన్లను తొలగించి విదేశీ శ్రామిక శక్తిని నియోగించడానికి కాదు' అని షీహీ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. హెచ్1బీ వీసాలను లాటరీ పద్ధతిలో కాకుండా అధిక వేతనాలతో ఉత్తమ ప్రతిభావంతులకే ఇవ్వాలని షీహీ ప్రతిపాదించిన బిల్లు పేర్కొంటోంది. ఈ బిల్లును పార్లమెంటు ఉభయ సభలు ఆమోదిస్తేనే చట్టమవుతుంది. హెచ్1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజు విధించాలని ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని దిగువ కోర్టు కొట్టివేయగా.. ఆ ఉత్తర్వులను నిలిపివేయాలంటూ ట్రంప్ సర్కారు వేసిన పిటిషన్ కూడా తిరస్కరణకు గురైంది. ఫీజు పెంపునకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదు కాబట్టి.. అది చట్టవిరుద్ధమైన పన్ను అని జూన్ 8న జిల్లా జడ్జి లియో సోరోకిన్ తేల్చారు. దానిపైనే ఫెడరల్ ప్రభుత్వం పిటిషన్ వేసింది.

## రూ.25 వేల కోట్లు!

### ఆగస్టులో ఐపీఓల క్యూ: డజను కంపెనీలు.. ?

దిల్లీ: స్టాక్ మార్కెట్‌లో పరిస్థితులు కుదుటపడుతుండడంతో ప్రైమరీ మార్కెట్‌లో ఐపీఓల సందడి మళ్లీ మొదలైంది. దీంతో ఇన్నాళ్లు ఆచితూచి అడుగేసిన కంపెనీలు.. ఇప్పుడు పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. అలా వచ్చే నెలలో (ఆగస్టు) డజనుకు పైగా కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఇందులో ఇ-కామర్స్ సంస్థ జెప్టో, ట్రూహోమ్ ఫైనాన్స్, లాజిస్టిక్స్ సంస్థ షిప్‌రాకెట్ వంటి ప్రధాన కంపెనీలు ఉన్నాయి. మొత్తం రూ.25వేల కోట్లు సమీకరించనున్నాయి. అంతర్జాతీయ పరిణామాల కారణంగా స్టాక్ మార్కెట్ తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంది. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు 36 కంపెనీలు మాత్రమే ఐపీఓ ద్వారా నిధులు సమీకరించాయి. ఒక్క జులై నెలలో 9 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్, జునిపెర్ గ్రీన్ ఎనర్జీ జులై 28, 30 తేదీల్లో సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. మార్కెట్ పరిస్థితులు కాస్త చక్కబడడం, ఇన్వెస్టర్ల నుంచి ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉంటుండడంతో మరిన్ని కంపెనీలు ఐపీఓల కోసం సన్నద్ధం అవుతున్నాయి. ఆ కంపెనీలు ఇవీ..




ఆగస్టు నెలలో రాబోయే అతిపెద్ద ఐపీఓల్లో జెప్టో ఒకటి. ఇ-కామర్స్ సంస్థ జెప్టో ఐపీఓలో భాగంగా ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.8010 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 11.34 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ట్రూహోమ్ ఐపీఓ ద్వారా రూ.3వేల కోట్లు సమీకరించనుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.1500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో అంతేమొత్తం సమీకరించనుంది. ఎలివేట్ క్యాంపసెస్ రూ.2550 కోట్లు, షిప్‌రాకెట్ రూ.2342 కోట్లు, ఇన్నోవేటివ్ వ్యూ ఇండియా రూ.2వేల కోట్లు చొప్పున నిధులు సమీకరించనున్నాయి. మిల్క్‌మిస్ట్ డెయిరీ ఫుడ్ కూడా వచ్చే నెలలోనే రూ.1553 కోట్ల ఐపీఓకు రానుంది. ఇవి కాకుండా ధూత్ ట్రాన్స్‌మిషన్, ఏఆర్‌సీఐఎల్ (అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్), అర్థీ ఇండస్ట్రీస్, గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్, రేస్ ఆప్ బీలీఫ్, హైటెక్ ఇంజినీర్స్, శంకేశ్ జువెలర్స్, లెర్న్‌ఫ్లూయెన్స్ ఎడ్యుకేషన్స్ కూడా ఆగస్టులో తొలి పబ్లిక్ ఆఫర్‌కు రానున్నాయి.

## నాసా చిత్రాలు.. నగరాల వెలుగుల్లో మెరిసిన భారత్!

రాత్రివేళలో భారత్ ఎంత అద్భుతంగా దర్శనమిస్తుందో తెలిపే ఓ టైమ్‌లాప్స్ వీడియోను నాసాకు చెందిన అంతరిక్ష కేంద్రం విడుదల చేసింది. ప్రకృతి సృష్టించే అందాలను రికార్డు చేసింది. భారత్‌తో పాటు శ్రీలంక తీర ప్రాంతాలను బంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. వీడియోలో అరేబియా సముద్రం నుంచి దక్షిణ భారత్, శ్రీలంక మీదుగా బంగాళాఖాతం వైపు ఐఎస్ఎస్ ప్రయాణిస్తోంది. ఆ సమయంలో మన్నార్ సింధు శాఖ, బంగాళాఖాతం తీరప్రాంతంపై ఉరుములు, మెరుపులతో కూడిన మేఘాలు వెలుగులతో దర్శనమిచ్చాయి. నగరాల వెలుగులు, ఆకాశంలో తుపాను మెరుపులు భారత్, శ్రీలంక తీరప్రాంతాల్లో మాయా ప్రపంచాన్ని సృష్టించాయి. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. భూమికి 400 కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఉంటుంది.



# కార్గిల్ వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**ముషీరాబాద్, జులై 26 (జనం సాక్షి):** అత్యంత క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు, ఎత్తైన పర్వత శిఖరాలు, ప్రాణాలను సైతం లెక్కచేయని ధైర్యసాహసాలతో మన వీర జవాన్లు పోరాడి సాధించిన విజయం భారత సైనిక చరిత్రలో చిరస్మరణీయమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రాంనగర్లోని తన నివాసంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత మాత కోసం తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్లకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ సమగ్రత,సార్వభౌమాధికారాన్ని కాపాడటంలో భారత సైన్యం చూపిన పరాక్రమం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. 1999లో పాకిస్తాన్ చొరబాటుదారులు కార్గిల్ ప్రాంతంలోని భారత భూభాగంలో అక్రమంగా చొరబడి ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేసినప్పుడు, అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి దృఢ సంకల్పంతో భారత సైన్యం ముఖ్యంగా భారత వాయుసేన "ఆపరేషన్ విజయ్"ను విజయవంతంగా నిర్వహించి, శత్రువులను తరిమికొట్టి, తిరిగి భారత త్రివర్ణ పతాకాన్ని కార్గిల్ శిఖరాలపై రెపరెపలాడించిందని ఆయన గుర్తు చేశారు.

దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్న సైనికులకు, వారి కుటుంబాలకు దేశ ప్రజలందరూ అండగా నిలవాలని దత్తాత్రేయ పిలుపునిచ్చారు. వారి త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, ప్రతి భారతీయుడు వారికి రుణపడి ఉంటాడని అన్నారు. దేశ భద్రత కేవలం సైన్యానికే పరిమితం కాదని, సమాజం కూడా అప్రమత్తంగా, ఐక్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. కులం, మతం, భాష, ప్రాంతం అనే భేదాలకు అతీతంగా "భారతదేశం నా మాతృభూమి - దాని రక్షణ నా బాధ్యత" అనే భావన ప్రతి భారతీయుడిలో బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాశం సాయి కృష్ణ యాదవ్, ఆర్ శేషసాయి, వంశీ కృష్ణ, సి మోహన్, కౌడిన్య ప్రసాద్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# మన్ కీ బాత్ వీక్షించిన అర్బన్ ఎమ్మెల్యే

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 26: జనం సాక్షి :** ఇందూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 136వ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వీక్షించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించి, భారత సైనికుల ధైర్యసహసాలను ప్రధానమంత్రి కొనియాడారు. "ఆత్మనిర్భర్ భారత్" రక్షణ రంగం, గురించి మాట్లాడుతూ స్వదేశీ యుద్ధనౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి, డిఆర్డిఓ అభివృద్ధి చేస్తున్న రక్షణ సాంకేతికతలను ప్రశంసించారు. ముఖ్యంగా "క్యాచ్ ద రైన్"ఉద్యమం విజయవంతమైందని పేర్కొం టూ ప్రతి పౌరుడు వర్షపు నీటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే యువత విజయాల గురించి మాట్లాడుతూ.. జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ గెలిచిన తెలుగు తేజం పి.వి సింధును అభినందించారు అలాగే యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలను ప్రశంసించారు. మణిపూర్ కు చెందిన ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ రోనాల్డో లైషరామ్ అంతర్జాతీయ స్థాయిలో సాధించిన పరిశోధన విజయాన్ని ప్రస్తావించి అభినందించారు. స్థానిక కళలు సంస్కృతి పరిరక్షణ పై దృష్టి సారిస్తూ కాశ్మీర్ కు చెందిన సంప్రదాయ " వాగూవ్" చాపల కలను, త్రిపురకు చెందిన చెంగ్ ప్రేంగ్ వాద్యాన్ని పెంచిన వారిని ప్రశంసిచారు. అలాగే పర్యావరణం విడుదల నిర్వహణ మహిళల సాధికారతకు సంబంధించిన పలు స్థానిక కార్యక్రమాలను ఉదాహరణలుగా ప్రస్తావించి దేశవ్యాప్తంగా జరుగుతున్న స్ఫూర్తిదాయక ప్రయత్నాలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' రాజకీయ కార్యక్రమం కాదని, దేశంలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు, జాతీయ విలువలు, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి అనే అంశాలను ప్రజలకు చేరవేసే వేదిక అన్నారు. కార్గిల్ వీరుల త్యాగం నుంచి నీటి సంరక్షణ వరకు, స్వదేశీ రక్షణ సామర్థ్యం నుంచి యువత విజయాల వరకు ప్రతి అంశం దేశాన్ని మరింత బలోపేతం చేసే దిశలో ప్రజలను ప్రేరేపించే సందేశాన్ని ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చా అధ్యక్షులు వంశీ, మైనార్టీ మోర్చా జస్పాల్ సింగ్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, మఠం పవన్, జ్యోతి మురళి, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, మమత శివ, యువ మోర్చా రాష్ట్ర నాయకులు విజయ్, పవన్ ముందడ పాల్గొన్నారు.

# ముడిమ్యాలలో విద్యుత్ కోతలతో రైతుల ఆవేదన

- వరి నాట్లకు నీరందక నార్లు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన
- వెంటనే సమస్య పరిష్కరించాలని డీఈ, ఏఈలకు గ్రామస్థుల విజ్ఞప్తి



**చేవెళ్ల, జూలై 26 (జనంసాక్షి) :** మూడిమ్యాల్ గ్రామంలో తీవ్ర విద్యుత్ అంతరాయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు లేక ఇప్పటికే సాగు కష్టంగా మారిన పరిస్థితుల్లో, వ్యవసాయానికి అవసరమైన మూడు ఫేజ్ విద్యుత్ సక్రమంగా అందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసే కీలక సమయం కావడంతో పొలాలకు నీరందించేందుకు రైతులు మోటార్లపై ఆధారపడుతున్నారు. అయితే విద్యుత్ తరచూ రావడం, పోవడం వల్ల నార్లకు నీరు అందక అవి ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కరెంట్ వచ్చిన కొద్దిసేపటికే మళ్లీ నిలిచిపోవడంతో పొలాలకు పంపిన నీరు భూమిలోకి ఇంకిపోతూ రైతుల శ్రమ వృథా అవుతోందని తెలిపారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, దీనివల్ల అదనపు ఆర్థిక భారం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముడిమ్యాల గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ జంక్షన్ ఉన్నప్పటికీ గ్రామానికి నిరంతర విద్యుత్ సరఫరా అందడం లేదని వారు ఆరోపించారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే విద్యుత్ వస్తోందని, ఆ సమయంలో కూడా పలు మార్లు బ్రేక్‌డౌన్‌లు జరుగుతున్నాయని రైతులు తెలిపారు. ఇదే సమయంలో మూడిమ్యాల్ చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా సక్రమంగా కొనసాగుతుండటం తమకు మరింత బాధ కలిగిస్తోందన్నారు. ఈ సమస్యపై గ్రామసభలోనూ, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత డీఈ, ఏఈలు స్పందించి ముడిమ్యాల గ్రామంలో విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి రైతులకు నిరంతర త్రి ఫేజ్ విద్యుత్ సరఫరా అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రోడ్ల మరమ్మతులకు బీఆర్ఎస్ ధర్నా

- శంకర్‌పల్లి-మోమిన్‌పేట్ రహదారి అధ్వానంపై ఆందోళన
- గుంతలతో ప్రమాదాలు పెరుగుతున్నాయని బీఆర్ఎస్ ఆరోపణ
- రెండేళ్లైనా రహదారుల అభివృద్ధిలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- రోడ్లు బాగు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



శంకర్‌పల్లి, జూలై 26 (జనంసాక్షి): ప్రధాన రహదారులను తక్షణమే మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం శంకర్‌పల్లి-వికారాబాద్-మోమిన్‌పేట్ రహదారిపై లక్ష్మారెడ్డిగూడ గేటు వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనతో రెండు నుంచి మూడు గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, మాల చిన్న నరసింహులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ ప్రధాన రహదారుల పరిస్థితి అధ్వానంగా మారిందని ఆరోపించారు. శంకర్‌పల్లి నుంచి మైతాఫ్‌ఖాన్‌గూడెం వరకు రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా మారిందన్నారు.

శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట్, మర్పల్లి, బంటారం, పంచలింగాల, నవాబ్‌పేట్, వికారాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఈ రహదారినే వినియోగించాల్సి వస్తోందని తెలిపారు. గుంతల కారణంగా రాత్రివేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌ల రాకపోకలు కూడా ఇబ్బందికరంగా మారుతున్నాయని, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, వికారాబాద్ ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పరిధిలోకి వచ్చే ఈ రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం రాస్తారోకో విరమించడంతో ట్రాఫిక్ పునరుద్ధరించబడింది.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాణిక్‌రెడ్డి, మహాలింగాపురం సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, భుజంగరెడ్డి, గండు మాణిక్యరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, నారాయణ, మాజీ ఎంపీటీసీ యాదగిరి, కొంగల మల్లేశం, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, దండు నర్సింలు, విట్టల్‌రెడ్డి, అనంతరెడ్డి, బోద వెంకటయ్య, కుమార్, కరుణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

**చేవెళ్ల, జూలై 26 (జనంసాక్షి) :** మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముడిమ్యాల గ్రామంలో చోటుచేసుకుంది. చేవెళ్ల సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన గంట కృష్ణ అర్జున్, అతని భార్య మధురాణి ఇద్దరు కుమార్తెలతో కలిసి జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం ముడిమ్యాల గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నారు.గత కొంతకాలంగా గంట కృష్ణ అర్జున్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన అతను భార్యతో మరోసారి గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం 4 గంటల సమయంలో గ్రామ సమీపంలోని ఓ మామిడి చెట్టుకు తన లుంగితో ఉరివేసుకుని మృతి చెందిన స్థితిలో గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహా న్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చేవెళ్ల పోలీసులు తెలిపారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ముషీరాబాద్, జూలై 26 (జనం సాక్షి):**

నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం ఓ గుర్తుతెలియని వ్యక్తి అకస్మాత్తుగా అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ఆదివారం ఉదయం సుమారు 11:00 గంటల సమయంలో 35-40 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓ గుర్తుతెలియని వ్యక్తి నల్లకుంటలోని ఎస్ఎల్ డయాగ్నస్టిక్ సెంటర్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా కిందపడిపోయాడు. సమాచారం అందుకున్న నల్లకుంట పోలీసులు వెంటనే అంబులెన్స్‌లో అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స కోసం చేర్పించారు. అయితే, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు ఎరుపు రంగు టీ-షర్ట్, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. అతని ఎడమ చేతిపై మౌనిక అనే టాటూ ఉంది. మృతుడి వివరాలు ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ గుర్తుతెలియని వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం ఉంటే సమీపంలోని నల్లకుంట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి వివరాలు తెలియజేయాలని పోలీసులు కోరారు.

*కరీంనగర్ కల్చరల్ : ఆషాఢ మాసం సందర్భంగా కరీంనగర్ నగరంలోని సుభాష్‌నగర్‌లో పెద్దమ్మ తల్లి బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అంజని కుమార్, కార్పొరేటర్ గంట శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు*

## మున్నూరు కాపు, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో

# బోనాల వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, జూలై 26 (జనంసాక్షి) :** కరీంనగర్లోని చింతకుంట, రాంనగర్, కిసాన్ నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో, అలాగే మార్కండేయ నగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన పోచమ్మ, పెద్దమ్మతల్లి బోనాల మహోత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్ శ్రీనివాస్, రాష్ట్రంలో, జిల్లాలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం భక్తులతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగ ప్రజల ఐక్యతకు, భక్తి భావానికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి సాంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో కరీంనగర్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషా లతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజరామ శివరాం, తెల్ల లక్ష్మీ రమేష్, బండ రమణారెడ్డి, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గడ్డి ప్రదీప్, భారీ అపర్ణ జితేందర్, మల్లికార్జున రాజేందర్, మాజీ కార్పొరేటర్లు ఎడ్ల సరిత అశోక్, చల్ల స్వరూప రాణి హరి శంకర్, మున్నూరు కాపు సంఘం, పద్మశాలి సంఘం ప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల పేర్లకు శిలాఫలకాలపై చోటు కల్పించాలన్న వినతిపై

# నాలుగు వారాల్లో నిర్ణయం

*తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు*

- ఉప సర్పంచ్‌ల ప్రోటోకాల్‌పై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి
- నక్కలపల్లి ఉప సర్పంచ్ దాఖలు చేసిన రిట్‌పై విచారణ
- ప్రభుత్వ విధానంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి



**మొయినాబాద్, జూలై 26 (జనంసాక్షి):**

గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాలు, ప్రారంభోత్సవ బోర్డులపై ఉప సర్పంచ్‌ల పేర్లను కూడా పొందుపరచాలంటూ దాఖలైన రిట్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ సమర్పించిన వినతిని చట్టబద్ధంగా పరిశీలించి నాలుగు వారాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామ ఉప సర్పంచ్ గౌండ్ల నిరంజన్ గౌడ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ (నం. 22866/2026)పై విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున న్యాయవాది ఎం.వి. రాజ్‌కుమార్ గాబ్రియేల్ వాదనలు వినిపించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల్లో ఉప సర్పంచ్‌లు కూడా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, శిలాఫలకాలు, ప్రారంభోత్సవ బోర్డులపై వారి పేర్లను పొందుపరచకపోవడం సమానత్వ సూత్రానికి విరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 స్ఫూర్తికి అనుగుణంగా ఉప సర్పంచ్‌లకు కూడా అధికారిక గుర్తింపు కల్పించాలని కోరారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెం.520 (జూలై 1, 2013)ను తెలంగాణ ప్రభుత్వం అమల్లో కొనసాగిస్తున్నప్పటికీ, ఉప సర్పంచ్‌ల ప్రోటోకాల్‌కు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలు ఇప్పటికీ జారీ కాలేదని కోర్టుకు వివరించారు. జిల్లా పరిషత్‌లలో వైస్ చైర్మన్, మున్సిపాలిటీల్లో వైస్ చైర్మన్, నగర పాలక సంస్థల్లో డిప్యూటీ మేయర్‌కు ఉన్న అధికారిక గుర్తింపు తరహాలో గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌లకు కూడా ప్రోటోకాల్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ శాఖ తరపున హాజరైన ప్రభుత్వ న్యాయవాది, ఉప సర్పంచ్‌ల ప్రోటోకాల్‌పై ప్రస్తుతం స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు లేవని కోర్టుకు తెలిపారు. పిటిషనర్ సమర్పించిన వినతిని చట్టప్రకారం పరిశీలిస్తామని వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, పిటిషనర్ సమర్పించిన ప్రాతినిధ్యంపై సంబంధిత అధికారులు నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల అధికారాలు, ప్రోటోకాల్ అంశాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ ఉత్తర్వులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల అధికారిక గుర్తింపు, గౌరవానికి సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించే దిశగా ఈ పరిణామం కీలకంగా మారే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# కార్గిల్ అమర జవాన్లకు ఘన నివాళులు

- బోడుప్పల్లో 388వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల
- నేటి యువతకు దేశ రక్షణ రంగంలో విశేషా అవకాశాలు
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య



**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 388వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. అదేవిధంగా జూలై 26 కార్గిల్ దివాస్ సందర్భంగా అమరా జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ1999 లో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం తమ వీర పరాక్రమాలను ప్రదర్శించి విజయం సాధించారని, పాకిస్తాన్ పై భారత్ విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26 కార్గిల్ దివాస్ ను జరుపుకుంటున్నామని తెలుపుతూ కార్గిల్ యుద్ధంలో మరణించిన అమర జవాన్లకు అంబేద్కర్ ఆశయ సాధన సంఘం తరపున నివాళులు అర్పిస్తున్నామని అన్నారు. నేటి యువతకు దేశ రక్షణ రంగంలో. కూడా అనేక ఉన్నత అవకాశాలు ఉన్నాయని, దేశ రక్షణ ఒక అదృష్టంగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకొని భారత తిరిగి వచ్చిన అంబేద్కర్ ఆశ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్యను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అఖిలపక్షం అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, బిజెపి నాయకులు ఏనుగు లక్ష్మయ్య, మాదిగ తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్, బైండ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,కడియం రాంబాబు, అంబేద్కర్ ఆశ సాధన సంఘం సభ్యులు గరుగుల యాకయ్య, శ్రీరాముల జ్ఞానేశ్వర్,సాయి బండారి, యేసు రాజు, చిల్ల అంజయ్య, మేడే శ్రీకాంత్, జడ శ్రీనివాస్, గల్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వైశాలీనగర్ వరద నీటి కాల్వ పనులు వేగవంతం చేయాలి

- రూ.70 లక్షలతో కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణం
- రైల్వే అండర్‌పాస్ వద్ద పనులను పరిశీలించిన అరికెపూడి గాంధీ
- వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం
- నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచన



**శేరిలింగంపల్లి, జూలై 26 (జనంసాక్షి):** హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలీనగర్ పరిధిలోని రైల్వే అండర్‌పాస్ వద్ద జరుగుతున్న వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. ఆదివారం రూ.70 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్, సీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, మంజీరా పైప్‌లైన్ రోడ్డు నుంచి మసీద్ బండ వైపు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.

వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అరికెపూడి గాంధీ అన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని, హఫీజ్‌పేట్ డివిజన్‌తో పాటు మొత్తం శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పనులను వర్షాకాలానికి ముందే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు వెంకటేశ్వర్లు, క్రిషాంక్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన పారిశ్రామికవేత్త భూమి కబ్జా యత్నం

- కమల డెవలపర్స్ ప్రతినిధిపై చర్యలు తీసుకోవాలి
- జాతీయ గిరిజన కమిషన్‌కు ఫిర్యాదు
- ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పి.వి. రమణ డిమాండ్



**సికింద్రాబాద్(జనంసాక్షి) :** ముంబైకి చెందిన గిరిజన పారిశ్రామికవేత్త, న్యాయవాది గౌతమ్ నిశాంత్‌కు చెందిన 3 ఎకరాల భూమిని డెవలప్‌మెంట్ పేరుతో కాజేసేందుకు కమల డెవలపర్స్ ప్రతినిధి కాంతిలాల్ గవాయ్ యత్నిస్తున్నారని ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పి.వి. రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బాధితుడు పారిశ్రామికవేత్త న్యాయవాది గౌతమ్ నిశాంత్‌తో కలిసి ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... మూడు ఎకరాల భూమి డెవలప్ మెంట్ కోసం ఒప్పందం చేసుకొని ఐదు సంవత్సరాలు గడిచిన అభివృద్ధి చేయడం లేదన్నారు. ఇది ప్రశ్నించిన యజమాని గౌతమ్ నిశాంత్ పై దాడికి యత్నిస్తూ, కులం పేరుతో దూషిస్తూ మాఫియాతో చంపిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నాటి. ఈ ఘటనపై జాతీయ గిరిజన కమిషన్ (ఎన్సిఎస్టీ) సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించార న్నారు. గిరిజన పారిశ్రామికవేత్తల అణచివేతను సహించబో మని, విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. బాధితుడికి న్యాయం జరగకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని గిరిజన సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలోగిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నాయక్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సతీష్, నర్సింహులు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సోమవారం
27 జూలై 2026
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



## చదువుకు దూరం.. ప్రాతినిధ్యంలో శూన్యం!

నిరంతరం ఊర్లు తిరిగే సంచార జీవనం వల్ల ఈ సామాజిక వర్గానికి చెందిన పిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. నాణ్యమైన విద్య అందక, ఉన్నత విద్యలోను, ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ వీరి ప్రాతినిధ్యం శూన్యంగా మారింది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడటమే కాకుండా రాజకీయంగా కూడా సరైన గుర్తింపు నోచుకోలేకపోయామని ఆ వర్గాల పెద్దలు వాపోతున్నారు.

# అంతరించిపోతున్న 'పూసల' వృత్తి

## సంచార జీవుల తీరని వ్యథ!

- కార్పొరేట్ ఫ్యాషన్ ధాటికి కుదేలైన వంశపారంపర్య జీవనోపాధి
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువై మనుగడ కోసం ఆరాటం
- కాలగర్భంలో కలిసిపోతున్న జానపద కళ!

**రంగారెడ్డి, జులై 26 (జనంసాక్షి) :**
ఒకప్పుడు గ్రామీణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన పూసల వృత్తి నేడు మనుగడ కోసం పోరాటం చేస్తోంది. పూసలు, గవ్వలు, ముత్యాలు, రంగురంగుల దారాలతో ఆకర్షణీయమైన చేతి ఆభరణాలు తయారు చేస్తూ ఊరూరా తిరిగి విక్రయించే పూసల సామాజిక వర్గాల బతుకులు నేడు ప్రశ్నార్థకంగా మారాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్ వ్యవస్థ రూపురేఖలు మారిపోవడం, ప్రభుత్వాల నుంచి ఆశించిన ప్రోత్సాహం లేకపోవడం, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు లభించకపోవడంతో ఈ తరతరాల జీవనోపాధి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

**తీరని సంచార తిప్పలు.. అందని సంక్షేమ ఫలాలు!**

తరతరాలుగా సంచార జీవులుగా జీవిస్తున్న పూసల కుటుంబాలకు ఇప్పటికీ సొంత ఇల్లు, స్థిర నివాసం అనేది నెరవేరని కలగానే మిగిలిపోయింది. గ్రామాలు, పట్టణాల శివార్లలో తాత్కాలిక గుడిసెలు వేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. స్థిరమైన చిరునామా లేకపోవడం వీరికి పెద్ద శాపంగా మారింది. దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులు వంటి ప్రాథమిక ఆధారాలు పొందలేకపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక ఫలాలు వీరికి అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి.



**కార్పొరేట్ దెబ్బకు కుదేలైన వీధి వ్యాపారం..**

ఒకప్పుడు పండుగలు, జాతరలు,శుభకార్యాల సమయంలో పూసల ఆభరణాలకు విశేష ఆదరణ ఉండేది. కానీ ప్రస్తుతం యంత్రాలతో అతి తక్కువ ధరకే తయారయ్యే ఫ్యాషన్ జువెలరీ మార్కెట్‌ను ఆక్రమించింది. బహుళజాతి కంపెనీల విస్తరణ, షాపింగ్ మాల్స్, బ్రాండెడ్ జువెలరీ అవుట్‌లెట్లు రావడంతో వీధుల్లో తిరిగి ఆభరణాలు అమ్మే పూసల వర్గాల వ్యాపారం పూర్తిగా పడిపోయింది. మరోవైపు ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ తయారు చేసిన వస్తువులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. దీంతో రోజువారీ ఆదాయం పడిపోయి, పూట గడవడం కూడా కష్టంగా మారిందని వృతిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

**తెలంగాణ పూసల అభివృద్ధి వేదిక అధ్యక్షులు నూతనగంటి పురుషోత్తం**



కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో తమను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ పూసల అభివృద్ధి వేదిక అధ్యక్షులు నూతనగంటి పురుషోత్తం డిమాండ్ చేశారు.తమ సామాజిక వర్గానికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా క్రాఫ్ట్ బజార్లు, ప్రభుత్వ ప్రదర్శనల్లో ఉచితంగా స్టాళ్లు కేటాయించాలన్నారు. బ్యాంకుల ద్వారా స్వయం ఉపాధి రుణాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంచార జీవులుగా బతుకుతున్న తమకు ఇండ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేసి స్థిర నివాసం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు తక్షణమే జోక్యం చేసుకుని తమ బతుకులకు భరోసా ఇవ్వకపోతే, ఈ అరుదైన వంశపారంపర్య కళ రాబోయే తరాల నాటికి కేవలం చరిత్ర పుటలకే పరిమితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఘనంగా భీంగల్ నూతన న్యాయస్థాన ప్రారంభోత్సవం





- మొదటి రోజే 5 సివిల్ కేసుల విచారణ
- ముఖ్య అతిథులుగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు

**భీంగల్ (జనంసాక్షి) :** పట్టణంలో ఆదివారం నూతన జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తంగిరాల మాధవి దేవి,జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు.మొదటి రోజు కోర్టు నిర్వహణలో భాగంగా 5 సివిల్ కేసుల ట్రయల్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మీ మాట్లాడుతూ.. భీంగల్ న్యాయస్థాన ఏర్పాటుకు కృషిచేసిన జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్ గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియచేశారు. అలాగే కోర్టు ఏర్పాటుకు తోడ్పడిన ఆర్మూర్ జడ్జి లక్ష్మీకి, ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులకు, పత్రిక విలేకరులకు, ప్రజలకు, జిల్లా అధికారులకు,పోలీసులకు తన అభినందనలు తెలియచేశారు. ఈ ప్రాంతంలో కోర్టు ఏర్పాటు వల్ల భీంగల్ మండలంతో పాటు,సిరికొండ, కమ్మర్ పల్లి, మోర్తాడ్, ఎర్గట్ల ప్రాంత ప్రజలు కేసుల నిమిత్తం ఆర్మూర్ వెళ్ళవలసిన పనిలేదని వివరించారు. ఈ సందర్భంగా జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నాకు చదువు, సంస్కారం నేర్పిన ఈ భీంగల్ నేలను తాను ఎప్పటికి మర్చిపోలేనని, ఇక్కడ కోర్టు ఏర్పాటు లింబాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దయ వల్లే జరిగిందని పేర్కొన్నారు.

# నేటి నుండి జిల్లా గొర్రెల పెంపకం దారుల

- సహకార సంఘాల ఎన్నికల నామినేషన్ సందడి
- ఈ నెల 27, 28, 29 తేదిలలో నామినేషన్ల స్వీకరణ, 30న పరిశీలన, 31న ఉపసంహరణ
- ఆగస్టు 5న పోలింగ్ .. తుది ఫలుతాలు
- ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్టర్ మహమ్మద్ జలాలొద్దీన్ అక్బర్



**కరీంనగర్ బ్యూరో, జులై 26 (జనంసాక్షి) :** స్టేట్ కో-ఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ, హైదరాబాదు ఉత్తర్వుల మేరకు ఆర్.సి నెం. 309/కెవన్ఆర్ /ఎస్.సి.ఇ.ఎ./2025 - 2026 జులై 18 ప్రకారం, కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ లిం. కరీంనగర్‌కు ఆగస్టు 5న ఎన్నికలు నిర్వహించను న్నట్లు నేటి నుండి నామినేషన్లు వేయవచ్చని ఎన్నికల అధికారి మహమ్మద్ జలాలొద్దీన్ అక్బర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ మాట్లాడు తూ... ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 2026 జులై 22 బుధవారం రోజు ఎన్నికల నోటీసు జారీ చేస్తూ, యూనియన్ కార్యాలయం కరీంనగర్ (పద్మనగర్) లో ఈ నెల 27, 28, 29 తేదిలలో నామినే షన్ల స్వీకరణ జరగనుందని, 30న పరిశీలన, 31న ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. గతంలో ఉమ్మడి జిల్లా యూనియన్ గా కొనసాగిందని, తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత (33) వివిధ జిల్లాలకు నిర్వహించాలని అధికారులు ప్రతిపా దించినారని, ఇందులో భాగంగా మొట్ట మొదటి సారిగా కరీంనగర్ జిల్లాలోని 16 మండలాలలోని 139 ప్రాథమిక గొర్రెల పెంపకం సహకార సంఘాల అధ్యక్షులు ఎన్నికలో పాల్గొనుటకు అర్హులు అని, ఆగస్టు 5న రహస్య బ్యాలెట్ ద్వారా షెడ్యూల్ ప్రకారం పోలింగ్ జరగనుందని తెలిపారు. 15 సంవత్సరాల తర్వాత కరీంనగర్ జిల్లలో ఎన్నికలు రావడం వలన గొర్రెల పెంపకం సహకార సంఘాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎన్నికల అధికారి మహమ్మద్ జలాలొద్దీన్ అక్బర్ తెలిపారు.

# భక్తుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

- నాయి బ్రాహ్మణులకు ఆలయ ఈవో హెచ్చరిక

**వేములవాడ, జూలై 26 (జనంసాక్షి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని కళ్యాణకట్టల్లో భక్తుల నుంచి నగదు వసూళ్లకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడం పై దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఈవో రమాదేవి స్పందించారు. గత రెండు మూడు రోజులుగా కళ్యాణకట్టల్లో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులు భక్తుల వద్ద నుంచి నగదు అడుగుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు ప్రచారంలోకి రావడం వల్ల దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. భక్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయకుండా నేరుగా దేవస్థానం కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణకట్టల్లో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులను ఈవో తన కార్యాలయానికి పిలిపించి భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు డిమాండ్ చేయరాదని అన్నారు. ఇటువంటి ఘటనలు మరోసారి పునరావృతమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ ఈవోలు జయకుమారి, శ్రీ నాగుల మహేష్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, రాజేందర్, ఆలయ ఉద్యోగులు, నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.



# బకాయిలు చెల్లించకపోతే ఆగస్టు 4న 'ఛలో బస్ భవన్'

**ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం**



**కరీంనగర్ టౌన్, జూలై 26, (జనం సాక్షి) :** రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు రావాల్సిన పే రివిజన్, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఆగస్టు 4న హైదరాబాద్‌లోని బస్ భవన్ వద్ద ఛలో బస్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కరీంనగర్ జోన్ (ఉత్తర తెలంగాణ) గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి రమణారావు హెచ్చరించారు.కరీంనగర్‌లోని తారక్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2017, 2021 పే రివిజన్‌లకు సంబంధించిన బకాయిలు ఇప్పటికీ వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు అందలేదని తెలిపారు. దాదాపు 15 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. పలుమార్లు ఆర్టీసీ యాజమాన్యాన్ని కలిసి సమస్యలు వివరించినప్పటికీ హామీలు మాత్రమే ఇచ్చారని, ఇప్పటికీ పరిష్కారం కాలేదని విమర్శించారు.ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం, వైద్య సేవలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 4న బస్ భవన్ వద్ద భారీ స్థాయిలో నిరసన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర, జోనల్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచాన్నే మార్చే శక్తి విద్యకు ఉంది

- పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా నాణ్యమైన విద్యను అందించాలి
- ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు జులై 26 (జనంసాక్షి) :** ప్రపంచాన్నే మార్చే శక్తి విద్యకు ఉందని ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణం దుర్గా గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ట్రస్మా తాండూరు నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్మా తాండూరు శాఖ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచాన్నే మార్చే శక్తి విద్యకు ఉంది ఆయన అన్నారు.అలాంటి విద్యను అందిస్తున్న మీరూ అందరూ శక్తివంతులే అని, విద్యార్థులందరిని సంస్కరవంతులుగా, జ్ఞానవంతులుగా తయారు చేయాలని కోరారు. తాండూరును 10వ తరగతి ఫలితాల పరంగా వికారాబాద్ జిల్లాలోనే టాప్‌గా నిలిపిన విద్యాసంస్థలకు, విద్యార్థులు,వారి తల్లితండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యం కాబట్టి తాండూరు విద్యార్థులకు నేటి పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా నాణ్యమైన విద్యను అందియ్యండి.మీకు ఎమ్మెల్యే మేము, చైర్మన్ అందరం అండగా ఉంటామని, మీరంతా ఒక కుటుంబంలా మెలగాలని, ఒక్కటై ముందుగు సాగండి..తాండూరు విద్యాభివృద్ధికి బాటలు వేయండి అని అన్నారు, తాండూరు అభివృద్ధికై మాకు సహకరించండి. నేను వ్యాపారం చేస్తున్న.. ఒక స్కూల్ నడపాలంటే ఎంత కష్టమో నాకు తెలుసు.. అందరూ నిరుద్యోగులే మేనేజ్మెంట్ లుగా మారి విద్యాసంస్థలు చాలా ఇబ్బందులు పడుతూ నాణ్యమైన విద్యను అందిస్తూ నడిపిస్తున్నారు అని అన్నారు.కాబట్టి మీకు ఎల్లపుడు అండగా ఉంటాం.. మీరు విద్యార్థుల భవిష్యత్తు పై దృష్టి పెట్టండి. వారి బంగారు భవిష్యత్తుకై మార్గదర్శనం చేయండి ఆయన తాండూరు ప్రైవేట్ స్కూల్స్ యజమాన్యాలను వారు కోరారు.ఈ కార్యక్రమంలో తాండూరు మునిసిపాలిటీ చైర్మన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి మరియు ట్రస్మా రాష్ట్ర మరియు జిల్లా కమిటీ సభ్యులు, తాండూరు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు.

# అమ్మకు ప్రత్యామ్నాయం లేదు

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి బ్యూరో జూలై 26 జనంసాక్షి :** నేలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత వనపట్ల సుబ్బయ్య రచించిన "పసరంటిన కొడవలి" కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం నాగర్‌కర్నూల్‌లోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వనపట్ల సుబ్బయ్య ప్రతిభావంతుడైన కవి అయినప్పటికీ ఆడంబరం, ఆర్భాటాలకు దూరంగా సాధారణ జీవితం గడపడం ప్రశంసనీయమని అన్నారు. కుల వృత్తిని కొనసాగిస్తూ ప్రవృత్తిగా కవిత్వాన్ని ఎంచుకుని సమాజాన్ని చైతన్యపరిచే దిశగా ఇప్పటికే 15 పుస్తకాలు రచించడం సమాజ శుద్ధికి చేసిన విశిష్ట సేవగా అభివర్ణించారు. ప్రపంచంలో మూడు అంశాలకు ప్రత్యామ్నాయం లేదని పేర్కొంటూ, అవి ఆహారం, మాతృదేశం, అమ్మ అని చెప్పారు. అందులో అమ్మ స్థానం అత్యున్నతమైందని, సకల జీవరాశులకు తల్లి రక్షణ కవచమని కొనియాడారు. "పసరంటిన కొడవలి" కవిత మాతృమూర్తుల అంతరంగాన్ని హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించిందని పేర్కొన్నారు.

తల్లి ప్రభావంతోనే మానవ సంబంధాలు, సామాజిక బాధ్యత, ఆర్థిక క్రమశిక్షణ, సమాజంలోని సమస్యలపై అవగాహన పెరుగుతుందని వివరించారు. తన జీవితంలో తల్లిదండ్రులు తారకమ్మ, రామ్‌రెడ్డి చూపిన మార్గదర్శకత్వం ఎంతో ప్రభావం చూపిందని, సమాజంతో ఎలా మెలగాలో వారే నేర్పారని గుర్తుచేశారు. రానున్న భవిష్యత్తు యువతరానిదేనని, వారందరికీ పెద్దలు ఆదర్శంగా నిలిచి మంచి విలువలను అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, గౌరవ అతిథులు కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, చింతపల్లి భాస్కర్ రావు, వాసుదేవుడు, ప్రధాన వక్త ఆచార్య కోయి కోటేశ్వర్ రావు, నాగవరం బాల్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

### 31న మేడ్చల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

**అండర్-16, 18, 20 జావెలిన్ త్రో రాష్ట్రస్థాయి ఎంపికలు కూడా నిర్వహణ**

**జవహర్ నగర్, జులై 26: (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలను కొంపల్లిలోని సన్‌ఫ్లవర్ వేదిక స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఈ. స్టాన్లీ జోన్స్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. రాజశేఖర్, కమిటీ సభ్యుడు రాహుల్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. అండర్-6, అండర్-8, అండర్-10, అండర్-12 విభాగాల్లో రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ ఈవెంట్లలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అండర్-16, అండర్-18, అండర్-20 పురుషులు, మహిళల జావెలిన్ త్రో విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఆగస్టు 7, 8 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు జులై 31న ఉదయం 7 గంటలకు కొంపల్లిలోని సన్‌ఫ్లవర్ వేదిక స్కూల్‌లో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు 98496 1273 3, 90006 54706 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

*మొయినాబాద్: ప్రమాదవశాత్తు ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఉన్న తీగలకు తగిలి రెండు గేదెలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో జరిగింది. రైతు చాకలి బాబయ్య తెలిపిన వివరాల ప్రకారం తనకున్న రెండు గేదెలను ఆదివారం మేత కోసం గ్రామ సమీపంలో వదలగా సమీపంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి.*




### దిష్టి కుంభం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 26 (జనంసాక్షి) :** వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన దిష్టి కుంభం కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ దిష్టి కుంభం కార్యక్రమం కేవలం ఆచారం మాత్రమే కాదని,సమాజమంతా సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలనే సంకల్పానికి ప్రతీక అన్నారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని,సకాలంలో వర్షాలు కురవాలని,అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవించాలని కోరుకునే గొప్ప సంప్రదాయమే ఈ కార్యక్రమమన్నారు.సుమారు 55 సంవత్సరాల క్రితం వెంకమ్మ అనే మహిళ ప్రారంభించిన దిష్టి కుంభం కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం నిరంతరాయంగా కొనసాగించడం అభినందనీయమన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక బాధ్యతలను కూడా నిర్వర్తించడం ప్రశంసనీయమన్నారు. ఈ ప్రాంత ప్రజలందరికీ ఎలాంటి అపశకునాలు, కీడు జరగకుండా, దిష్టి తొలగి సర్వత్రా శుభం కలగాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# వేములవాడకు మహర్దశ

- రాజన్న క్షేత్రానికి రూ.99.40 కోట్లు మంజూరు
- విప్ ఆది శ్రీనివాస్‌ను సత్కరించిన మున్సిపల్ చైర్మన్



**వేములవాడ, జులై 26 (జనం సాక్షి) :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధి, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తాజా నిధుల మంజూరుతో ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరుకున్నాయి.?రాజన్న ఆలయాభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయడంపై వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు ఆధ్వర్యంలో వైస్ చైర్మన్, పాలకవర్గ కౌన్సిలర్లతో కలిసి స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కారించి వారు అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆలయాభివృద్ధికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. శృంగేరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారి సలహాలు, సూచనలతో పనులు ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ?అనంతరం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, మన వేములవాడ పుణ్యక్షేత్రానికి మహర్దశ పట్టిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతర కృషి, పట్టుదలతోనే రాజన్న ఆలయానికి రూ.249.40 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయని కొనియాడారు. వేములవాడ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కి, నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సహా ఇతర మంత్రులకు మున్సిపాలిటీ తరఫున, ప్రజల తరఫున మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.?దేశంలోనే అత్యంత ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం దశలవారీగా నిధులు విడుదల చేస్తోందని చైర్మన్ పుల్కం రాజు పేర్కొన్నారు. గత 2023-24 బడ్జెట్‌లో రూ.50 కోట్లు, 2024-25 బడ్జెట్‌లో రూ.100 కోట్లు విడుదల చేయగా, ఇప్పుడు మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడం ద్వారా ఆలయ విస్తరణ, మౌలిక వసతుల కల్పన పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే 45 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే భక్తులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి వేములవాడ పట్టణం ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటకంగానూ ఎంతగానో అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# మానసిక లోపాలున్న చిన్నారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మానసిక ఎదుగుదల లోపాలతో బాధపడుతున్న చిన్నారుల విషయంలో తల్లిదండ్రులతో పాటు, సమాజం కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో.. సాధన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఇంటెలెక్చువల్లీ ఛాలెంజ్డ్ (సాధన ఫౌండేషన్)కు చెందిన మానసిక దివ్యాంగులైన చిన్నారులతో కలిసి సంస్థ ప్రతినిధులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిల్లలతో మంత్రి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి అభిరుచులు, దైనందిన కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి నవ్వుతూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేశారు. 1996 నుంచి మెంటల్లీ చాలెంజ్డ్ పిల్లల కోసం ప్రత్యేక విద్య, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, వృత్తి శిక్షణ, పునరావాస సేవలు అందిస్తున్నామని సంస్థ నిర్వాహకులు మంత్రికి వివరించారు. సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. అవసరమైన సహకారాన్ని అందించి, అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి పిల్లలకు సేవ చేస్తున్న సంస్థ నిర్వాహకులను అభినందించారు.

పిల్లల జీవితంలో తొలి ఐదేళ్లు అత్యంత కీలకమైనవని అన్నారు. ఈ దశలోనే శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను గుర్తించి సకాలంలో చికిత్స, థెరపీ అందిస్తే వారి సమస్యను పరిష్కరించి, భవిష్యత్తును మెరుగుపరిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ లక్ష్యంతోనే తెలంగాణ ప్రభుత్వం 'బాలభరోసా' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ స్థాయి నుంచే చిన్నారుల్లో మానసిక, శారీరక ఎదుగుదల లోపాలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు, థెరపీ, పునరావాసం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. మానసిక ఎదుగుదల లోపాలతో ఇబ్బంది పడుతున్న పిల్లలకు అవసరమైన వైద్య సేవలు, విద్యను అందించేందుకు ప్రత్యేక వ్యవస్థలను రూపొందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

# ప్రజాభవన్‌లో బోనాల సంబురాలు

- అమ్మవారికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- భక్తిశ్రద్ధలతో బోనమెత్తిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రి కొండ సురేఖ
- హాజరైన మంత్రులు కొండ సురేఖ, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు, జోగిని శ్యామల సందడి





**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దమైన ఆషాడ బోనాల సంబురాలు ప్రజాభవన్‌లో అత్యంత ఘనంగా, అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ పల్లె వాతావరణాన్ని తలపించేలా సాగిన ఈ వేడుకల్లో అమ్మవారి నామస్మరణతో ప్రజాభవన్ ప్రాంగణం మార్మోగింది. భక్తిశ్రద్ధలు, డప్పు చప్పుళ్లు, పోతురాజుల నృత్యాల మధ్య ఉత్సవాలు కోలాహలంగా సాగాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సతీమణి నందిని విక్రమార్క సంప్రదాయబద్ధంగా, భక్తి భావంతో తలపై బోనం ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బోనమెత్తిన నందిని విక్రమార్క వెంట కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

## ఉత్సవాల్లో మంత్రుల సందడి

ప్రజాభవన్‌లో జరిగిన ఈ ఆషాడ బోనాల వేడుకలకు రాష్ట్ర మంత్రులు కొండ సురేఖ, ధనసరి సీతక్క పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు తమ కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. మంత్రి కొండ సురేఖ భక్తి భావంతో తలపై బోనం ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో తెలంగాణ ఆత్మను చాటిచెప్పేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ కట్టిపడేశాయి. పసుపు కుంకుమలు, వేప మండలు ధరించిన మహిళల కోలాటం ఒకవైపు.. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు మరోవైపు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు కళాకారుల దరువులతో ప్రజాభవన్ దద్దరిల్లింది. ?ముఖ్యంగా ప్రముఖ జోగిని శ్యామల తనదైన శైలిలో నృత్యాలు చేస్తూ వేడుకల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపారు. డప్పు చప్పుళ్లకు అనుగుణంగా ఆమె చేసిన సందడి, పోతురాజుల నృత్యాలు వీక్షకులను విశేషంగా అలరించాయి. మొత్తంగా ఈ బోనాల పండుగ ప్రజాభవన్‌లో తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచింది.

# ఏఎంసీలను పాదర్శకంగా తీర్చిదిద్దుతాం

- వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం
- ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరును సమగ్రంగా పరిశీలించేందుకు ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకుల నియంత్రణలో పనిచేస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఈ వారం తనిఖీ చేయనున్నాయి. ప్రత్యేక బృందాలు మార్కెట్ కమిటీల పరిపాలన, రైతులకు అందుతున్న సేవలు, మార్కెట్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించనున్నాయి. రైతులు తమ పంటలను విక్రయించే సమయంలో ఎదుర్కొంటున్న ఆచరణాత్మక సమస్యలతో పాటు కనీస మద్దతు ధర కొనుగోలు కార్యకలాపాల్లో ఉన్న లోపాలు, ఇబ్బందులు గుర్తిస్తాయి. రైతులు తమ పంటలను నష్టపోయే ధరలకు విక్రయించాల్సిన పరిస్థితులకు దారితీస్తున్న కారణాలు, మార్కెట్ సెస్ ఎగవేతను నివారించేందుకు అవసరమైన చర్యలు చేపడుతాయి. మార్కెట్ కమిటీల పరిపాలన, మౌలిక సదుపాయాలు, సేవలపై సూచనలు మార్కెట్‌లో గిట్టుబాటు ధర పొందుతున్నారా వేలం ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందా అనే అంశాలను పరిశీలన జరుగుతుంది. కనీస మద్దతు ధర కొనుగోలు కేంద్రాల నిర్వహణ, కొనుగోలు ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయా అనే అంశాలను తెలుసుకుంటాయి. నివేదికల్లో గుర్తించిన లోపాలు, తక్షణ చర్యలు అవసరమైన అంశాలు, విధానపరమైన సంస్కరణలు, మార్కెట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన సూచనలు పొందుపరుస్తాయి. రైతుకు గిట్టుబాటు ధర, మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు, పారదర్శకమైన లావాదేవీలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యం అని బాధ్యతాయుత పరిపాలన ఈ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ముగ్గురు బాలికల అదృశ్యం కేసు చేధన

- చత్తీస్‌గఢ్‌లో సురక్షితంగా గుర్తింపు..
- కుటుంబ కలహాలే ఇంటి నుంచి వెళ్లిపోవడానికి కారణం..
- పిల్లలకు ప్రేమ ఆప్యాయత కల్పించాలి..
- డిసిపి రక్షిత కృష్ణమూర్తి..



**ముషీరాబాద్, జులై 26 (జనం సాక్షి):** దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన ముగ్గురు మైనర్ బాలికల కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. సాంకేతిక ఆధారాలు, వందలాది సీసీటీవీ ఫుటేజీల విశ్లేషణ, ప్రత్యేక బృందాల సమన్వయంతో బాలికలను చత్తీస్‌గఢ్‌లో సురక్షితంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ కలహాల కారణంగానే వారు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ వెల్లడించిన వివరాల ప్రకారం.. దోమలగూడ పరిధిలోని బస్తీలో నివసిస్తున్న రామ్ దులారి కుటుంబం జీవనోపాధి కోసం ఈ ఏడాది మే నెలలో చత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చింది. ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి సమయంలో సనీషా కుమారి అలియాస్ శిల్ప (17), స్నేహ కుమారి (16), లత (15) ఇంటి నుంచి వెళ్లిపోయారు. తెల్లవారుజామున విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న దోమలగూడ పోలీసులు, సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ సహకారంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మొత్తం 262 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి బాలికల ప్రయాణ మార్గాన్ని గుర్తించారు. హిమాయత్‌నగర్, కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలో వారి కదలికలను ట్రాక్ చేసి, దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పూర్ చేరుకుని అక్కడి నుంచి చత్తీస్‌గఢ్‌లోని గడ్‌చిరోలి మీదుగా పాతంజూర్ గ్రామానికి వెళ్లినట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలు, స్థానిక పోలీసుల సహకారంతో చత్తీస్‌గఢ్‌లో బాలికలను సురక్షితంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ తెలిపారు. ప్రాథమిక విచారణలో తల్లిదండ్రుల మధ్య తరచూ జరిగే గొడవల కారణంగా మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు బాలికలు వెల్లడించినట్లు చెప్పారు.

## పిల్లలకు ప్రేమ, ఆప్యాయత, భరోసా కలిగించాలి

బాలికలకు సఖి భరోసా కేంద్రంలో వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించి, పూర్తి విచారణ అనంతరం రెండు రోజుల్లో తల్లిదండ్రులకు అప్పగిస్తామని డీసీపీ తెలిపారు. పిల్లలు మాటల కంటే తల్లిదండ్రుల ప్రవర్తనను ఎక్కువగా గమనిస్తారని, వారికి ప్రేమ, ఆప్యాయత, భద్రతాభావం కల్పించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని సూచించారు. ఈ కేసును అంకితభావంతో ఛేదించిన దోమలగూడ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజత్ అలీ, ఏఎస్ఐ జి. మధుమోహన్ రావు, కానిస్టేబుళ్లు కె. నాగరాజు, మొహమ్మద్ జలీల్, జి. సూర్యప్రకాశ్, ఎస్.ఆర్. ఉదయ్‌కుమార్‌తో పాటు సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని డీసీపీ రక్షిత కృష్ణమూర్తి అభినందించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ నరసయ్య, ఏసీపీ ఏ. యాదగిరి పాల్గొన్నారు.

# రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వమే అమలు చేయాలని, లేదా రాష్ట్రాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని పంచుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఆయన బీజేపీ నేతల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించాలన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని తెలిపారు. ఈ అంశంపై నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీ నేతలు డ్రామాలాడుతున్నారని, దీనికి కేంద్రం మద్దతు ఇస్తుందా లేదా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహణకు బీజేపీ మద్దతు ఇస్తుందా? లేదా? తేల్చి చెప్పాలని సవాల్ విసిరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ నాయకులు... తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో ఈ పథకాన్ని ఎక్కడ అమలు చేస్తున్నారో బహిరంగంగా చెప్పాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.



# కృష్ణా జలాల దోపిడీని అడ్డుకోవాలి

- మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి
- కర్ణాటకలో బీఆర్ఎస్ నేతల క్షేత్రస్థాయి పరిశీలన

**జడ్చర్ల, జూలై 26 (జనంసాక్షి):** కర్ణాటకలోని కృష్ణా నదిపై అక్రమ కట్టడాల వల్ల భవిష్యత్తులో తెలంగాణకు చుక్క నీరు కూడా వచ్చే పరిస్థితి లేదని, జలదోపిడీని అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే ఉమ్మడి పాలమూరు జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుందని మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రంలో కృష్ణా నదిపై అక్రమంగా నిర్మించిన గూగల్ బ్యారేజ్ ను, భీమా నదిపై గూడూరు వద్ద నిర్మించిన బ్యారేజ్ ను మాజీ మంత్రులు డా. సి. లక్ష్మారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేందర్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎగువన కర్ణాటక నిరంతరం జలదోపిడీకి పాల్పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని కర్ణాటక నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను, హైడ్రాలిక్ గేట్లను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకు కేటాయించిన నీటి హక్కులను, జలాలను అన్యాయంగా తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిద్రమత్తులో ఉందా అని ఆయన ప్రశ్నించారు. కృష్ణా బేసిన్ లో తెలంగాణ హక్కులను కాలరాసేలా పొరుగు ప్రాంతాలు చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని కోరారు. లేనిపక్షంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఎడారిగా మారుతుందని, దీనిపై పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# జంతర్‌మంతర్ వద్ద విప్లవ జ్వాలను చూశాం

- విద్యార్థుల పోరాటంపై బురదజల్లే ప్రయత్నం
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన రాష్ట్ర బీజేపీ నేతలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జంతర్‌మంతర్ వద్ద ఎన్నడూ లేని విధంగా విద్యార్థి, యువజన జ్వాలను చూశామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. విద్యార్థులంతా ఏకం కావడంతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ.. నీట్ లీకేజీపై విద్యార్థులు పోరాటం చేస్తే బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో ఉద్యమకారులపై బీజేపీ నేతలు అవకాలు, చవాకులు పేలారని విమర్శించారు. వారిని దేశద్రోహులు అని.. బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఫండింగ్ చేస్తోందని చిల్లరగా మాట్లాడారని అన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని, నీట్ పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు పోరాడారని తెలిపారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధంగా విద్యార్థులు విజయం సాధించారని అన్నారు.

విద్యార్థి ఉద్యమంపై బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికావని దాసోజు శ్రవణ్ అన్నారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డికి విద్యార్థుల బాధలు అర్థంకాక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు అనవసరమైన మాటలతో విద్యార్థులను రెచ్చగొడుతున్నారని చెప్పారు. నిరసనకారులు పాకిస్తాన్ ప్రేరేపితులని బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యావ్యవస్థను సంస్కరించిండని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారని తెలిపారు. ఆందోళనకారులకు నిరసన తెలిపే హక్కు లేదని, నిరసన తెలిపితే కాల్చిచంపాలని అన్నాడని మండిపడ్డారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పరీక్ష పత్రం లీకైతే తలెత్తే సమస్యలపై అవగాహన లేదని తెలిపారు. విద్యార్థులు కాల్చివేతలకే అర్హులైతే వారితో ఎందుకు చర్చలు జరిపారని ప్రశ్నించారు. విద్యార్థులు కణకణమండే అగ్గిరవ్వలు అని.. వారిని రెచ్చగొట్టవద్దని సూచించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తితో విద్యార్థులు పొలికేక పెట్టారని అన్నారు. సౌదీ అరేబియాలో ఇలాంటిది జరిగితే రాళ్లతో కొట్టి చంపుతారని అన్నారు.

నీట్ పేపర్ లీక్‌తో దాదాపు 40 మంది విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని దాసోజు శ్రవణ్ తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో మానసిక క్షోభ అనుభవించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారని ధ్వజమెత్తారు. జంతర్‌మంతర్‌లో విద్యార్థులు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ అన్నాడని తెలిపారు. ఢిల్లీలో దీక్ష, హైదరాబాద్‌లో విద్యార్థుల ఆక్రోశం నీట్ పేపర్ లీక్‌పైనే కాదు.. ఏళ్ల తరబడి అణచివేతపై పాలకులను నిలదీస్తున్నట్లుగా అర్థమవుతోందని అన్నారు. పాలనలో ఉన్న లోపాలను విద్యార్థులు ఎత్తిచూపినట్లు తెలుస్తోందని చెప్పారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బండి సంజయ్ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. విద్యార్థులకు వారు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370